# ఆణిముత్యాలు

## 2006

(ఈ సంవత్సరం సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సహజమార్గ అభ్యాసీ సోదరులు
లక్నో నగరంలో సెయింట్ కస్తూరిజీని దర్శించుకున్న సందర్భంలో పలు సందేహాలకు
ఆమె ఇచ్చిన వివరణాత్మక సూచనల, మార్గదర్శనాల 'కరదీపిక' ఇది)

## సెయింట్ కస్తూరి

ప్రచురణ:

**జె.డి.చతుర్వేది**

సి–830ఎ, పారిజాత, హెచ్. రోడ్
మహానగర్, లక్నో – 226 006

**AANIMUTYALU** **Rs. 80-00**
by *Saint Kasturi*

Edition:
**December 2006**

Typesetting:
**Vijaya Maruthi DTP**
SNPuram, Vijayawada.

Publisher:
**G.D. Chaturvedi**
C-830A, Parijatha,
H.Road, Mahanagar,
LUCKNOW-226 006

Printed at:
**Tulasi Offset Printers**
Arundelpet,
VIJAYAWADA - 520 002.

ప్రతి అభ్యాసీ హృదయము
నా ఇల్లు, ఆ ప్రతి ఇల్లు
నా ఆశ్రమము!

ప్రేమతో ప్రతి దానిని సాధించవచ్చు.
ధ్యానము తదితర సాధనలు దీనితో
పోల్చి చూచినచో ప్రాముఖ్యము
లేనివే అగును.

*- బాబూజీ.*

# ఆణిముత్యాలు

# 2006

బాబూజీ సాధన చేయటం నియమంగా పెట్టుకోవాలని చెప్పారు. సాధనలో ధ్యానమనేది అభ్యాసిని బాబూజీతో సంధానపరుస్తుంది. నేను సాధన చేస్తున్నాను, అభ్యాసం చేస్తున్నాను అని అనుకోవటం, మనం బాహ్యం నుంచి దివ్యం (Divine) వైపు మరలుతున్నట్లవుతుంది. కాని పదే పదే, నేను సాధన చేస్తున్నాను, దైవంతో సంబంధం కల్పించుకుంటున్నాను అనుకుంటూ వుండటం కంటే బాబూజీని స్మరణలో నిలుపుకొని బాబూజీ తనవారే అని అనుకుంటే ఐ (నేను) అనగా అహం తొలగిపోతుంది. అభ్యాసం చేస్తున్నాను అని అనుకోవటం సంస్కారమవుతుంది. భౌతికత్వంతో బంధనం కల్గి యుండటమవుతుంది. అలా కాకుండా ప్రాపంచిక వ్యవహారాలు నిర్వర్తిస్తున్నా, ఇంటిలో వున్నా, ఆఫీసు పనిలో వున్నా బాబూజీనే స్మరణలో నిలుపుకుంటే అది సంస్కారరహితమే కాకుండా దైవంతో సంబంధం కల్గియున్నట్లవుతుంది. మన హృదయం నుంచి 'నేను' అను భావం తొలగించుకున్నట్లయితే, బాబూజీ మనల్ని తన వారిగా చేసుకుంటారు. వారినే మదిలో (స్మరణలో) నిల్పుకుంటే మీరెక్కడ వున్నా, ఏ పని చేస్తున్నా బాబూజీ మహరాజ్ మీవారుగా, మీ సమీపంలో, మీ ఎదుటనే ఉన్నట్లుగా అనుభూతి చెందుతారు.

ఒకసారి బాబూజీ లాలాజీతో "నేనెల్లప్పుడూ నా చూపులోను, భావనలోను, హృదయంలోనూ మీ సన్నిధినే అనుభూతి చెందుతున్నాను, ఎందుచేత?" అని అడిగారు. అందుకు సమాధానంగా లాలాజీ – "నీ దృష్టిలో కాని, ఆలోచనలో కాని, నీ హృదయంలో కాని నీవు లేవు, అన్నింటా

నేను మాత్రమే వున్నాను కనుక నీవు అలా అనుభూతి చెందుతున్నావు" అని అన్నారు. అనగా బాబూజీ హృదయంలో లాలాజీకి తప్ప మరెవ్వరికీ చోటు లేదని, పూర్తిగా వారి స్మరణలోనే మునిగి యుండే వారని అర్థం చేసుకోవాలి. అదే విధంగా మనం కూడా బాబూజీ స్మరణలోనే మునిగి వుంటే మన మనోవాక్కాయ కర్మలందు వారి సామీప్యత, దర్శనం కల్గుతూ ఉంటాయి. అభ్యాసి తన హృదయంలోనే బాబూజీ వున్నారనుకొని, వారితో గాఢంగా అనుబంధాన్ని పెంచుకుని తన్మయమైనట్టి స్థితిలో, పెల్లుబుకుతున్న ప్రాణాహుతి ఫలితంగా, అభ్యాసికి చేరువలో అభ్యాసులు కాని వారెవరైనా వుండి యుంటే వారికి కూడా ఆ ప్రాణాహుతి యొక్క అనుభూతి కల్గుతుంది. దాని వల్ల లాభం కూడా చేకూరుతుంది. దైవం మనలో వున్నాడనుకోవటం ఒక ఆలోచన. తర్వాత దివ్యకాంతి మన హృదయమంతటా విరజిమ్ముతుంది. అపుడింక ఆలోచనలతోపని లేకుండా అనుభూతినే పొందుతూ వుంటాము. అనగా ఆలోచన యదార్థతగా మారుతుంది. అందుచేత ఆరంభంలో ఆలోచనకు తావిచ్చినా, తర్వాత అనుభూతిని పొందటానికి ప్రయత్నించాలి.

**ప్రశ్న :** అనుభూతి (ఎక్స్‌పీరియన్స్) అంటే ఏమిటి?

**జవాబు :** బాబూజీ మహరాజ్ యొక్క సామీప్యతానుభూతిని పొందటమే.

నేను అభ్యాసిగా చేరిన క్రొత్తలో బాబూజీ స్మరణ వల్ల నాకు ఒక విధమైన ఆనందానుభూతి కల్గుతూ వుండేది. కాని వారి యొక్క సామీప్యతానుభూతి కల్గేది కాదు. ఈ విషయం నేను బాబూజీ గారితో ప్రస్తావించుతూ - మీరు నాకు జ్ఞాపక మొస్తున్నారు కాని మీరు నాలో ఉన్న అనుభూతి రావడం లేదు. ఎందుచేత, అని అడిగా. దానికి సమాధానంగా, "నన్ను జ్ఞాపక ముంచుకోవట మనేది మొదటి దశ. ఆ తర్వాత నేను ఉన్నాను అని అనుభూతి చెందటమనేది రెండవదశ. ఆ

మొదటిదశ రెండవ దశకు దారి తీస్తుంది" - అని బాబూజీ చెప్పారు. తర్వాత తర్వాత నాకు వారి సామీప్యతానుభవం కల్గింది. అనగా వారి సామీప్యతానుభవం కల్గటం లేదేమో అను తపన లేదా ఆలోచన ఆ కోరుకున్న స్థితి కల్గడానికి సంకేతం లేదా సూచన వంటిది. ఆ స్థితి కల్గబోయే ముందు దానిని గురించిన ఆలోచన మనలో తలెత్తుతుంది. కనుక అభ్యాసి, తానేమీ పొందటం లేదనే నిరుత్సాహం అనవసరం. ప్రతి అభ్యాసి పొందటం ఖాయం. సహజ మార్గ సాధన అనేది అనుభూతితో కూడినది; హృదయంలో వారి సామీప్యతను పొందటానికి సాధన చేయాలి.

అభ్యాసులు, బాబూజీకి సిస్టర్ గారి పట్ల ప్రత్యేక అభిమానం వుండటం మూలంగానే అన్ని స్థితులు కల్పించారని మీరనుకుంటారేమో కాని ఆ అభిప్రాయం తప్పు. బాబూజీ నన్నొక్కరినే ఉద్ధరించటానికి లేదా ఉచ్ఛస్థితికి తీసుకెళ్ళటానికి రాలేదు. వారు అందరినీ ప్రేమిస్తారని, అందరినీ ఆ స్థితికి తీసుకు వెళ్ళటానికే వచ్చారని గుర్తించాలి. అయితే అందుకు బాబూజీ యొక్క స్మరణలోనే వుంటూ అందులోనే అనగా దైవంలోనే మునిగి యుండే ప్రయత్నం చేయాలి.

**ప్రశ్న: మేమంతా ఈ గ్రూపులో వున్నాం. కాని అందరమూ వారిని చూడలేదు. కాని వారి ప్రజన్స్ (దర్శనం) ఎలా అనుభూతి చెందగలం?**

జవాబు : మీరు శ్రీకృష్ణుని చూశారా? చూడలేదు. అయినా వారిని భక్తితో కొలుస్తున్నారు, వారి ఉనికి (ప్రజెన్స్) అనుభూతిని చెందుతున్నారు. ఇది కూడా అలాగే. వారి స్మరణలో మునిగి వారి ఉనికి యొక్క అనుభూతిని పొందుతూ వుంటే అభ్యాసులు కానివారు కూడా మనలో వున్న ఆ దివ్యమూర్తి యొక్క అనుభూతిని పొందుతారు.

నేను మొదటిసారి షాజహాన్‌పూరు వెళ్ళినపుడు కుర్చీలో ఆసీనులై యున్న బాబూజీని దర్శించాక, ఆ దివ్యపురుషుడు నా హృదయంలోనే సర్వదా నెలవై యుండాలనీ, అలా లేకుండా నేనీ భూమి మీద జీవించలేననీ అనిపించింది. ఆ తర్వాత క్రమంగా వారు ఎల్లప్పుడూ నాలోనే యున్నట్లు అనుభూతి చెందాను. షాజహానుపూరులో బసంత పంచమి సందర్భంగా బాబూజీ, ఈశ్వర్‌సహాయ్ గారితో "అందరూ నన్ను చూడాలని యిక్కడకు వచ్చినారు. కాని ఎవ్వరూ నన్ను "అసలు" చూడకుండానే తిరిగి వెళ్తున్నారు," అన్నారు. వారు సర్వత్రా వున్నట్లుగానే నాకు అనిపించేది.

**ప్రశ్న : బాబూజీలోని దివ్యత్వాన్ని మొట్టమొదటిగా గుర్తించిన వారెవరు?**

**జవాబు :** లాలాజీ గారే! ఎందుకంటే దీక్షతో తపస్సు చేసి అంతిమం నుంచి బాబూజీని అవతరింపజేసిన వారు వారే కనక, ఆ దివ్యపురుషుడు బాబూజీయే అని వారు గుర్తించారు.

నేను బాబూజీ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. నేను షాజహానుపూరు వెళ్ళినపుడు ఇంటి బయటకు వెళ్ళినా, లోపలకు వచ్చినా గదిలో వారే వున్నట్లుగా అనిపించేది. షాజహానుపూరు నుంచి మా వూరికి తిరుగు ప్రయాణమై పోయినపుడు, యింకా రెండు మూడు రోజులు వుండాలని నాకు అనిపించటమే కాకుండా, వారు కూడా నన్నలా ఆదేశించాలనిపించేది. అయితే, బాబూజీ మాత్రం - 'వెళ్ళు, త్వరగా బయల్దేరు, నీ బస్సుకు టైమయ్యింది" అని తొందరపెట్టేవారు. అది నాకు చాలా నిస్పృహ కల్గించింది. తర్వాత ఇంకోసారి షాజహానుపూరు వెళ్ళి తిరుగు ప్రయాణానికి సిద్ధమైనపుడు, వారు యింకా రెండు మూడు రోజులుండి వెళ్ళమనటమే కాకుండా, మా తల్లిగారిని కూడా అలా నేను వుండేట్లు ఆదేశించమని కోరారు. వారపుడు నాలోని తపనను అర్థం చేసుకున్నారు. నాలో వున్న ఆ సెపరేషన్ అనగా

దూరంగా వెళ్ళుతున్నట్లు చెందుతున్న వ్యథ (తపన) ను గుర్తించి వారలా స్పందించారని గ్రహించాను. నేను ఉక్రోషం పట్టలేక బాబూజీని – అప్పుడలా అన్నారు, ఇప్పుడిలా అంటున్నారేమిటి – అని ప్రశ్నించాను కూడా. అంటే హృదయంలో వారున్నట్లుగా అనుభూతి చెందటం, హృదయం 'వారి' కోసమే తపించిపోవటమూ ఈ మార్పు యొక్క ఆంతర్యం. ఆ విధంగా అభ్యాసులకు వారు ఆధ్యాత్మికోన్నతిని చేకూర్చుతారు. భౌతిక దేహానికి నశింపు వున్నది కాని, దివ్యత్వానికి నశింపు లేదు. అది ఎల్లప్పుడూ సజీవంగా, అందరిలోనూ అంతటా విరాజిల్లుతూనే వుంటుంది. బాబూజీ మనలోనే జీవిస్తున్నట్లుగా చెప్పేవారు. మనం కూడా అదే విధంగా వారిలోనే జీవించేటట్లుగాను, వారి దివ్యత్వంలోనే మునిగి యుండేటట్లుగాను సాధన చేయాలి.

**ప్రశ్న : బాబూజీ నిరంతరం మీ హృదయంలోనే వున్నట్లుగా అనుభూతి చెందటానికి ఎంతకాలం పట్టింది?**

**జవాబు :** షాజహాను పూరు వెళ్లి మూడుసార్లుగా వారిని దర్శించుకున్నాను. ఒకటిన్నర నెల రోజుల్లో నేనా స్థితికి వచ్చాను.

**ప్రశ్న : 'మనసు విలపించినపుడు ఆత్మ ఆనందిస్తుంది' అనటం వాస్తవమేనా?**

**జవాబు :** ఆ అభిప్రాయం తప్పు. మనస్సు విలపించటమనేది భౌతికమైనది. కాని ఆత్మ దైవం గురించి చెందుతున్న తపన మూలంగా మనసు అలా పరితపిస్తుంది. మనం శరీరంలో బందీగా వుంటున్నామంటే ఆత్మ కూడా బందీగా వున్నట్లే. అనగా బంధనంతో జీవిస్తున్నట్లే. మనం అలా అనుభూతి చెందుతుంటే ఆత్మ కూడా అదే అనుభూతి చెందుతుంది. అభ్యాసి యొక్క ఆధ్యాత్మిక స్థితిని కాపాడటానికి అతని ఆత్మపైన ప్రతికూల ప్రభావం పడకుండా బాబూజీ కాపాడతారు. వ్యక్తిగతంగా కష్టాలు ఎదురైనపుడు వాటిని గురించి అతిగా ఆలోచించకూడదు. అటువంటి సందర్భంలో బాబూజీ మన కళ్ళెదుటే

వున్నట్లుగా భావించుకుంటూ వారినే ప్రేమిస్తూ వారికే అంకితమవ్వాలి. అపుడు మనం కష్టాల నుంచి ఉపశమనం లేదా విముక్తి పొందుతాం.

శరీరమనేది ఒక బంధనం (బాండేజ్). అందువల్ల ఆ బంధనానికి కట్టుబడిపోకుండా 'నాలో జీవించండి' అని చెప్పారు బాబూజీ. అనగా దైవంలో, దివ్య సముద్రంలో మునిగి ఉండటమన్నమాట. బాబూజీ అభ్యాసికి ఒక స్థితిని కల్పించటమే కాకుండా దానిని నిలబెట్టారు. కష్టాల వల్ల స్థితికి భంగపాటు జరగటం కాని, ప్రోగ్రెస్ నిలిచి పోవటం గాని జరగదు. నిరంతరం కష్టాల గురించే ఆలోచిస్తూ వుంటే అవి యింకా ఎక్కువవుతాయి. ఎవరిని ప్రేమిస్తే అవి తగ్గుతాయో వారిని ప్రేమించాలి. ఎప్పుడూ మీ గురించో మీ కుటుంబం గురించో ఆలోచిస్తూ వుంటే దైవం గురించిన ఆలోచన లేనివారై దైవానికి యింకా దూరంగా జరిగిపోతుంటారు. ఆ విధంగా వాటి వూబిలోనే (బురదగోతిలోనే) కూరుకు పోతూ ఉంటారు. తపస్సు ద్వారా సహనశక్తిని పొందాలి. మానవులు కొంతమంది యితరులకు కష్టాలు కల్గించే ఆలోచనలు చేస్తూ వుంటారు. అది వారి స్వంత కష్టాలకూ మూల కారణమవుతుంది. ఇటీవల సేవాభావం, ప్రేమభావం లోపించిపోయాయి. బాబూజీ అందుకే మామూలు మానవుడిని మంచి మానవుడిగా అంటే అభ్యాసి యొక్క ప్రవృత్తిని మార్చటానికే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేవారు. అలా మనో నైర్మల్యం ఏర్పడితేనే అతనిలో దివ్యత్వం చోటు చేసుకుంటుంది. అందుచేత కష్టాలను, కలతలను నెమరు వేసుకుంటూ వుంటే సంస్కారాలకు కారణమవుతుంది. అలా కాకుండా దైవ స్మరణకే అర్పితమైపోతే సంస్కార రహితంగా వుండటమే కాకుండా సుఖశాంతులు పొందటం కూడా జరుగుతుంది.

ఒక అభ్యాసి బాబూజీతో – మీరెప్పుడూ మంచి వారుగానే అనిపిస్తారు, ఎందుచేత అని అడిగారు. దానికి సమాధానంగా బాబూజీ

ఏమన్నారంటే - నేనెల్లప్పుడూ మంచి చేయాలనే ఆలోచిస్తాను కనుక మంచివానిగా అనిపిస్తాను. నీవు కూడా ఎల్లప్పుడూ మంచితనంతోనే ఆలోచించినట్లయితే నీవు కూడా మంచివానిగానే గుర్తించబడతావు - అన్నారు.

సహజ మార్గ విధానం లేదా సాధనలో వున్న రహస్యం ఏమిటంటే నిరంతర స్మరణను కల్గి యుండటమే! దాని వల్ల దైవంతో సంబంధం ఏర్పడి దైవంలోనే జీవించటం జరుగుతుంది. అభ్యాసి మంచి ఆలోచనతో వుండి వారి స్మరణలోనే వుంటే బాబూజీయే అభ్యాసిలో జీవిస్తారు. బాబూజీ అందరినీ ప్రేమించి అందరిచేత ప్రేమించబడటానికే భూతలానికి దిగి వచ్చారు. ఆ నిరంతర స్మరణ వల్ల అభ్యాసీ యొక్క ఆలోచనలు, ఆచరణలు కూడా నిష్కల్మషమైనవిగా వుండి స్వంత వ్యవహారాల్లోనూ, ప్రాపంచిక వ్యవహారాల్లోనూ పవిత్రత పొడసూపుతుంది. అది గుర్తించిన యితరులు కూడా అటువంటి వారికి హాని తలపెట్టరు. ఒక అభ్యాసి బాబూజీని - మీరెవరిని బాగా ప్రేమిస్తారు అని అడిగినపుడు - 'నేను నన్ను ద్వేషించే వారిని బాగా ప్రేమిస్తాను' అన్నారు. అలా ఎందుకంటే అలాటి వారిలో ప్రేమ బీజాలు దివ్యత్వం నాటటానికే, అని చెప్పారు. వారు అందరినీ ప్రేమించటానికే వచ్చారు కాని ఎవరినీ ద్వేషించటానికి రాలేదు.

ఒక అభ్యాసి బాబూజీ మహిమ తెలియక రైలు ప్రయాణంలో తన ప్రవర్తన సరిగా లేకపోయినప్పటికీ బాబూజీ తనపై ఎంతో ప్రేమను వర్షింపజేసినట్లుగా తన అనుభూతిని గుర్తు చేసుకున్నాడు. ఆ తర్వాత కూడా బాబూజీ రూపం తన ముందు కన్పిస్తూ వుండేదని చెప్పాడు. వారికెదురుగా సీటులో కూర్చున్నపుడు వారి దివ్యత్వాన్ని అనుభూతి చెందినట్లు అన్నాడు. అప్పటి నుంచీ వారు తన మదిలో నిలిచిపోయినట్లుగా వివరించాడు.

బాబూజీని నిరసించేవారు కొంతమంది 'వారి'కి దూరంగా వుండటానికి ప్రయత్నించేవారు. వారిలో ఆ విముఖత్వాన్ని తొలగించి ప్రేమభావం ఉత్పన్నం చేయాలన్న తలంపుతో బాబూజీ వారి దరి జేరేవారు. కుటుంబంలోని ప్రపంచ జ్ఞానం తెలియని అతి పసివారిని గురించి తల్లి ఎలా శ్రద్ధ వహిస్తుందో అదే విధంగా బాబూజీ వారి పట్ల శ్రద్ధ వహించేవారు.

ప్రశ్న : నైనిటాల్‌కు చెందిన అభ్యాసి ఒకరు "బాబూజీ ఒకానొక సందర్భంలో తన దివ్యశక్తి 2 వేల సంవత్సరాలు నిలిచి వుంటుందని" చెప్పినట్లుగా విన్నాను – వివరిస్తారా?

జవాబు : అభ్యాసుల్లో తపన వుంటే ఆ దివ్యత్వం నిలిచి వుంటుంది. తపన అంటే కేవలం వారిని తలచుకోవటం కాదు. అది హృదయపూర్వక మైనదిగా వుండాలి. ఆశ్రమంలో దివ్యత్వం 500 సంవత్సరాలు విరాజిల్లుతూ వుంటుందన్నారు. కాని అదెప్పుడు జరుగుతుందంటే – సహజ మార్గాన్ని అనుసరించేవారు, ఆధ్యాత్మిక ప్రగతికి సాధన చేసేవారు అక్కడున్నపుడు మాత్రమే ఆ దివ్యత్వం అక్కడ నిలిచి వుంటుంది. ఒకవేళ అటువంటి సాధన కొద్దికాలం నిలిచిపోయినప్పటికి, మళ్ళీ దానిని పునరుద్ధరించినపుడు ఆ దివ్యత్వం ప్రభావితమవుతుంది. మన సహజమార్గ విధానము, దివ్యత్వము ప్రకృతిలో శాశ్వతంగా సుస్థిరం చేయబడ్డాయి.

ఒక అభ్యాసి బాబూజీతో – మేమిక్కడ వున్నంత సేపు మీరు ఒక దివ్య పురుషునిలాగే అనిపిస్తున్నారు. కాని యింటికి వెళ్లిన తరువాత అక్కడ ఆ అనుభూతి కల్గటం లేదు – అన్నాడు. అంటే అభ్యాసీ తన హృదయంలో బాబూజీని గాఢంగా ప్రేమిస్తూ వారికై తపిస్తూ వుంటే ఆ అనుభూతి ఎప్పుడూ కలుగుతూ వుంటుంది. అలా కాకుండా తాత్కాలికంగా బాబూజీ దివ్యపురుషుడు అనుకుంటూ ముఖస్తుతి లాగ చేస్తే ఆ అనుభూతి కలగదు.

రాముడు, కృష్ణుడు వంటి దివ్య పురుషులు ప్రకృతి యొక్క ప్రత్యేక అవసరం తీర్చటానికి ఈ భూమి మీద అవతరించి వారి బాధ్యత నెరవేరిన తరువాత దివ్య తలానికి తిరిగి వెళ్ళిపోయారు. ప్రాపంచిక వ్యవహారాల్లో, భోగభాగ్యాలలో మునిగిపోయిన మానవాళిలో దైవస్మరణ, దివ్యానందం కొరవడిన కారణంగా ఆ దివ్యత్వాన్ని తిరిగి మానవులలో చైతన్యపరచటానికే బాబూజీ ఈ అవని మీద అవతరించారు. ప్రకృతి ననుసరించి జీవించేలాగున, పరమాత్మునికై పరితపించేట్టు చేయటమే వారి సంకల్పం. అందరి పట్ల సోదరభావం, ప్రేమభావం పెంపొందాలన్నదే వారి ఆదేశం.

దైవం సర్వవ్యాపి. ప్రకృతి అవసరం నిమిత్తం వివిధ రూపాల్లో అవతరణ జరుగుతుంది. రాముడు, కృష్ణుడు అవతరించబోయే ముందు ఆ తల్లులకు విరాట్ రూపంలో దర్శనం కల్గింది. దివ్య తేజస్సు ప్రకృతిలో వ్యాపిస్తుంది. ప్రకృతి యొక్క వాతావరణంలో పవిత్రత, దివ్యత్వం సమకూరతాయి. బాబూజీ చెప్తూ వుండేవారు - దైవ క్షేత్రాలూ, తీర్థాలంటూ జనం ఎక్కడెక్కడికో తిరుగుతుంటారు. అందుకు ధనం, సమయం, శక్తి ఖర్చవుతాయి. మాట మాత్రంగా - మనసనే మందిరంలో దేవుడు నెలకొని వున్నాడు' అని అంటారే కాని తనలోనే వ్యాపించి యున్న ఆ దైవాన్ని, దివ్యకాంతిని గుర్తించి ఆరాధించలేరు. దైవం పేరిట ఒక మూర్తి (విగ్రహం) తయారుచేసి అందులో దైవాన్ని నెలకొల్పి ఆరాధిస్తూ వుంటారు. అంటే లోన ఉన్న దైవాన్ని వెలికి తీసి ఆ దైవాన్ని ఆరాధించే అజ్ఞానం అలుముకుపోయింది. మనలో ఉన్న ఈశ్వరాంశను గ్రహించి, హృదయంలో దాన్ని నిలుపుకొని ఆ ఈశ్వరత్వాన్ని పొందేటందుకు సాధన చేయాలి. ఒకసారి వారు మా యింటిలో వున్న ఫోటోలను చూస్తూ ఎవరెవరివి అని అడిగారు. నేను రాముడు కృష్ణుడు - యిలా చెప్పాను. అపుడు - రాముడు ఈ

ఫొటోలోనే వున్నాడా! అది లేకుండా స్మరించలేవా? అన్నట్లుగా అడిగారు. అపుడు నా కర్థమయ్యింది - మన హృదయంలోనే మన యిష్ట దైవం కొలువై యున్నారు కాని, చిత్రాలు, విగ్రహాలలో కాదని. కనుక విరాట్ అనగా ఈశ్వరుడు సర్వవ్యాపి అని అర్థం చేసుకోవాలి.

**అభ్యాసీ : మన విధానంలో ధ్యానం చేసే సమయంలో బాబూజీ వున్నట్లుగా దివ్యకాంతి వున్నట్లుగాను లేదా శూన్యత్వం వున్నట్లుగాను భావించుకోవాలంటారు. ఇందులో ఏది సరైన విధానం?**

జవాబు : భౌతికరూపం మీద దృష్టి నిలపటం కాకుండా ఆ దివ్యత్వం మీదనే దృష్టిని కేంద్రీకరించాలి. బాబూజీ కుర్చీలో కూర్చుని వున్నట్లుగానో, మరో విధంగానో కాకుండా వారి దివ్యత్వాన్ని గురించే ధ్యానంలో నిలుపుకోవాలి. అందుకే బాబూజీ 'అభ్యాసులు నన్ను చూడటానికి వస్తారే కాని నా వాస్తవ దర్శనాన్ని పొందలేరు' అని వ్యాఖ్యానించేవారు. ధ్యానంలో గాఢంగా మునిగి యుండటం వల్లనే ఆ దివ్యత్వం యొక్క అనుభూతి కల్గుతుంది. బాబూజీ యొక్క సామీప్యత మరియు వారి యొక్క నిరంతర స్మరణ ద్వారా కూడా దివ్యానుభూతి కల్గుతుంది. బాబూజీ సర్వవ్యాపి, కేవలం రూపానికే పరిమితం కాదు. అలాగే దైవం మందిరాలలోని విగ్రహాలలో మాత్రమే వున్నాడని భావించటం కూడా అజ్ఞానమే. మానవాళి అంతా భగవంతుని సృష్టియే. అందరిలోనూ భగవదంశ వుంది. మనలోని ఆ దైవాన్ని తరలించి దూరంగా వుంచి, దైవానికి దూరం కావటం సరికాదు. అందుచేత మనమందరమూ భగవంతుని చేత సృష్టించబడిన వారమేనని, దైవం మనలోనే వున్నాడని, ఆయన మనల్ని ప్రేమిస్తున్నాడని, కాపాడుతున్నాడని భావన చేసి హృదయంలో ఆ అనుభూతిని నింపుకుంటే ఆ దైవ సాక్షాత్కారాన్ని పొందగల్గుతాం. ధ్యానంలో మొదట రూపం దర్శనమిచ్చినా ఆ తర్వాత

రూపు తొలగిపోయి దివ్యత్వమే దాని స్థానంలో నిలుస్తుంది – అని బాబూజీయే చెప్పారు. కాని మనం దేనిని కోరుకుంటామో అదే దర్శనమౌతుంది. అయితే రూపం – లేదంటే దివ్యత్వం. అది మనం చేసే భావన మీద ఆధారపడి వుంటుంది.

నేను మొదటిసారిగా షాజహానుపూరు వెళ్ళినపుడు వారిని (భౌతిక రూపము) చూడకుండా జీవించలేననిపించింది. అలా మరికొన్ని సార్లు వెళ్ళివచ్చాక, మూడు నాలుగు మాసాల్లోనే వారిని కళ్ళలో కాకుండా హృదయంలో నిలుపుకోవటం మూలంగా ఆ భౌతిక శరీరం మీద ధ్యాసపోయి వారి దివ్యత్వం మీదనే నా స్మరణ నిలిచిపోయింది. అంటే భౌతిక భావం పోయి హృదయానుభూతిగా పరివర్తనం చెందింది.

ధ్యాన సమయంలో మన హృదయంలో దివ్యజ్యోతి వుందని అనిపించి, అది అలాగే కాంతివంతంగా నిలిచినట్లయితే దాని ద్వారా బాబూజీ దివ్యత్వం శరీరమంతటా వ్యాపించినట్లవుతుంది. దివ్యజ్యోతి అనేది ఆధ్యాత్మిక సాధనలో ఒక తొలి అనుభవం. అది క్రమేణా బాబూజీ నుంచి వచ్చే ప్రాణాహుతిగా అనుభూతినిస్తుంది. ఇందులో మొదటిది ఒక ఆలోచన లేదా సంకల్పం కాగా రెండవది అనుభూతిగా అవుతుంది. ఈ రెండూ ధ్యాన సమయంలో అనుభవమవుతాయి.

ప్రశ్న : సంస్కారాలు శుద్ధి చేయబడటం లేదా సంస్కరించబడటం అంటే ఏమిటి?

జవాబు : వాటిని నిరంతర స్మరణ ద్వారా సంస్కరించుకోవచ్చు. ఒక సమావేశంలో, ధ్యానంలో క్లీనింగ్ చేసుకోవటానికి ఉత్తమ విధానమేది – అని ఒకరు ప్రశ్నించారు. అపుడు బాబూజీ నన్నుద్దేశించి నా అభిప్రాయం చెప్పమన్నారు. అపుడు నేనిలా చెప్పాను. "ధ్యానసమయంలో ప్రాణాహుతి

శక్తి అభ్యాసులందరికీ ప్రసారమవుతుంది. ఆ సమయంలో ప్రాణాహుతి ప్రసారానికి ఏవైతే అడ్డుగా నిలుస్తాయో లేదా అవరోధంగా వుంటాయో వాటిని తొలగించగా, ఆ క్లీనింగ్‌లో ఏమి జరిగిందనేది అభ్యాసి అనుభవానికి తెలియాలి. అదే ఉత్తమ విధానం" అని చెప్పాను. బాబూజీ భాషలో జడత్వం లేదా అనర్థమైనదేమిటో మనకు తెలియదు కనుక, బాబూజీయే దాని క్లీనింగ్ బాధ్యత వహిస్తారు.

ప్రశ్న : ఆధ్యాత్మిక యాత్రలో ఎంత పురోగతిని సాధించామో తెలుసుకోవటమెలా?

జవాబు : బాబూజీతో మనమెంత సామీప్యతను అనుభూతి చెందుతామో దానిని బట్టే మన పురోగతిని అంచనా వేయవచ్చు. మన పుస్తకాలలో వ్రాయబడిన పాయింట్స్ అనేవి అభ్యాసులకు కొంత తికమకగా లేదా అయోమయంగా తోచవచ్చు. సహజమార్గ విధానంలో ఆ పాయింట్స్ అనేవి అభ్యాసి యొక్క ఆధ్యాత్మికతకు చెంది ఎలా పనిచేస్తాయో తెలిపేటటువంటి బాబూజీ యొక్క పరిశోధనాంశాలు. వాటిని బాబూజీ వివరించారు.

అభ్యాసి యొక్క ఆధ్యాత్మిక పురోగమనంలో భక్తి, ప్రేమ అనేవి రెండు ప్రధానాంశాలు. స్థితులు గురించి పుస్తకాలలో వివరించబడ్డాయి. వాటి ఆధారంగా మీరొక స్థితిలో వున్నామని అనుకున్నా, వాస్తవంగా మీరా స్థితిలో వుండి యుండకపోవచ్చు. అది కల్పితమవుతుంది.

ప్రశ్న : ఉదయమే ఇంటి పనులు, వంటా వార్పులో నిమగ్నమయ్యే స్త్రీలు ధ్యానానికి సిద్ధమయ్యే ముందు స్నానాదులనాచరించాల్సి వుంటుందా?

జవాబు : దానికే మాత్రమూ ప్రాధాన్యత లేదు. ఎందుకంటే స్నానమనేది భౌతిక శరీర శుభ్రతకు సంబంధించిదే కాని ఆంతరిక దివ్య స్థితులకు గాని, దివ్య ప్రాణాహుతికి గాని చెందినది కాదు. దశ నియమాలలో చెప్పినట్లుగా

ఆచరణ వుంటే చాలు. విగ్రహారాధన చేసేవారికి అటువంటి నియమాలు ఆదేశించబడ్డాయి. మీరు సహజమార్గములో పాదం మోపిన తర్వాత ఆంతరిక స్థితికి, ఆధ్యాత్మిక ప్రగతికి ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలి. ఒక అభ్యాసి అనారోగ్యానికి గురైనప్పుడు ఇతర బాధ్యతలతో పాటు దివ్యత్వానికి చెందిన విధులు కూడా నిర్వహించలేక పోయినపుడు సమయపాలన పాటించలేనపుడు దానిని తప్పుగా భావించటం కాని, దివ్యత్వం దిగజారిపోతుందని దిగులు చెందటం కాని తగదు. అతడు నిరంతరణ స్మరణ, మాస్టర్ పట్ల ప్రేమ కల్గియున్నట్లయితే అవి అనగా ఆ లోపాలు లెక్కకు రావు.

ప్రశ్న : మానవ జీవితానికి లక్ష్యమేమిటి, దానిని పొందటమెలా?

జవాబు : మీరు మన ఈ విధానంలో ప్రవేశించారు కనుక 'ఎలా' అనే ప్రస్తావన వదిలేయండి. ఆ గమ్యం లేదా లక్ష్యం చేరటానికిదే ఏకైక మార్గం.

సాక్షాత్కారం పొందటమనేది లక్ష్యం. దానిని తెలుసుకోవటమనేది కాకుండా వారిలో లయం, అంతర్లీనం కావాలి. అందువల్ల అభ్యాసి సాక్షాత్కారం పొందటాన్ని తన జీవిత లక్ష్యంగా నిర్ణయించుకోవాలి. ఆ పిమ్మట ఈశ్వరప్రాప్తి అనేది బాబూజీ చేతుల్లో వుంటుంది.

ప్రశ్న : కష్టాలు భగవంతుడిచ్చిన వరాలు అన్నారు కదా! అదెలాగో వివరించండి? అందులో నిగూఢమైన రహస్యముందని వాటి ద్వారా అభ్యాసికి చాలా అనుభవం వస్తుందని ట్రూత్ ఎటర్నల్ గ్రంధం చెప్పడింది. అదేమిటి? వివరించండి!

జవాబు : కష్టాలు లేదా బాధలు అనేవి క్రొత్తగా సహజమార్గంలో చేరిన వారికి మాత్రమే. అనగా వారికి శారీరకమైన నొప్పులు వంటివి అనుభవానికి వస్తూంటాయి. ఎందుకంటే యింతకు ముందు వారు మూర్తి పూజకు అలవాటు పడి వుంటారు. కాని యిక్కడ మౌనంగా దీక్షతో

కూర్చోవటం మూలంగా కొన్ని బాధలు అనిపించవచ్చు. కాని మన విధానంలో ధ్యానంలో కూర్చుని బాబూజీని స్మరించుకొని మనల్ని మనం మరచిపోవటం వల్ల అనగా శరీరాన్ని గురించిన ఆలోచనే వుండదు. కనుక దాని బాధలు అనుభవానికి రావు. బిడ్డలు తమ సమస్యల్ని లేదా యిబ్బందులను తల్లికి చెప్పుకున్నట్లే మనం బాబూజీకి నివేదించుకుంటే మనకు ఉపశమనం కల్గుతుంది. వారే మనకు మూలం లేదా సర్వస్వమనే అనుభూతితో వుండాలి. అప్పుడు వారు వాటి బారి నుండి కాపాడి సాక్షాత్కారం కల్గిస్తారు. ధ్యానంలో ఆంతరికంగా మన అనుబంధం అంతా దైవంతోనే. అభ్యాసి ఒంటరిగా వున్నపుడు దైవమే తోడుగా వుంటాడు. సాధన నుంచి బయట ప్రపంచంలోకి వచ్చినపుడు తల్లి, తండ్రీ, భార్యా బిడ్డలు వంటి సంబంధాలు గుర్తుకు వస్తాయి.

ప్రశ్న : మోడరేషన్ అంటే ఏమిటి?

జవాబు : ఇది సామ్యావస్థ లేదా సమతుల్యత. ఆంతరికంగా అన్నిటి పట్ల, అందరిపట్ల సమభావం. కష్టాలకు కుమిలిపోవటం, సుఖాలకు సంబరపడిపోవటం కాకుండా కష్టసుఖాలు కావడి కుండలు అన్న రీతిలో అవన్నీ మామూలే అని అనుభూతి చెందటం జరుగుతుంది. దాని వల్ల మన ఆధ్యాత్మిక స్థితి లేదా ఆంతరిక స్థితి చెక్కు చెదరదు. సమాజంలో బాహ్యంగా మన ప్రవర్తనలో కూడా యిష్టాయిష్టాలు కాని, ప్రేమ ద్వేషాలు కాని ప్రత్యేకంగా వెల్లడి కాకుండా అన్నీ సమస్థాయిలో నిర్వర్తించబడతాయి.

ప్రశ్న : మనమీద గ్రహాలు, నక్షత్రాలు ఎటువంటి ప్రభావాన్ని కలుగజేస్తాయి?

జవాబు : అవన్నీ భౌతిక పరమైనవి. వాటి ప్రభావం మనమీద వుందని వూహించుకొంటారు. ఆ తర్వాత వాటి వల్ల దుష్ప్రభావం వుందని ఎవరైనా పండితులు చెప్పినపుడు ఆందోళన చెందుతారు. అందుచేత అవి కూడా

ఈ సృష్టికి చెందినవే అనుకొని వాటిని గురించి భయపడకుండా గుండె నిబ్బరం చేసుకుంటే ఎటువంటి పరిణామమూ ఉండదు.

**ప్రశ్న : మన సహజమార్గం మీద జ్యోతిషశాస్త్రం యొక్క ప్రభావం వుంటుందా?**

**జవాబు :** ఇవి రెండూ వేర్వేరు విద్యలు. ఎవరి నమ్మకం వారిది. సహజమార్గం మీద విశ్వాసం వుంటే అంతా దైవమే చూస్తాడు. జ్యోతిష శాస్త్రంతో చేసే అంచనాలు ఉదాహరణకు గ్రహస్థితులను సరిచూసి వధూవరులను ఒకటిగా చేసినా విడిపోవటమూ తటస్థించుతూనే వుంది గదా! అందుచేత ఇటువంటి వాటిని గురించి ఆలోచిస్తే మైండు కలగాపులగం అయిపోతుంది. సహజమార్గం దైవం మీద ఆధారపడి వుంటుంది. మనమొక పిల్లవాని జాతకం తీసుకుని ఒక సిద్ధాంతిని కలిస్తే ఏదో సమస్య వుండి వచ్చామనుకుని, ఏవో కారణాలు నివారణోపాయాలు చెప్పుతాడు. కాని మనం ఏ విధి విధానం మీద నమ్మకముంచామో దానిని ఆశ్రయించాలి, అనుసరించాలి.

**ప్రశ్న : మానవుని మనస్తత్వాన్ని, ప్రవర్తనావళిని ఏ శక్తి నియంత్రిస్తోంది?**

**జవాబు :** దైవశక్తియే అన్నిటినీ నియంత్రిస్తుంది. అయితే మనస్సుకు ప్రాధాన్యత నిచ్చినపుడు అది సహజత్వాన్ని చెదరగొట్టోంది. అందుచేత మానసిక దౌర్బల్యాన్ని అరికట్టి ఆచరణలోను, అనగా ప్రవర్తనలోను, ఆలోచనలోను సమతుల్యతను సాధించి పెట్టగల్గేది మన సహజమార్గం మాత్రమే.

**ప్రశ్న : ఈశ్వరుడు, భూమా మరియు బాబూజీల పాత్ర ఏమిటి?**

**జవాబు :** ఈ ప్రశ్న మనకు రావలసినది కాదు.

భూమా సృష్టి శక్తి. ఈశ్వర్ అనగా ప్రకృతి. ప్రకృతి క్రమం దారి తప్పి పెడదారి పట్టినపుడు దానిని సరిచేయటానికి లాలాజీ వంటి

మహనీయులు ఆ సృష్టి శక్తిని రప్పించి దానిని సరిచేయవలసి వస్తుంది. అందుకొరకు ఆ భూమాశక్తి సహితంగా వచ్చినవారే బాబూజీ. ప్రకృతి కార్యం నిర్వహించటానికి ఏ శక్తి పనిచేస్తుందో అదే భగవంతుడు లేదా దైవం. ఆ దైవం ఒకే ఒక్కడు. అంతటా వున్నాడు.

ధ్యానం చేసేటపుడు దైవం అనే భావం పెట్టుకోవాలే కాని రూపం మీద కాదు. ఫొటో అనేది బాబూజీ ప్రతిరూపం. 'అసలు' బాబూజీయే కనుక వారినే మదిలో నిలుపుకొని ధ్యానం చేయాలి. బాబూజీతోనే అనుబంధం పెంచుకొని ఏ అనుభూతి (ఫీలింగ్) వస్తుందో దానిలోనే మునిగియుంటే ఆ పరమానందం కల్గుతుంది. ఫోటో అనేది శాశ్వతంగా నిలవదు. బాబూజీ యొక్క తలంపుయే మనకు ముఖ్యం.

ప్రశ్న : పుస్తకాలలో భగవంతుని గూర్చి వర్ణన వుంటుంది. కాని మన సహజమార్గ విధానంలో భగవంతుడు అంటే ఏమనుకోవాలి?

జవాబు : భగవంతుడు అంటే భగవంతుడే. ఆయన ఒకే ఒక్కడు. సిస్టమ్ ఏదైనా కానీయండి భగవంతుడు అంటే ఒక్కడే కాని మార్పులేదు. భగవంతుడు అంటే సృష్టికార్యాన్ని నిర్వహించేవాడుగా వుంటాడు. సృష్టికి మూలం భూమా. సృష్టి ప్రారంభానికి ఎంత శక్తి అవసరమో అంత శక్తి ఆ పరమశక్తి భూమా నుంచి వీడి వచ్చి అవసరమైన సృష్టి రచన జరపటం జరిగింది. ఆ భగవంతుడు లేదా దేవుడు ఆ భూమా శక్తికి అతి సమీపంలో వున్నవాడుగా వుంటాడు. ప్రకృతి కార్యానికి ఎంత శక్తి అవసరమో అంతే శక్తి దైవం నుంచి వెలువడుతుంది. దేవుడే కాని, స్త్రీదైవము అనేది లేదు. భగవంతుడు అనే పదానికి నిర్వచనంగా బాబూజీ – 'ఉన్నదెవరో వారు ఉన్నారు' అని చెప్పారు.

ప్రశ్న : మైండు (మనసు) చెదిరినపుడు ఆధ్యాత్మిక స్థితి మీద ప్రభావం చూపుతుందా?

**జవాబు :** అటువంటిదేమీ జరగదు. మనస్సు చెదిరిందంటే దానికి ఏదో కారణం వుంటుంది. దాని మూలంగా మన దృష్టిని బాబూజీ మీద నుంచి మరల్చి దాని వైపు ధ్యాస నిల్పుతాము. అపుడు మనకు ఆధ్యాత్మిక స్థితిని గురించిన ఆలోచన, అనుభూతి దృష్టికి రావు. అటువంటి సందర్భంలో మనం ఆ భంగం కల్గిన స్థితి నుండి మళ్ళీ పూర్తిగా ఆధ్యాత్మిక స్థితిలోకి రావాలంటే, ఒక్కసారి కళ్ళు తెరచి, ప్రేమతో బాబూజీని స్మరించుకొని, భంగపాటు కల్గించిన ఆ కారణాన్ని నివేదించుకుంటే అది తొలగిపోయి మనకు ప్రశాంతత చేకూరుతుంది. మన దృష్టి మళ్ళీ ధ్యానంలో లగ్నమవుతుంది.

ప్రశ్న : పాయింట్స్ లేదా చక్రాలను గురించి వివరించండి?

**జవాబు :** వాటిని గురించి మనం ఆలోచించాల్సిన అవసరం లేదు. చక్రాలు ఆరు. మనం షట్చక్రాలు అంటాము. అలాగే పాయింట్స్ అనేవి చాలా సూక్ష్మము. లెక్కలేనన్నివిగా వుంటాయి. వీటినన్నింటినీ దాటుకుంటూ అందరూ గమ్యం చేరుకుంటారు. సహజమార్గ విధానంలో ఆగిపోవటమంటూ వుండదు. చక్రాలు అనగా శక్తికేంద్రాలు. అవన్నీ తెరచుకోబడతాయి. అది సాధన మీద ఆధారపడి వుంటుంది. అందుకే బాబూజీ 'ఓపెన్ యువర్‌సెల్ఫ్' అని అన్నారు. అనంతయాత్ర యొక్క ఐదు సంపుటాల్లో వాటిని వివరించటం జరిగింది. పుస్తకాలు చదివినంత మాత్రాన అవి అర్థం కావు. మన మా స్థితులు పొందినపుడే అర్థమౌతుంది. అనుభవం ద్వారా మాత్రమే వాటిని గ్రహించగలం. అనుభూతికి శబ్దం లేదు కనుక దాన్ని మాటల్లో వ్రాయటం కూడా కష్టమే.

బాబూజీ అనుగ్రహం వల్ల వారు మనల్ని పురికొల్పటం (ప్రేరేపించటం) వల్లనే వాటిని గురించి వ్రాయగల్గుతాం. మనకు బాబూజీ దర్శనం కల్గినపుడు కూడా ఆ అనుభూతిని గురించి వ్రాయటం సులభసాధ్యం కాదు. అందుచేత బాబూజీతో అనురాగబంధం (ఎటాచ్‌మెంట్) ఎంత ఎక్కువగా వుంటే అంత మంచిది. ఉదాహరణకు - షాజహాన్‌పూరు వెళ్ళటానికని అభ్యాసులు రైలులో ఎక్కుతారు. కొంతమంది ఏయే స్టేషన్లు వస్తున్నాయి, రైలు ఎంత వేగంగా ప్రయాణిస్తోంది, ఆయా ప్రాంతాలెలా వున్నాయి - అని పరిశీలిస్తూ వుంటారు. మరికొందరు ప్రశాంతంగా ఏ ధ్యాస లేకుండా విశ్రాంతి పొందుతారు. చివరకు అందరూ గమ్యం చేరుకుంటారు. ఇక్కడ రైలు ఎక్కడమే ప్రధానమెలాగయ్యిందో, సహజమార్గంలో చేరటమనేది కూడా ప్రధానాంశమే. ఆధ్యాత్మిక ప్రయాణం కొనసాగి గమ్యం చేరతాము. అందుచేత పాయింట్స్, చక్రాలను గురించిన ఆలోచన అనవసరం.

సహజమార్గ చిహ్నంలో స్వస్తిక్ మార్క్, మిట్టపల్లాలు, మెలికలూ, వెలుగు చీకట్లూ ఎన్నో దాటుకుంటూ వెళ్ళాక సత్యపద్ కన్పిస్తుంది. బాబూజీతో ఎటాచ్‌మెంట్ అనగా ఏ పనిలో వున్నప్పటికి నిరంతరం వారి ఆలోచన, వారి పట్ల భక్తి, ప్రేమ, వినమ్రత ఎంత ఎక్కువగా అభివృద్ధి చేసుకుంటే అంత త్వరగా సత్యపద్ చేరుకుంటాం. శ్రీరామచంద్ర మిషన్‌లో చేరాము అంటే ఆ సహజమార్గ విధానము మనల్ని ఆ దైవం అనగా బాబూజీతో సంధానపరుస్తుంది. మనం భక్తి శ్రద్ధలు పెంచుకుంటే మనల్ని దరిచేర్చటం - గమ్యం చేర్చటం బాబూజీ యొక్క బాధ్యతగా వుంటుంది. ఇనీషియేషన్ అంటే అభ్యాసిని దివ్యత్వంతో సంధానపరచటం, సాధన ద్వారా సమీపింపచేయటం. బాబూజీ మహరాజ్ నావారు, అనుకుంటూ బాబూజీ

మహరాజ్‌తో నేను మీ వాడిని అంటూ బాంధవ్యం నెరపుకుంటే మనం వారికి అత్యంత సన్నిహితులమై వారి అనుగ్రహం పొందుతాం. మనం మిషన్‌లో చేరటంలో వుద్దేశ్యం మనం బాబూజీ సాన్నిధ్యం పొందటానికే.

ఈశ్వరుడు అందరిలో ఉన్నాడు. అంటే మనలోనూ ఉన్నాడు. మనసనే మందిరంలో దైవం వున్నాడు అంటాము. ధ్యానంలో కూర్చోవటం అంటే వారిని ధ్యానంలో నిలుపుకోవటం. అలాగే ఏ పని చేస్తున్నా ఎల్లవేళలా వారినే జ్ఞాపకం ఉంచుకోవటం. కాని మనం దైవం సర్వశక్తి యుతుడు అని తెలిసి కూడా దైవాన్ని మర్చిపోయాం. జీవునికి పరమాత్మతో సంబంధం వుంది - అనే విషయాన్ని కూడా గ్రహించాలి. కనుక ధ్యానం ద్వారా వారికి సన్నిహితమవుతూ వుంటే మనకు ఆ పరమానందం కల్గుతుంది.

బాబూజీ మహరాజ్ వద్దకు మధురై ఆలయంలో పనిచేసే పూజారులిద్దరు వచ్చారు. వారు ధ్యానంలో కూర్చోలేకపోతున్నాం అని బాబూజీకి చెప్పారు. అపుడు బాబూజీ వారితో - మీరు రోజంతా దైవంతోనే వుంటారు. అర్చనలు, హారతులూ యిస్తూ వుంటారు గదా మరి - అని అడిగారు. బాహ్యమైన ఆచరణ మీద కాకుండా ఆంతరికంగా వున్న దైవాన్ని ఆరాధించమన్నారు. అంటే దీని అర్థం - వారు యాంత్రికంగా వృత్తిరీత్యా ఆ బాధ్యతలు దేవాలయంలో కొనసాగిస్తున్నారే కాని హృదయపూర్వకంగా దైవాన్ని కొలవటం లేదు. తమ ఆంతరికంలోని అంతర్యామి పైన శ్రద్ధ వహించలేకపోతున్నారు. దైవాన్ని చేరే మార్గం వారికే తెలియనపుడు యితరులనెలా దైవం దగ్గరకు చేర్చగలరు. అందుకనే బాబూజీ - ధ్యాన్ రఖో - అనగా మనలోనే వున్న ఆ దైవం మీద దృష్టి నిలుపు అని చెప్పేవారు.

భారతదేశంలో ఎంత మంది జనాభా వున్నారో వాళ్లందరూ సాధువులే అని ఒకరు వ్యాఖ్యానించారు. అంటే పైకి కనిపించేదదే కాని ఆంతరికంగా

సాధు గుణాలు లేవు. రామాయణ, భాగవతాది గ్రంథాలు పారాయణం చేస్తుంటారు! పురాణ కాలక్షేపం చేస్తుంటారు. కాని వాటిలోని అంతరార్థం గ్రహించటం కాని, జనానికి గ్రహింపజేయటం కాని చేయరు. మర్మగర్భితమైన భక్తిభావాన్ని గాని, సహన శీలతను గాని, త్యాగాన్ని గాని నీతిని గాని విడమర్చి బోధించే ప్రయత్నం చేయరు. అలాగే శ్రీరాముని పట్ల హనుమంతుడు కల్గియున్న భక్తి విశ్వాసాలు, త్యాగాన్ని గురించి బోధించరు. కేవలం కథా శ్రవణం లాగా జరిపేస్తుంటారు. మనం పూర్తిగా ధ్యానంలో నిమగ్నమైపోగా అనగా దైవంతో గాఢమైన సంబంధం కల్గియున్నపుడు ఏవైనా ఆలోచనలు అనుభూతులు వంటివి వచ్చినా మనం వాటికి స్పందించకుండా, సహించలేనంతగా అయిపోతాము. దీక్షగా వారి దర్శనభాగ్యం కొరకే ఎదురుచూస్తూ వుంటాము.

ప్రిసెప్టరు సిట్టింగ్ ఇచ్చేపుడు అభ్యాసికి ఉన్నతస్థితి కల్గాలనే సంకల్పంతో వుండాలి. అదే విధంగా అభ్యాసి కూడా మనసు లగ్నం చేసి తానూ ఉన్నత స్థితులు పొందాలనే తలంపుతో వుండాలి. అయితే ఆ ప్రాణాహుతిని, ఆ స్థితులను కల్పించేది బాబూజీయే గాని ప్రిసెప్టరు కాదు. బాబూజీ అందరినీ అంతిమంకు తీసుకు వెళ్ళాలనే తలంపుతోనే వచ్చారు కనుక అందరికీ వారే ఆ స్థితులను యిస్తారు. కనుక ప్రిసెప్టరు అభ్యాసీ యొక్క ఉన్నతిని కోరుతూ బాబూజీకి కనెక్ట్ చేస్తారు. అభ్యాసి కూడా అదే సంకల్పంతో వుండాలి. దానిని బట్టి బాబూజీ కృప వర్షిస్తుంది. అంతేకాని ప్రిసెప్టరు నుంచి కాదు.

నాలో ఒక ప్రశ్న ఉదయించింది. ఎంతో మంది ప్రిసెప్టర్సు ఉన్నారు. వారు తమ ఉన్నతితో సంతృప్తి చెందలేక పోయినపుడు అభ్యాసిని ఉన్నత స్థితికి ఎలా తీసుకుపోగలరు అని. అందుచేత ప్రిసెప్టరు తాను పొందలేని

స్థితులను లేదా తాను పొందకపోయిన ఉన్నత స్థితులను కూడా అభ్యాసులు పొందాలనే సత్ సంకల్పం కల్గినవారై వుంటే అభ్యాసులకు ఎక్కువ లబ్ధి చేకూరుతుంది. అభ్యాసులు ఉన్నతి పొందాలనే సంకల్పమూ, కృషీ డాక్టరు గారిలో వున్నాయి.

ప్రతిరోజూ ఉదయమే ఒక గంట ధ్యానం, సాయంత్రం నిర్మలీకరణ, అలాగే రాత్రి నిదురించబోయే ముందు ప్రార్థన ఆచరించినంత మాత్రాన అభ్యాసికి ప్రతిఫలం లభించదు. వాటిలో, వాటికి తోడుగా తపన ఉన్నపుడే మంచి ప్రతిఫలం దక్కుతుంది. అదే విధంగా ప్రిసెప్టరు కూడా 'విధి' అన్నట్టు అభ్యాసులకు సిట్టింగ్ యిచ్చినంత మాత్రాన బాబూజీ నుంచి మంచి ప్రతిఫలం అందుకోలేరు. వారి హృదయంలో కూడా అభ్యాసులు పురోగతి చెందాలనే తపన, కృషి వుంటే బాబూజీ నుంచి ఆ ప్రిసెప్టర్లకు కూడా మంచి ప్రతిఫలం లభిస్తుంది. కనుక యిరువురూ కూడా యాంత్రికంగా కాకుండా హృదయపూర్వకంగా తపనతో కృషి చేయాలి.

బాబూజీ చెప్పారు - అభ్యాసీ తనలో తపన పెంచుకోవాలి - అని. అదెట్లా సాధ్యమంటే - ఉదయం ధ్యానం చేస్తాం. ఆ ధ్యానంలో ఏదైతే అనుభూతి, ఆనందం కల్గుతాయో వాటిని ధ్యానం పూర్తయ్యాక - నిరాలోచనగా వుండకుండా పగలంతా కూడా వాటిని స్మరించుకుంటూ వుండాలి. జ్ఞాపకం చేసుకుంటూ వుండాలి. అపుడు మన మనస్సంతా దివ్య భావంతోనే నిండిపోయి అందులోనే మునిగి వుంటుంది. అంటే మనకు కల్గిన అనుభూతుల్లో - బాబూజీ దేనినైతే ప్రసాదిస్తారో అందులోనే మునిగి ఉండాలి. భౌతికంగా మనకు దాహం వేస్తే నీరు తాగుతాము. దాహం తీరుతుంది. కాని హృదయంలో కల్గిన ఆనందానుభూతిని ఎంత తరచి తరచి స్మరించినా ఇంకా తనివితీరనిదిగా వుండి యింకా ఎక్కువ

ఆనందానుభూతుల కోసం అన్వేషణ జరుగుతూ వుంటుంది. ఈ దాహం తీరనిదిగా వుండాలి. అంటే, అదే తపన - నిరంతరం దైవాన్ని గురించే ఆలోచించేటట్లు చేస్తుంది. బాహ్యాలోచనలు దరి చేరవు.

సిట్టింగ్ అయిన తర్వాత ప్రిసెప్టరు అభ్యాసితో అతని కండిషన్ బాగుంది అని గాని, మంచి అనుభూతి వచ్చింది అని గాని ప్రశంస చేసినట్లయితే అభ్యాసి దానికి లోబడిన కారణంగా యింకా ముందుకు పోయి మంచి స్థితులు, అనుభూతులు చెందాలనే తపన కొరవడుతుంది. అపుడు ప్రిసెప్టరు మరియు అభ్యాసి కూడా అసంతృప్తితో నిలకడ చెందుతారు. అలా కాకుండా పురోగతి కోసం తపన చెందుతూ వుండాలి. మునులు తపస్సు చేసి శక్తిని సాధించినపుడు వారిలో అహం వుంటుంది. కాని సహజమార్గ విధానంలో యింకా 'పూర్తిగా పొందలేదు' అనే తపనతో అహం జనించదు. సహజ మార్గమనేది దైవ సాక్షాత్కారానికైన ఒక విధానమే. పరిపూర్ణత సాధించాలంటే తపన చెందుతూ బాబూజీ దర్శనం, అనుగ్రహం ఎప్పుడు కల్గుతాయోనని ఎదురు తెన్నులు చూచేటట్లుగా వుండాలి.

ప్రకృతి యొక్క తపన మూలంగానే దివ్యావతరణ జరుగుతుందని ఎప్పుడో చెప్పారు లాలాజీ. దానికి తగినట్లుగా స్పందించి బాబూజీని అవతరింపజేశారు వారు. మానవ మాత్రుల్లో దైవాన్ని గురించిన ఆలోచన, భక్తి లోపించాయి కనుక వాటిని పునరుద్ధరించటం కోసమే బాబూజీ అవతరణ జరిగింది. సహజమార్గ విధానం అనేది భగవంతుని పట్ల భక్తిని పెంచి ఆ దైవాన్ని చేరే దిశగా ప్రయాణింపచేసేదిగా గ్రహించాలి.

లౌకిక జీవనంలో మనకు ఎన్నో కోరికలుంటాయి. కాని అన్నింటినీ పొందటం అసాధ్యం. అందుచేత కలిగినంతలో తృప్తి చెందాలి. కాని ఆధ్యాత్మిక జీవనంలో లక్ష్యం సాధింపబడేటంత వరకు తృప్తి చెందకుండా తపించాలి.

మనలోని లోపాలను, అశక్తతను గురించి ఆలోచించకుండా మనం బాబూజీకే సమర్పితమయ్యాం కనుక వారి అనుగ్రహం కోసమే పరితపించాలి.

మీ సెంటరులో అభ్యాసి ఎవ్వరైనా అస్వస్థులైనా, ఏదైనా ఆపరేషన్‌కు గురి అయినా డాక్టరుగారు వెంటనే వారి కష్టానికి స్పందించి నాకు ఫోన్ చేస్తారు. వారికి అభ్యాసుల పట్ల అంత ప్రేమ. వారి యోగ క్షేమం పట్ల అంత శ్రద్ధ వున్నాయి. అటువంటి హృదయపూర్వకమైన ప్రేమ అక్కడ వర్థిల్లుతున్నది కనుకనే బాబూజీకి మీ సెంటరు మీద ప్రత్యేక అభిమానం వుంది.

ఒకసారి నేను షాజహానుపూరు వెళ్ళినపుడు బాబూజీకి ఒక అభ్యాసి నుంచి ఉత్తరం వచ్చింది. అందులో అతను తన కష్టాల గురించి బాధపడుతూ వ్రాశాడు. దానిని చదువుతూ కాశీరామ్ - బాబూజీకి యిటువంటి విషయాలేనా వ్రాసేది, అంటూ ఆగ్రహం చెందాడు. అపుడు బాబూజీ కాశీరామ్‌ను వారిస్తూ - అభ్యాసీ తన బాధల నుంచి ఉపశమనం పొందటానికో లేదా బాధలు తీరతాయి అనో నాకు తెలుపుకున్నాడు. తల్లి తీరుస్తుందని పిల్లవాడు తన బాధలు చెప్పుకుంటాడు. అందులో అతనికి తృప్తి కల్గుతుంది. అలాగే అభ్యాసి కూడా. అందుచేత అసహనం చెందవద్దని చెప్పారు. కనుక ఆ విధంగా అభ్యాసుల పట్ల ప్రేమ భావం వుంటుంది 'వారి'కి.

ఒకసారి వరదాచారిగారు 'ఈ సిస్టంలో బ్రదర్ హుడ్ (సోదర భావం) బాగా వుంది', అని బాబూజీతో అన్నారు. అపుడు మాస్టర్జీ (బాబూజీ) ఇందులో హుడ్ లేదు - అందరూ బ్రదర్సు, సిస్టర్స్ మాత్రమే - అనగా అందరూ సోదరులు, సోదరీలే. బ్రదర్ హుడ్ అనగా సోదరభావం అని స్ఫురిస్తుంది. కాని అందరూ సోదర సోదరీలే అన్నపుడు సాన్నిహిత్యం వుంటుంది. మొదటి

దానిలో కొంచెం ఎడం (దూరం) వుంటే రెండవ దానిలో ఆత్మీయత వుంటుంది.

సహజమార్గంలో బాబూజీ చెప్పింది ధ్యానం చేయమని కాదు, ధ్యానంలో వుండమని. అనగా దైవం నీలో వున్నాడని భావించి ఆ దైవాన్ని కలవటానికి, చూడటానికి మరీ మరీ ప్రయత్నించటం. అలా చేసినపుడు దైవ సామీప్యత కల్గి దివ్యానుభూతి కల్గుతుంది. ఆ దివ్యానుభూతి ఎప్పుడు కల్గుతుందంటే మనం మనలోని ఆ బాబూజీ మీదే దృష్టి నిలిపివారినే పొందే ప్రయత్నంలో వుండగా వారితో కలయిక (స్పర్శ) కల్గుతుంది. అపుడు మనకు ఫీలింగ్ అనగా అనుభూతి కల్గుతుంది. అంటే ఆలోచన, వారు మనలోనే వున్నారన్న ఆలోచన స్థానంలో వారితో సామీప్యత, అనుబంధం కల్గుతాయి. ధ్యానంలో ఆలోచనలు రాలేదు కనుక బాగుందని మనం అనుకుంటాం. ఆలోచనలు రాకపోవటం ముఖ్యం కాదు. అనుభూతిని చెందటమే ముఖ్యం. అది కలగాలంటే మన దృష్టి అంతా వారి మీదే లగ్నం కావాలి. కేంద్రం వారే కావాలి. మనం వారికి ఎంతగా సామీప్యత చెందితే అంతగా వారిని మన వైపు ఆకర్షితులను చేసుకుంటాం. నిరంతర స్మరణ వారిపై నిల్పితే వారు మనల్ని ఆకర్షించటము, శక్తినివ్వటమూ తోపాటు నిద్రలో వున్నా కూడా స్థితులు కల్పిస్తారు. అనగా మనము పగలనక రేయనక "వారితో" విడదీయరాని బంధం ఏర్పరుచుకోవాలి.

నా అనుభవ రీత్యా చెప్పాలంటే మనం బాబూజీకి మనల్ని అర్పించుకోవాలి. అనగా శరణాగతి పొందాలి. మీరు నా వారు, నేను మీ వాడిని అని బాబూజీకి నివేదించుకోవాలి. అది మన అంతఃకరణలో సంపూర్ణ సమర్పణ జరగాలి. అపుడు నిదానంగా మన 'నేను' అను తత్వం తరిగిపోతూ అంతా వారేనను అనుభూతి కల్గుతుంది. లౌకికంగా మనకు మనం ధరించే వస్త్రాలు నచ్చినట్లుగా అనిపించినా, ఆహారపదార్థాలు రుచికరంగా తోచినా

కూడా అది వారి పరంగానే లభించినట్లు అనుభూతి చెందుతాము. ఆ విధంగా మనం వారితో సంబంధం పెంచుకుంటూ పోవాలే కాని మళ్లీ ఆ అనుబంధము, వారి దివ్యాకర్షణ నుంచి వైదొలగకూడదు. అపుడు మనకు అంతా బాబూజీ మయంగానే అనుభూతి కల్గుతుంది. 'నేను' అను అహం కరిగిపోతుంది.

నేను క్రొత్తగా వ్రాసిన పుస్తకం ఒకటి అచ్చవుతోంది. అందులో రీజియన్స్ గురించి వివరించటం జరిగింది. ఈ విధంగా రీజియన్స్ గురించి వ్రాసిన వారిలో నీవే ప్రథమ వ్యక్తివి అవుతావు అన్నారు బాబూజీ. ఇది వరకు సాధారణంగా అందరిలాగే శ్రమ చేసిన తర్వాత నాకు నిద్ర వచ్చేది. కాని యిప్పుడు అభ్యాసుల ఆత్మోన్నతి కోసం పాటు పడుతున్నందున నిద్ర యొక్క ధ్యాసే వుండటం లేదు. అభ్యాసులు తమ ఉన్నతి కోసం నేను ప్రాణాహుతిని, స్థితులను యిస్తున్నాననుకుంటారు. అంతా బాబూజీయే యిస్తారు, నేను కాదన్నా జనం విశ్వసించరు కాని వాస్తవానికి యిచ్చేవారు బాబూజీయే. ఆ కృషి వారిదే.

హృదయ మండలంలో అయిదు పాయింట్లు లేదా వలయాలు వుంటాయి. వాటిని దాటినట్లయితే మాయను దాటి వెళ్ళినట్లు అనుకుంటారు. పంచభూతాలైన నేల, నీరు, నింగి, నిప్పు, వాయువు ఎలాగో అవీ అలాగేననుకుంటారు. ధ్యానంలో లోతుగా మునిగి విస్మృతావస్థలోకి వెళ్ళినట్లయితే ఆ విశాలమైన హృదయ మండలాన్ని దాటినట్లవుతుంది. కాని దానిని గురించిన ధ్యాస అనవసరం. మీరా, కబీరు వంటి భక్త శిఖామణులు కూడా వారు అనుభూతి చెందినా కూడా వాటిని గురించి వివరించలేదు. అది ఎవరికి వారు అనుభూతి చెందగల్గినదే కాని యితరుల చేత చూడబడేది, చదవబడేది కాదు. అనుభూతికి మాత్రమే అందుతుంది.

మామూలుగా మనం మన హృదయంలో బాబూజీ వున్నారనుకుని ధ్యానం చేస్తాం. కాని ఎప్పుడైతే మనం ధ్యానంలో గాఢంగా, లోతుగా మునిగి ఆ విస్మృతి స్థితి లేదా మరపు స్థితిలోకి వెళ్ళిపోతామో అప్పుడు మనమే బాబూజీ హృదయంలో నివసిస్తున్నట్లనిపిస్తుంది. ధ్యాన మగ్నతలోని పరివర్తన ఇలా వుంటుంది. మనలో ఎంతగా సబ్‌మిషన్ (అర్పణ/శరణాగతి) వుంటే అంతగా గాఢమైన అనుభూతి కల్గుతుంది.

మైండ్ రీజియన్ అనగా హిరణ్యాగర్భ మండలాన్ని దాటటం చాలా కష్టమైనది. ఎందరో మహానుభావులు దాటినప్పటికి దానిని గురించి చెప్పలేకపోయారు. ఈ మండలపు శక్తి కేంద్రం వుంటుంది. అందులో కూడా ఒక బిందువు వుంటుంది. దాని నుంచి సృష్టి నిర్మాణానికి అవసరమైన శక్తి ధార దిగి వస్తూ వుంటుంది. దాని తీవ్రత నుంచి తప్పించుకుని వెళ్ళటం చాలా కష్టమైన పని. అటువంటి దానిని బాబూజీ తమ సంకల్పంతో ఆ బిందువును తెరచి దాటిస్తారు. ఒకసారి మనలో ఆ బిందువును తెరచాక అది మళ్ళీ మూసుకుపోవటమంటూ వుండదు. దీనిని నేను ఎలా వ్రాయగల్గానంటే, బాబూజీ నా మీద పరిశోధన చేసి, ఈ విషయాన్ని సమస్త మానవాళికి చాటి చెప్పదలచుకున్నారు కనుక, అందరినీ ఆ విధంగా పైకి తీసుకు వెళ్ళదలచారు కనుక నా చేత వారే వ్రాయించారు. వారి వల్లనే నాకది సాధ్యమైంది. అటువంటి స్థితిలో బాండేజి (బంధం) ఏమీ వుండదు.

ఒకసారి చారిగారు తన తల్లితండ్రుల ఆత్మస్థాయిని గురించి అడిగినపుడు బాబూజీ యిలా చెప్పారు. గాడ్లీ రీజియన్ - 16 వలయాలు - ఇవన్నీ దాటాక ఆత్మకు యింక ప్రాపంచిక బంధనం వుండదు. కేవలం ఐడెంటిటీ మాత్రమే వుంటుంది. కృష్ణుడు, వివేకానందుడు, రామకృష్ణ పరమ హంస వంటి మహానుభావులందరూ ఇవన్నీ దాటాక గ్రైటర్ వరల్డ్ చేరుకుని

అక్కడ వుంటారు. వారంతా లిబరేటెడ్ సోల్స్ అనగా విముక్తాత్మలు. వారు యింకా పైకి వెళ్ళి భూమాను చేరవచ్చు. కాని ఆ గ్రైటర్ వరల్డ్‌లో వారు పొందుతున్న ఆనందాన్ని అనుభవిస్తుంటారే కాని విడిచి వెళ్ళరు. ఎవ్వరైనా దివ్య పురుషుడు ఈ భూమి మీదకు దిగి వచ్చినపుడు అటువంటి విముక్తాత్మలు 'వారి' పనిలో సహాయపడుతుంటారు. అంతర్వాణి ద్వారా వారు సందేశాలు పంపుతుంటారు. బాబూజీకి లాలాజీకి చేసిన హెచ్చరికలు – ఇంటి వెనుక దొంగలున్నారు, ఆ గదిని వదలిపెట్టు, ఆ ప్రదేశానికి వెళ్ళవద్దు అని చెప్పినటువంటివి ఇటువంటి ఆదేశాలే. వారికి బాండేజి (బంధనం) వుండదు. వారు ఆ తేజో మండలాన్ని వదలిపెట్టరు. బాబూజీ కుమారుడు తమ తల్లిగారి గురించి బాబూజీని అడిగినపుడు, ఆమె లిబరేటెడ్ సోల్ కనుక యింక ప్రాపంచిక బంధనం అనగా తల్లి అని భావించబడదు అని చెప్పారు. అటువంటి విముక్తాత్మలను మన ప్రాపంచిక బాంధవ్యంతో ముడిపెట్ట కూడదు. వారి దివ్యత్వాన్ని గురించే తలంచాలి. (దీనిని గురించి విడుదల కాబోతున్న క్రొత్త పుస్తకంలో వివరించాను.)

దైవానికి మైండు లేదు. చెవులు లేవు అని బాబూజీ చెప్పిన మాటను పట్టుకుని మన పెద్ద భయ్యా ఆ అవసరాన్ని తీర్చటానికి ఒక జీవించి వున్న వ్యక్తి అనగా వినటానికి చెవులు, చూడటానికి కళ్ళు, చెప్పటానికి నోరు వున్నటువంటి వ్యక్తి సజీవ మాస్టరుగా వుండాలనే అభిప్రాయాన్ని ఆచరణలో పెట్టున్నారు. సూపర్ కాన్షస్ మైండ్ అనేది దైవానికి చెందినది. కాన్షస్ మైండ్ మానవునిది. మనకున్న (అధిచేతనా మనస్సు) కాన్షస్ మైండుతో ప్రశ్నలకు మనకు తోచిన సమాధానం చెప్తూ వుంటాము. కాని దివ్య పురుషుల విషయంలో మనమేదైనా ప్రశ్నించినపుడు అది ఆ సూపర్ కాన్షస్ మైండును (మన మైండ్ పరిమితమైనది కాని అది అపరిమితమయినది, దాని శక్తి

అనంతమైనది) తాకి సత్యవంతమైన సమాధానం వస్తుంది. దానికింక మార్పు గాని, దానికి అతీతమైనది గాని ఏమీ వుండదు. అటువంటి సత్య శక్తి ముందు సజీవ మాస్టర్ సామర్థ్యం ఎంతటిదో మనం వూహించుకోవచ్చు. అవునన్నా, కాదన్నా యిది యదార్థం.

రామచంద్ర మిషన్ అనేది ఒక సామాన్య సంస్థగా కాకుండా ఆధ్యాత్మిక లక్ష్యంతో అనగా ఒక మహా సంకల్పంతో, అది కూడా – అందరినీ అనంతం చేర్చాలనే సంకల్పంతో స్థాపించబడింది. బాబూజీచే స్థాపించబడింది కనుక ఆ సంస్థకు బాబూజీ మాత్రమే ప్రెసిడెంట్. వారు స్థాపించిన ఈ మిషన్ నిర్వహించబడుతూ వుండాలి. అనేకానేక మందిని అభ్యాసులుగా చేర్చి లక్ష్యాన్ని పొందేటట్లుగా అభ్యసింప చేయాల్సి వుంది కనుక దానికి ఒక నిర్వాహకుడు అనగా అధ్యక్షుడు వుండటం అవసరమే. అటువంటి బాధ్యతను వహించే వారిని మనము గౌరవించాలి, గౌరవిస్తాము కూడా. అంతేకాని పరమపిత, పరమాత్మ స్వరూపుడు అయిన బాబూజీ స్థానాన్ని ఎవ్వరూ ఆక్రమించలేరు. కనుక ఆర్గనైజేషన్ గా వ్యవహరించే దానికి ప్రెసిడెంట్‌గా వున్న వారికి, సంకల్పము లేదా ఆశయానికి మూలవిరాట్‌గా వ్యవహరించిన ప్రెసిడెంట్ బాబూజీకి అనగా ఆ పదానికి వ్యత్యాసముంది. దీనిని గమనించకపోతే భవిష్యత్ తరాల వారు అపోహపడే అవకాశముంది కనుక ఈ విషయాన్ని పదే పదే ప్రస్తావించవలసి వస్తోంది. వ్రాయవలసి వస్తోంది. సమస్త మానవాళిని సహజమార్గంలో నడిపించి అందరికీ సాక్షాత్కారం కల్పించాలనేటటువంటి మహదాశయం బాబూజీ మిషన్‌ది. అంతే కాని ఏ ఒక్కరి ప్రయోజనమో లేక బహు కొద్ది మంది ప్రయోజనం కొరకో కాదు. కళ్ళు తెరిస్తే కన్పించేది బాహ్య ప్రపంచము, బాంధవ్యమూ. కళ్ళు మూస్తే కన్పించేది ఏ దేశంలో అయితే బాబూజీ వుంటారో ఆ దేశం.

ఈ విషయం బాబూజీ చెప్పారు. వారు చెప్పారు కనుకనే, అందరికీ ఆమోదయోగ్యంగానూ, జ్ఞానం కల్గించేదిగాను వుంటుంది.

ఒకసారి బాబూజీతో మీపైన ధ్యానం చేయవచ్చా అని అడిగాను. మారుతూ వుండే మూర్తిపై కాదు. శాశ్వతమైన దానిపై ధ్యానం చేయి. అలా ఎందుకంటే మనం పదేళ్ళుగా, 20 ఏళ్ళుగా, 30 ఏళ్ళుగా ధ్యానం చేస్తూ వుంటాము. శరీరంలో మార్పులు వస్తూ వుంటాయి. కాని ధ్యానించే దానిలో మార్పు వుండదు. శరీరం అశాశ్వతమైనది, దివ్యత్వం శాశ్వతమైనది, సత్యమైనది. అందుచేత మార్పులు చెందే రూపాలు, మూర్తుల మీద కంటే శాశ్వతమైన సత్యత్వం మీదనే ధ్యానం చేసినట్లయితే మనకు పరమానందం, శాశ్వతానందం దక్కుతాయి.

గోపికలు కృష్ణునికి ఎన్నో తినుబండారాలు తీసుకు వచ్చి అర్పించారు. అప్పుడు కృష్ణుడు 'వాటినన్నీ నేను తిన్నాను. చాలా రుచిగా ఉన్నాయి' అన్నాడు. గోపికలకు ఆశ్చర్యం వేసింది. తాము ఇంకా ఆయనకు అర్పించకుండానే ఎలా తిన్నాడా అని. వారు ఈ పదార్థాలను తయారు చేస్తున్నప్పుడు కృష్ణుణ్నే తలచుకుంటూ, కృష్ణుడికి ఈ పదార్థాలు, ఈ రుచి ఇష్టం అనుకుంటూ అర్పణ భావంతో వండటం వలన వాటి రుచి ఆయనకు ముందుగానే తెలిసింది. మనలో అర్పణ భావన అనేది చాలా ముఖ్యము.

జీవన ముక్తావస్థలో చేతులతో ఏదైనా తాకినా ఆ స్పర్శ తెలియదు. నేలపై నడుస్తున్నా, నేలపై కాలు ఆనదు.

**ప్రశ్న : గుణములు గుణములందే వర్తించును అని అన్నారు దీని అర్థం ఏమిటి?**

**జవాబు :** ఈశ్వరునిలో గుణములు లేవు. మనము బాబూజీలో లయావస్థ పొందినప్పుడు చెవులు వింటాయి. చేతులు పని చేస్తాయి కాని అది మన

అంతరాన్ని తాకదు. మనం ఎవరినైనా ప్రశ్నించినప్పుడు జవాబు దానికదే సరియైనదే వస్తుంది.

బాబూజీ, సోదరి కస్తూరిజీ ఇద్దరే ఉన్నప్పుడు, "బేటీ ప్రశ్నలేమైనా ఉంటే అడుగు. అవి ఏవైనా - నాకూ తెలియదు. నీకు తెలియదు కనుక మంచి జవాబులే వస్తాయి" అన్నారంట. "తెలివి గల వాళ్ళు ఉంటే రకరకాల ప్రశ్నలు వేస్తారు. కాని ఇక్కడ మనము ఇద్దరే ఉన్నాము కదా, ఆ సమస్య లేదు" అన్నారు.

ఒక అభ్యాసి బాబూజీతో "నేను ఎప్పుడూ జపమాల త్రిప్పుతూ మీ నామమే జపిస్తూ ఉంటాను" అని అన్నారంట. కాని మాలలోని పూసలు జపిస్తూ ఉన్నాయి. మీరు ఉచ్ఛరిస్తూ ఉన్నారు అంతే. హృదయంలో నుండి భగవంతుణ్ణి పిలిచినప్పుడే అది జపం అవుతుంది. ఏ గుణములతో ప్రశ్న అడిగితే అదే గుణములతో మనస్సు సమాధానమిస్తుంది. మానవ మాత్రులు అడిగిన ప్రశ్నకు మానవ మాత్రుల స్థాయిలోనే సమాధానం వస్తుంది. సిస్టర్ కస్తూరి బాబూజీకి ఉత్తరం వ్రాసారు. దానిలో "బాబూజీ, అమ్మ ఆకుపచ్చ చీర తెమ్మంటే మనసు మీద ఏ విధమైన ప్రభావం లేకుండానే చేతులు అదే రంగు చీరను తీసుకువచ్చి ఇచ్చాయి. ఏదైనా వస్తువు ఎక్కడైనా పెట్టాలి అంటే చేతులు ఆ పని చేసేస్తాయి. ఎప్పుడూ తప్పు జరగదు. "ఇది ఎలా జరిగింది" అని సోదరి అడిగారు. దానికి బాబూజీ జవాబుగా "మాయ దాటిన తర్వాత రంగులు ఏమీ లేవు. మాయ దాటిన తర్వాత ఏ మనసు అయితే ఉంటుందో అది స్పందించి ప్రాపంచిక పనులను చేస్తుంది. కాని హృదయం మాత్రం ఎప్పుడు 'ఆయన'తోనే కలిసి ఉంటుంది.

ఈశ్వర్ సహాయ్‌గారు ఒకసారి బాబూజీని అడిగారు, "మాయ దాటిన తరువాత రంగులు ఏమీ ఉండవు అని అన్నారు కదా. మరి రాముడు,

కృష్ణుడు భగవద్రాజ్యపు మహామాయ నుండి వచ్చారు కాన వారు నీలిరంగు పొంది ఉన్నారని మీరు చెప్పారు. ఈ నీలం రంగు ఎలా వచ్చింది?"

అప్పుడు బాబూజీ సమాధానం ఏమంటే "నేను పరిశోధన చేస్తున్నాను. అది వేరే విషయం. కొంతమంది మామూలు స్థితిలో వున్న వాళ్ళ గురించి ఆలోచించాలి, ఇంకా ఉన్నత స్థితిలో ఉన్న వాళ్ళను గురించి కూడా ఆలోచించాలి. అందువల్ల ఆ స్థితి వేరు, ఈ స్థితి వేరు అని చెప్పవచ్చు. ఇక్కడ ప్రపంచంలో ఏదైతే రంగు ఉందో అది బాహ్యమైనది అని చెప్పవచ్చు.

భగవత్ రాజ్యంలో రంగు, బంధము, సుఖము, దుఃఖము ఏమీ లేవు. మహామాయ యొక్క నీలపురంగుకి, సాధారణమైన నీలం రంగుకి తేడా ఉంటుంది. ఆ నీలం రంగులో ఆకర్షణ, తేజస్సు ఉన్నాయి. సాధారణ నీలిరంగులో ఏ ఆకర్షణ, తేజస్సు ఉండవు. జనాన్ని ఆకర్షించడం కోసం రాముడికి, కృష్ణుడికి నీలం రంగు ఇవ్వబడింది. ఋషులు, మునులు ప్రార్థించడం వల్ల రాముడు, కృష్ణుడు మహామాయ స్థానం నుండి అవతరించారు. సృష్టి రచన కేంద్రము యొక్క కేంద్రము నుండి బాబూజీ అవతరించారు. కబీరు మొదలైన వారు కూడ ఆపదహారో వలయం వరకు మాత్రమే వెళ్ళగలిగారు. కాని బాబూజీ మనల్ని అంతకన్నా పైకి తీసుకువెళ్లగలరు. ఇప్పుడు బాబూజీ అవతరించిన తర్వాత కబీరులా "హద్, అన్‌హద్ కీ బీచ్ యే రహ కబీరా" అనే అవసరమే లేకుండా బాబూజీ అందరికీ దారి ఏర్పరిచారు. బాబూజీ ఒక్కరే మనలను కేంద్రం యొక్క కేంద్రం లోనికి తీసుకు వెళ్లగలరు. బాబూజీ నాచే యాత్ర గావించినప్పుడు ప్రతి రీజియన్‌లో గల కేంద్రములో మునక వేయించి, బయటకు తీసారు. అంటే ఆ శక్తిలో నన్ను ముంచారు. బాబూజీ నన్ను సెంట్రల్ రీజియన్ లోనికి తీసుకుని వెళ్ళినప్పుడు ఒక నవశిశువును జాగ్రత్తగా తీసుకుని

వెళ్ళినట్లు తీసుకుని వెళ్ళి ఆ శక్తిలో ముంచి తరువాత సెంట్రల్ రీజియన్ యొక్క మొదటి వలయంలో ఉంచారు. భూమా శక్తి ఒక వెలుగురేఖలా ప్రవహిస్తుంది. ఆ శక్తిని నాకు ప్రసాదించారు. బాబూజీ భూమా నుండి భువికి అవతరించిన దారే సహజమార్గము. ఈ భూమిపైన గల ఈ సహజ మార్గమే బాబూజీ చరణాలు. వారి చరణాలను పట్టుకొని ఉంటే మనము పైకి చేరుకుంటాము. ప్రతి రీజియన్ యొక్క కేంద్రములో బాబూజీ యొక్క సంకల్పం ఉంది. ఆ సంకల్పంలో మనం లయ చెందినప్పుడు ఉన్నత స్థితులను పొందగలుగుతాము.

ఇంతమంది దేవతలు ఉండగా గంగను శివుడే ఎందుకు ధరించవలసి వచ్చింది అని నేను బాబూజీని అడిగినప్పుడు వారు నాకు జవాబు వ్రాసారు. దాని అర్థం ఇప్పుడు తెలుస్తోంది. ప్రతి వ్యక్తి యొక్క సహస్రారంలో ఒక బీజము ఉంటుంది. అది తెరుచుకుని ఉన్నప్పుడు భగవంతునికి, వ్యక్తికి మధ్య వార్తాహరునిగా పని చేస్తుంది. ఏదైనా సమాచారం భగవంతునికి చేర్చటానికి, భగవంతుని నుండి వచ్చే సందేశాన్ని రిసీవ్ చేసుకోవటానికి ఇది తోడ్పడుతుంది. దేవతలెవ్వరికి ఈ బీజం తెరిచి లేనందువల్ల, శివుడికి ఒక్కడికే ఇది తెరచి ఉండడం వల్ల గంగ ఉద్భవము యొక్క సమాచారం తెలిసి ఆయనే దీనిని (గంగను) జటాజూటములో బంధించటం జరిగింది. ఆ స్థితిలో గంగ అనేది ఒక శక్తి. అది భూమి పైకి వచ్చినప్పుడు అది ఒక ప్రవాహంగా మారింది.

ఒకసారి శ్రీ బాబూజీ సిస్టర్ కస్తూరి గారికి ఉత్తరం వ్రాస్తూ, 'నా అస్తిత్వము' ఏమిటి అని ప్రశ్నించారు. మరల వారే జవాబు వ్రాస్తూ, 'నేను ఒక చీమ లాంటి వాడిని, ఎవరు తొక్కినా, తొక్కి చంపినా నేను ఏమీ అనను' అని అన్నారు. ఒక పర్యాయం కొంతమంది సాధువులు బాబూజీని

చూడడానికి రాగా, 'వారు' అందరితో సాధారణంగా ఆ మాట్లాడటం చూసి "నీకు భాషా పరిజ్ఞానము కూడా లేదు. సన్యాసి వేషం వేసి మోసం చేస్తున్నావు. డబ్బు కోసం ఇదంతా చేస్తున్నావ"ని అవమానించారు. అప్పుడు అక్కడ ఉన్న ఈశ్వర్ సహాయ్ గారికి చాలా ఆవేశం వచ్చింది. అయినా బాబూజీ వారిని వారించారు. సాధువులు వెళ్ళిన తరువాత శ్రీ ఈశ్వర్ సహాయ్ గారితో నేను ఒక 'చీమలాంటి వాడిని' అని అన్నారు.

భగవత్ రాజ్యం నుండి సృష్టి రచనకు ఎంత శక్తి అవసరమో అంతే శక్తి అక్కడికి వస్తుంది. తపన అనేది హృదయంలో ఏర్పడుతుంది. తపన దైవం ఇవ్వనిదే ఏర్పడదు. ఈశ్వరుడు అందరినీ ప్రేమిస్తాడు. మనం ఆయన కోసం తపించినప్పుడు ప్రేమ మనకు లభిస్తుంది. ఈ ప్రపంచం కేవలం అనురాగబంధము (ఎటాచ్‌మెంట్)తో నడుస్తుంది. బాబూజీ మహారాజ్ లాలాజీతో "నా కనులు మిమ్మల్ని తప్ప ఇంకెవరిని చూడవు" అని అన్నారు. మనం ప్రేమతో ఆయనపై హృదయంలో అనురాగబంధాన్ని పెంచుకోవాలి. ఇక్కడ ముఖ్య విషయం ఏమంటే ఆత్మనివేదన జరగాలి. నేను మైండ్ రీజియన్‌లో ఉన్నానా, బ్రహ్మాండ మండలములో ఉన్నానా, పరబ్రహ్మాండమండలంలో ఉన్నానా, ఏ రీజియన్ (మండలం)లో ఉన్నాను, అని ఆలోచిస్తే ప్రోగ్రెస్ లేదు. ప్రోగ్రెస్ అనేది భక్తి, ప్రేమతో ఏర్పడుతుంది. ఈ రీజియన్ (మండలం లేదా రాజ్యం) అనేవి బాబూజీ చేసిన పరిశోధనే! ఉండవలసినది కేవలం ఆయనపై భక్తి మాత్రమే!

నేను ఇది చేశాను, అది చేశాను, అని చెప్పుకుంటే 'నేను' అనేది ఉంటుంది. కాని ఏ పని చేస్తున్నా కనులు వారినే అంటిపెట్టుకుని ఉన్నప్పుడే ప్రోగ్రెస్ ఉంటుంది. బాబూజీ "ధ్యానంలో ఉండండి" అన్నారు.

ధ్యానంలో ఉండడం వలన పేరు, రూపం తొలగిపోయి కనులు పూర్తిగా వారిపై లగ్నం అవుతాయి. బాబూజీ కళ్ళు మనలను చూస్తున్నట్లు అనుభూతి కలుగుతుంది. బ్లెస్సింగ్స్ - కృపావర్షం లభిస్తుంది.

ప్రశ్న : సాధన అంటే ఏమిటి?

జవాబు : ఇక్కడ రెండు విషయాలు ఉన్నాయి. ఒకటి సృష్టి రచన 'యు' నుండి ఏర్పడింది. అంటే 'యు' నుండి 'ఐ' ఏర్పడింది. 'ఐ' ని 'యు' తో జోడించినప్పుడు 'వారి' తో బంధం ఏర్పడి క్రమేణా 'ఐ' (నేను – తొలగిపోయి 'యు' (నీవు–దైవం) మాత్రమే ఉంటుంది.

ఒకసారి బాబూజీని ఓ సీనియర్ నేను ఏ రీజియన్‌లో ఉన్నాను, అని అడిగారు. బాబూజీ దానికి చమత్కారంగా జవాబు యిచ్చారు. "మీరు ఏ స్టేషన్‌కి టికెట్ కొనుక్కున్నారో నాకెలా తెలుస్తుంది" అని. అప్పుడు ఆ సీనియర్ మాట్లాడకుండా వెళ్ళిపోయారు. తరువాత బాబూజీ "ఈయనకు ఆధ్యాత్మికతలో అ, ఆ లు తెలియదు – రీజియన్ గురించి మాట్లాడుతున్నారు" అని అన్నారు. ఒక నిజమైన అభ్యాసి బాబూజీని ధ్యానిస్తుంటే వారికి ప్రోగ్రెస్ (అభివృద్ధి) ఉండదా? ప్రోగ్రెస్ ఉంటుంది, ఎంత సామీప్యతా స్థితి ఉంటుందో అంత అభివృద్ధి ఉంటుంది. అనుభూతి కలిగినప్పుడు మనం అభివృద్ధి చెందుతున్నామని తెలుస్తుంది.

సిస్టర్ వ్రాసిన పాటలో చివరి రెండు చరణాల గురించి వివరించారు. బాబూజీ తన సామ్రాజ్యంలో ఒక తల్లి ప్రేమతో తన బిడ్డలకై చేతులు చాచి ఉంచినట్లుగా చేతులు చాచి ఉంచి గోచరించారు. 'వారి' దేశంలో ప్రతి శబ్దము "నీవు నా బిడ్డవు" అని బాబూజీ అంటున్నట్లు విన్నాను. అన్‌హద్ స్వరము అంటే అర్థం ఏమంటే సాధన ప్రారంభించాక మనసులో, హృదయంలో, చెవులలో అంతటా బాబూజీ, బాబూజీ అని మాత్రమే వినిపిస్తుంది. అది బాబూజీకి వ్రాసినప్పుడు బాబూజీ ఇదే "అన్‌హద్" స్వరము అని జవాబిచ్చారు. స్వరం అంతటా కూడా వినిపిస్తుంది. కబీర్‌కి కూడా అంతటా 'రామ' శబ్దమే వినిపించింది.

ప్రశ్న : లాలాజీగారి భార్య మరణించినప్పుడు యమధర్మరాజు స్వయంగా వచ్చాడు, అని అన్నారు. ఇది నిజమా?

జవాబు : ఇది సరియైన ప్రశ్న కాదు. మనం పెద్దవాళ్ల గురించి ఈ విధంగా మాట్లాడకూడదు. మనం మన ప్రాణాన్ని బాబూజీకి అర్పించుకున్న తరువాత ఇక యమధర్మరాజు ప్రసక్తే రాదు. రాముడు, కృష్ణుడు, శివుడు, హనుమాన్ వీరంతా ఎవరు? ఒక సంస్థను నడపటానికి ప్రెసిడెంట్, సెక్రటరీ మొదలైన వారు ఎలా ఉంటారో, అదే విధంగా సృష్టికార్యం కోసం బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఉన్నారు. హనుమంతుడు కేవలం రామభక్తుడు. రావణ సంహారంలో రామునికి సహాయం చేశాడు. ఈ లౌకిక ప్రపంచంలో సృష్టిలో చెడు ఆవరించినప్పుడు మునులు, ఋషులు ప్రార్థన చేస్తే సృష్టిని సవరించటానికి ఏర్పడిన అవతారాలు రాముడు, కృష్ణుడు.

ఒక అభ్యాసి బాబూజీతో, "బాబూజీ! మిషన్‌కు చాలా సేవ చేయాలని నాకు అనిపిస్తుంది" అన్నారు. అంటే ఆ అభ్యాసి ఉద్దేశ్యం ఆయనను ప్రిసెప్టరు చేయాలని. దానికి జవాబుగా బాబూజీ ఏమన్నారంటే, "ప్రతి అభ్యాసి ఒక ఉదాహరణగా తయారయితే, రామచంద్రమిషన్ ఒక ఉన్నత సంస్థగా మారుతుంది."

సిస్టర్ ఏమన్నారంటే నిదర్శనంగా (ఉదాహరణంగా) తయారు కావాలంటే చాలా ధైర్యం కావాలి. చెడుగా మారటం కష్టం. మంచిగా మారటం సులభం. ఒక దొంగ దొంగతనానికై ఎలా చేయాలి, ఎప్పుడు చేయాలి, ఎవరూ చూడకుండా చేసుకోవటం ఎలా? అని ఎన్నో విషయాల గురించి ఆలోచించాలి కాని మంచిగా మారాలంటే హృదయంలో సంకల్పం ఏర్పరచుకుంటే చాలు.

ప్రశ్న : ఈ సృష్టి చాలా విశాలమైనది. చాలా గ్రహాలు ఉన్నాయి. భూమి మీద మాత్రమే ప్రాణులు ఉన్నారా? ఇతర గ్రహాల పైన కూడా ఉన్నారా?

జవాబు : ఈ ప్రశ్నకు జవాబు ఒక శాస్త్రజ్ఞుడిని అడగాలి. ఆతడు మాత్రమే దీనికి సమాధానం చెప్పగలడు. నాకు బాబూజీ మాత్రమే తెలుసు. లాలాజీ భూమా అనే అనంతాన్ని వెతికి బాబూజీని క్రిందకు తెచ్చారు. కాలం చాలా విలువైనది. ఇలాంటివన్నీ ఆలోచించకుండా మన కాలాన్ని కేవలం దైవాన్ని ధ్యానించటం కోసం వినియోగించాలి.

ప్రశ్న : మార్పు ఎలా వస్తుంది?

జవాబు : ఈ భూమిపై ఎవరో ఒకరు అవతరించాలని సంకల్పం ఏర్పడినప్పుడు ఈ మార్పు వస్తుంది. బాబూజీ సంకల్పం వలన మార్పు తప్పకుండా వస్తుంది. బాబూజీ మహారాజ్ తన సంకల్పంతో అందరిని అనంతానికి చేర్చాలని అనుకున్నారు. కాబట్టి మార్పు తప్పక వస్తుంది.

రేపు మీరంతా రైలుబండిలో వెళ్తున్నారు. సహజమార్గ అనే రైలు గురించి చెప్తాను. ఈ సిస్టంలో టిక్కెట్ కొని ఏ భోగీలో కూర్చున్నా గమ్యాన్ని చేరుకుంటాము. వివిధ స్టేషన్‌ల గురించి పట్టించుకోని వారు ఉంటారు, స్టేషన్ గురించి పట్టించుకునే వారు ఉంటారు. రెండు రకాల వారు గమ్యాన్ని చేరుకుంటారు. అలాగే సహజమార్గంలో బాబూజీ సంకల్పం వలన మనం తప్పక గమ్యాన్ని చేరుకుంటాము. ఎవరికీ ఎటువంటి అనుమానము అవసరం లేదు. బాబూజీ ధ్యానంలో ఉంటే గమ్యం తప్పక లభిస్తుంది. లక్నోలో ఒక మాతాజీ కుండలినీ శక్తిని జాగృతం చేస్తారని చెప్తుంటారు. కాని కుండలిని జాగృతం అయాక దాని శక్తిని సక్రమంగా ఉపయోగించకపోతే రావణాసురుడు, కుంభకర్ణులు తయారవుతారు. మన అభ్యాసీలందరికి ప్రోగ్రెస్ లభించినప్పుడు శక్తి లభిస్తుంది. అది బాబూజీ శక్తి. అది అన్ని

మంచి పనులే చేస్తుంది. బాబూజీపై పూర్తిగా నమ్మకం ఉన్నప్పుడే, మనం వారిలో ఉన్నప్పుడే వారి శక్తిని మనం అనుభూతి చెందుతాము. ఒకసారి ఈశ్వర్ సహాయ్‌జీ "బాబూజీ, అభ్యాసీలు ఎన్నో ప్రశ్నలు అడుగుతూ ఉంటే మీరు కొన్ని మరచిపోతారు. ఎందుకని?" అని అడిగారు.

అడగటాన్ని హిందీలో పూచ్‌నా అంటారు. 'న' అనే దాని అర్థం వద్దు అని. "న" అని అన్నారు కదా అందుకే నేను మర్చిపోతాను. ఏదైనా మాటలలో చెప్పటం కాదు, చేసి చూపించాలి" అన్నారు. బాబూజీ ఒకసారి ఏమన్నారంటే, మనిషి రూపాయిలను తయారు చేస్తాడు కాని తానే రూపాయిలకు లోబడిపోయాడు. సృష్టికర్తకు తాను చేసిన సృష్టిపై ఎంతో ప్రేమ ఉంటుంది. తల్లి తన పిల్లలను చేరదీసినట్టు సృష్టిలో అందరినీ తన వద్దకు తీసుకోవాలని కోరిక ఉంటుంది. అనంతం నుండి వచ్చిన బాబూజీ ప్రేమను మనం పొందగల్గినపుడు ఇంత కంటే ఈ ప్రపంచంలో ఇంక ఏదీ అవసరం లేదు.

తల్లిప్రేమ కన్నా బాబూజీకి మనపై గల ప్రేమ చాలా గొప్పది.

"లక్నో రావడానికి రైలు 4 గంటలు ఆలస్యంగా బయలుదేరింది" అని అనగానే, బహెన్‌జీ – "రైలు 4 గంటలు ఆలస్యంగా వచ్చింది. కాని బాబూజీ మహరాజ్ మీ అందరి కొరకు ఎదురుచూస్తూనే ఉన్నారు. దీనికి కారణం ఏమిటి? " నా వద్ద వున్న ఆధ్యాత్మిక సంపదనంతా మీ అందరికీ ఇవ్వాలని తీవ్రమయిన ఆకాంక్షతో వున్నాను' అని బాబూజీ, షాజహాన్‌పూర్‌కు వచ్చిన అభ్యాసులతో చాలా సార్లు అనేవారు. ఇప్పుడు ఆ శుభ సమయం వచ్చిందని నేను భావించుతున్నాను. 'నా వద్ద వున్న ఆధ్యాత్మిక నిధిని, తీసుకోవడానికి అభ్యాసీ సిద్ధంగా వుండాలని బాబూజీ కోరేవారు.

భగవంతుడు మానవుని తన స్థితికి తీసుకొని వెళ్ళడానికి ఈ మానవుని కొరకు ఎదురు చూస్తున్నాడని నేను ఎక్కడా ఎప్పుడూ వినలేదు. కాని ఆశ్చర్యకరమైన, అద్భుతమైన విషయం ఏమంటే, నేను బాబూజీ మహారాజ్ సమస్త మానవాళికి అత్యున్నతమైన, దైవీయ ఆశీర్వచనాలు ప్రసాదించడానికి 'వారు' ఎంతో ఆతృతతో అభ్యాసులందరి కొరకు ఎదురు చూస్తున్నారని నేను ఈ రోజు చెప్పగలను. 'వారు' ప్రసాదించే దివ్యత్వాన్ని, ఆశీస్సులను దివ్య-కృపను స్వీకరించడానికి అభ్యాసులందరూ సిద్ధంగా వున్నారా! అనే దాన్ని గురించి నేను ఏమీ చెప్పలేను. 'వారు' మనందరికి బ్లెస్సింగ్స్ (ఆశీస్సులు) ఇవ్వాలని అనుకుంటున్నారు కాబట్టి, వాటిలోనే అన్నీ వున్నాయి. అనగా ఆ దివ్యత్వాన్ని తీసుకోవడము, గ్రహించడము, అనుభూతి చెందుట, దానిని కాపాడుకొనుట మొదలగునవి అన్నీ కూడ వారి బ్లెస్సింగ్స్‌లో (దైవీయ ఆశీస్సులలో) వున్నాయి. కాబట్టి అభ్యాసీలు, మరల లక్నో వచ్చినప్పుడు బాబూజీ మహారాజ్ ప్రసాదించే దివ్య-ఆశీస్సులను పొందడానికి గాను, తగిన విధంగా తయారయి వుండాలని నేను కోరుతున్నాను. అభ్యాసీలందరు ఆ విధంగా సిద్ధంగా వుండడానికి నేను నా శాయశక్తుల కృషి చేస్తా.

ప్రశ్న : సూపర్-కాన్షస్ మరియు డివైన్-కాన్షస్‌కు గల భేదం ఏమిటి?

జవాబు : చాలా భేదం వుంది. ఒకసారి నేను "బాబూజీ! ఎవరయినా ఏదయినా ప్రశ్న అడిగితే, ఆ ప్రశ్న నా మైండ్ (మనస్సు)ను స్పర్శించుట లేదు. ఆ ప్రశ్న ఎక్కడికి వెళ్ళుతుందో నాకు తెలియదు. కాని జవాబు మాత్రం, ఆటోమేటిక్‌గా (దానంతట అదే) వస్తుంది. నా నోరు మాట్లాడుతుంది నా చెవులు వింటాయి. అప్పుడు, ఆ జవాబు పై నుండి వచ్చింది, అని నాకు తెలుస్తుంది" అని వారికి వ్రాశాను. అప్పుడు వారు, "బిటియా! నాకు చాలా

ఆనందంగా వుంది. లాలాజీ సాహెబ్‌కు కృతజ్ఞతలు, నీవు సూపర్-కాన్షస్ (అధిచేతన) స్థితిలో చేరుకున్నావు, అందువల్లనే ప్రశ్నలకు జవాబులు, దానంతట అదే, ఆ సూపర్-కాన్షస్ స్థితి నుండి వెలువడుచున్నవి. సూపర్-కాన్షస్ అనేది గాడ్లీ-రీజియన్ (ఈశ్వరీయ - దేశం) లోని స్థితి" అని వ్రాసినారు.

అభ్యాసీ సెంట్రల్-రీజియన్‌ను దాటి, అల్టిమేట్-రీజియన్ (భూమా) లోని ఒకటవ వృత్తము దాటి, 2వ వృత్తము (2వ రింగ్)లోనికి ప్రవేశించినపుడు డివైన్-కాన్షస్ అనేది ప్రారంభమవుతుంది, అనగా దైవ సందేశాన్ని ఇస్తుంది. ఈ స్థితిలో అభ్యాసీ పూర్తిగా మరచిన స్థితిలోనే వుంటాడు కాబట్టి భూమాలోని రెండవ వృత్తం దాటినపుడు డివైన్ ఇచ్చే ఆ దైవీయ సందేశాన్ని వినడానికి అవసరమయిన కాన్షస్ (ఎఱుక) ను దైవం ఆ అభ్యాసీకి ప్రసాదిస్తుంది. సూపర్-కాన్షస్ అనేది గాడ్లీ-రీజియన్ (ఈశ్వరీయ-దేశం) కు చెందినది. కాని డివైన్-కాన్షస్ అనేది అల్టిమేట్-రీజియన్ (భూమా)కు చెందినది.

బాబూజీని మరచిపోయాను అనే తలంపే రాకూడదు. ఆఫీస్ పని లేదా ఇంటిపనిలో మునిగిపోయి, 2, 3 గంటల తరువాత బాబూజీ జ్ఞాపకం రాగానే, ఇప్పటి వరకు 3 గంటల సమయం బాబూజీని మర్చిపోయినాను అని అనుకోకూడదు 'బాబూజీ! నేను నీ వానిని!' ఇప్పటి వరకు నా హృదయం మీ చరణాల వద్దనే వుంది' అని అనుకోవాలి. బాబూజీని మరచిపోయాను అనే ఆలోచన రాకూడదు. వారిని మరచిపోయాను అనే ఆలోచన రాగానే, నిరంతర-స్మరణ అనేది అక్కడితో ఆగిపోతుంది. అందువలన 'వారి'ని మరచిపోయినా కూడ, 'వారు' గుర్తుకు రాగానే, 'బాబూజీ! నీ వాడిని' అనే ఫీలింగ్‌లో మునిగిపోవాలి. స్త్రీలు వంట చేస్తున్నప్పుడు, 'బాబూజీ! నా వారు, నా ఎదుటనే వున్నారు, నేను వారినే చూస్తున్నాను' అని భావించాలి. మీరు

రాత్రి నిద్రించే ముందు, రోజంతా పని చేసి అలసిపోయినాను, ఇక నిద్ర పోవాలి అని అనుకోకుండా, బాబూజీ! నా వాడు! 'వారి' చరణాల వద్దనే నా శిరస్సు ఒదిగిపోయినది! అనే ఫీలింగ్‌లో మునిగిపోవాలి.

దివ్య-పురుషుడు బాబూజీ మహారాజ్ అవతరించిన యుగం ఇది. ఇప్పుడు మీరు బాబూజీని స్మరిస్తే 'వారి'తో ఎటాచ్‌మెంట్‌ను అనుభూతి చెందుతారు! రాముడిని, కృష్ణుడిని మరచిపోతారు. రాముడిని, కృష్ణుడిని మీరు స్మరించినా మీ హృదయం వాళ్ళతో ఎటువంటి ఎటాచ్‌మెంట్‌ను పొందదు.

**ప్రశ్న :** ధ్యానంలో పురోగతి చెందుతున్నామని తెలుసుకోవడము ఎలా?

**జవాబు :** 'భగవంతునితో సామీప్యతను అనుభూతి చెందడమే ప్రోగ్రెస్‌కు గుర్తు' అని బాబూజీ అనేవారు. బాబూజీ యొక్క సామీప్యతను మొదట మీ హృదయంలో అనుభూతి చెందుతారు, తరువాత బాబూజీ మీ ఎదుటనే, మీలోనే, మీతోనే వున్నట్లుగా అనుభూతి చెందుతారు. దివ్యత్వం అనే సముద్రంలో లోతుగా మునిగిపోవడమే డివోషన్. ధ్యానంలో లోతుగా వెళ్ళండి, అని బాబూజీ అనేవారు. ధ్యానంలో లోతుగా వెళ్ళడం అంటే, బాబూజీతో ఎక్కువగా సామీప్యత అనుభూతి పొందుట.

'నేను అందరిని ప్రేమిస్తాను' అని బాబూజీ అనేవారు. ఈ దైవీయ-వాక్యం అర్థం కావడానికి నాకు 60 సంవత్సరాలు పట్టింది. ఒక వ్యక్తి అందరిని ప్రేమిస్తాడు అని నేను ఎప్పుడు కూడ ఊహించలేదు. ఎప్పుడయితే ఈ హృదయమే నేత్రంగా మారినపుడు అనగా హృదయనేత్రాలు కేవలం బాబూజీనే దర్శించునో, అప్పుడు ఈ భౌతిక-నేత్రాల ఎదుట ఎల్లవేళలా బాబూజీయే వుంటారు. మీరు ఎవరిని చూచినా మీకు ఆ వ్యక్తి కనబడడు. మొదట బాబూజీయే కనబడుతారు. బాబూజీ వెనుక ఆ వ్యక్తి వుంటాడు.

ఈ స్థితిని పొందిన తరువాతనే నేను అందరిని ప్రేమిస్తాను అనే బాబూజీ అన్నటువంటి ఈ వాక్యం అర్థమయింది.

ఆత్మ అంటే ఏమిటో అనేది నాకు తెలియదు. నాకు కేవలం బాబూజీయే తెలుసు. మీకు ఒకవేళ ఈశ్వర-ప్రాప్తి గురించి క్రేవింగ్ వుంటే, అన్ని విషయాలు సహజముగానే, దానంతట అదే మీకు తెలుస్తాయి. ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నా కుటుంబ సభ్యులు అందరూ మన మిషన్‌లో చేరాలని నాకు కోరికగా వుంది" అని అన్నాడు. అప్పుడు వారు 'నీవు ఈశ్వర సాక్షాత్కారం పొందడాని కొరకు ఈ మిషన్‌లో చేరినావు. మొదట నీ గురించి ఆలోచన చేయి' అని అన్నారు.

అభ్యాసీ 3 సిట్టింగ్స్ తీసుకొని మెడిటేషన్, క్లీనింగ్, ప్రార్థన చేస్తాడు. ఎప్పుడయితే మీ హృదయం తపనతో 'వారి'ని కలుసుకోవాలని 'వారి'తోనే కలిసి జీవించాలని అనుభూతి చెందునో, అప్పుడే మీరు, 'బాబూజీ! నేను నీ వాడిని!' అని హృదయపూర్వకంగా చెప్పగలరు. అప్పుడే నేను మిషన్‌లో చేరినాను అని మీరు చెప్పగలరు. సమస్త మానవాళిని అర్హులుగా తయారుచేసి, అల్టిమేట్ వద్దకు తీసుకొని పోవడానికే శ్రీరామచంద్ర మిషన్ ఏర్పడినది. ఎప్పుడయితే మీలో కూడ ఈ స్థితి ఏర్పడుతుందో, అప్పుడే మీరు నిజానికి శ్రీరామచంద్రమిషన్‌లో చేరినట్లు గుర్తు. 'వారు' మనలను అందరిని అల్టిమేట్ వద్దకు తీసుకొని పోవడానికి తయారుగా ఉన్నారు. మన కోసం ఎదురు చూస్తున్నారు. 'వారి' తో కలసి వెళ్లడానికి మీరందరు కూడ తయారుగా వుండాలి. కో-ఆపరేషన్ (సహకారము) అంటే ఇదే.

ఒక ప్రిసెప్టర్, "బాబూజీ! నేను ప్రతి రోజు 20, 22 సిట్టింగ్స్ ఇచ్చుచున్నాను" అని అన్నాడు. అప్పుడు వారు 'భాయీ! నీవు చాలా కష్టపడి పని చేయుచున్నావు', అని అనగానే ఆ ప్రిసెప్టర్ చాలా సంతోషపడినాడు.

తరువాత రోజు మేమందరము బాబూజీతో కలిసి వరండాలో కూర్చొని వున్నప్పుడు, వారు 'ఎవరయితే అభ్యాసీని మాస్టర్ పాదాలకు అర్పించి సేవ చేస్తారో, అటువంటి ప్రిసెప్టర్ నాకు చాలా ఇష్టం. ఈ ఫీలింగ్ లేకుండా, అభ్యాసీని 'వారి' చరణాలకు సమర్పించకుండా నేను రోజుకు 20,22 సిట్టింగ్స్ ఇచ్చుచున్నాను అంటే, అతడు ఒక కూలీ పనివాడు మాత్రమే' అని అన్నారు.

బాబూజీ కృపకు పరిమితి లేదు. వారి దివ్య-కృప అనంతం, మనం పనిలో మునిగిపోయినపుడు 'వారి'ని మరచిపోతాము. కాని 'వారు' మనలను ఎల్లవేళలా గుర్తుపెట్టుకుంటారు.

'నేను బాబూజీతోనే వున్నాను. 'వారి' పావన-చరణాల వద్దనే వున్నాను,' అని అభ్యాసీ ఎల్లప్పుడు భావించాలి. అంతేకాని, నేను ఏ కండీషన్‌లో వున్నాను? ఏ రీజియన్‌లో వున్నాను? అని ఆలోచించితే మీరు, ఆ స్థితికే పరిమితమై పోవడం జరుగుతుంది. ప్రేమతో బాబూజీ స్మరణలో మునిగిపోయి, వారిలో లయావస్థను పొందినట్లయితే మీకు అన్ని స్థితులు లభిస్తాయి. బాబూజీ స్మరణలో మునిగిపోయి, వారిలోనే ఎల్లప్పుడు మీరు జీవించినట్లయితే, మీరు కూడ ఆ అల్టిమేట్‌లోనే నివసించుచున్నారని అర్థం. బాబూజీతో అనురాగ బంధము పెంచుకోవడము అనేది ఆధ్యాత్మికత పురోగతిలో చాలా ముఖ్యమయిన విషయము. ఈ అనుబంధము అనేది ఎలా వుండాలి? ఎప్పుడయినా అందమయిన పుష్పాన్ని చూడగానే, ఓహ్ ఈ పుష్పం ఎంత ఆకర్షణీయంగా వుంది. అనే ఆలోచన నా మనస్సులోకి వచ్చేది, ఈ ఆలోచన రాగానే, ఈ సృష్టిలో అన్నిటికంటే అందమయినది బాబూజీ మహారాజ్ కదా! అనే 2వ ఆలోచన కూడా వెనువెంటనే వచ్చేది. అప్పుడు ఒక్కసారిగా నా మనస్సు మరల బాబూజీ వైపుకు మరలేది. అనుబంధం అంటే ఈ విధంగా వుండాలి.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! ఈ ప్రపంచంలో ఎన్నో ఆకర్షణలు వున్నవి. అవి నన్ను ఆకర్షించుచున్నవి. నేను నిరంతర స్మరణ ఎలా చేయగలను? భగవంతుని గురించి అన్వేషణ ఎలా చేయగలనో" అని అడిగాడు. అప్పుడు వారు 'భాయి! ఈ ప్రపంచం ఎంతో అందమయినది, అని నీవు అన్నావు. కాని ఈ ప్రపంచంలోని మొత్తం అందం ఆ దైవీయ సౌందర్యంలోని ఒక అణువు మాత్రమే' అని అన్నారు.

శ్రీరామచంద్రమిషన్‌లో ఎవరికయితే దైవంతో కలయిక (కనెక్షన్) వుందో, వారిని యోగి అని అంటాము. నీవు 'వియోగ్' కాకుండా 'యోగి' కాలేవు - అని బాబూజీ అనేవారు. హిందీలో వియోగ్ అనగా సెపరేషన్ (ఎడబాటు) అని అర్థం. అభ్యాసీలో వియోగ్, దైవంతో ఎడబాటై ఉన్నానన్న ఫీలింగ్ వున్నప్పుడు క్రేవింగ్ (తపన) అనేది ఏర్పడుతుంది.

"శరీరం అనేది ఎప్పటికిన్నీ గురువు కాదు. ఎవరయితే ఈ శరీరాన్ని (గురువు యొక్క శరీరంను) గురువుగా భావిస్తారో వాళ్ళు పశువుతో సమానము. దీని వలన వారిలో ఒక ధృఢమయిన సంస్కారం (బంధనం) ఏర్పడుతుంది. ఈ బంధనం నుండి అభ్యాసీ ఎన్నటికిని విముక్తిని పొందలేడు" అని బాబూజీ అనేవారు. ఒకసారి ఈశ్వర్‌సహాయ్‌జీ, "బాబూజీ! మీ రూపం మీద ధ్యానం చేయాలని, అభ్యాసీలకు నేను చెప్పాలని అనుకుంటున్నాను' అని అన్నారు. అప్పుడు బాబూజీ, "భాయి! ఇది నా ఫోటో, ఇదిగో ఇది కూడ నా ఫోటోనే. ఇంకొకటి, ఇది కూడా నా ఫోటోనే, ఈ 3 కూడా నా ఫోటోలే. ఇవి అన్నీ నా శరీరానికి సంబంధించిన ఫోటోలు. నీవేమో శరీరం(రూపం) మీద ధ్యానం చేయాలని చెప్పుచున్నావు. కాని శరీరం శాశ్వతం కాదు కదా! ఈ శరీరం లేనప్పుడు నీవు దేని మీద ధ్యానం చేస్తావు?" అని అన్నారు. మనం బాబూజీ రూపంలోపల దాగి వున్నటువంటి

ఆ డివైన్ పర్సనాలిటీ యొక్క (దైవీయ-సౌందర్యం మును) ఆ రియాలిటీ (వాస్తవికత)ను దర్శించడానికి సాధన చేయుచున్నాము. ఎప్పుడయితే ఈ శరీరాన్ని మరచిపోతావో అనగా నిన్ను నీవు పూర్తిగా మరచిపోయినపుడే, నీవు బాబూజీని పొందగలవు.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! యోగా అంటే ఏమిటి? అని అడిగినాడు. అప్పుడు వారు, 'భాయీ! నేను నిన్ను ధ్యానంలో కూర్చోమని చెప్పలేదు. 'గాడ్ నాలోనే వున్నాడు' అనే సత్యం మీద నీ దృష్టిని వుంచమని చెప్పినాను. 'దైవం - నాలోనే వున్నాడు!' అనే దానిని గుర్తు పెట్టకోమని చెప్పినాను. ఈ దైవీయ సత్యమును జ్ఞాపకం పెట్టుకోవడము వలన ఒక రోజున నీకు ఆ డివైన్‌తో కనెక్షన్ ఏర్పడుతుంది. యోగా అంటే కనెక్షన్. ఆ దైవంతో కలయిక ఏర్పడుతుంది - అని అన్నారు.

ఒకసారి మేమందరము బాబూజీ ఇంటిలో వరండాలో 'వారి' తో కూర్చున్నాము. అప్పటికే బాబూజీ Dr. K.C. వరదాచారిని సెంట్రల్-రీజియన్‌కు తీసుకొని వెళ్ళినారు! అప్పట్లో మాలో ఎవరికి కూడ నిజమయిన డివోషన్ (భక్తి) అనేది లేదు. చాలా మందికి హార్ట్-రీజియన్, మైండ్-రీజియన్, సెంట్రల్-రీజియన్ గురించి తపన వుండేది. దైవం కొరకు తపన లేదు. కాని, ఈ సెంట్రల్-రీజియన్ కొరకు ఆరాటం వుండేది. అప్పుడు ఒక ప్రిసెప్టర్ తనను సెంట్రల్-రీజియన్‌కు తీసుకొని వెళ్ళమని బాబూజీని కోరాడు. వారు ఏమీ మాట్లాడకుండా నిశ్శబ్దంగా వున్నారు. ఆ ప్రిసెప్టర్ మరల షాజహాన్‌పూర్‌కు వచ్చినప్పుడు, బాబూజీ "భాయీ! నీవు నిన్ను సెంట్రల్-రీజియన్‌కు తీసుకొని వెళ్లమని అడిగినావు. నీవు కోరిన విధంగానే నేను నిన్ను సెంట్రల్-రీజియన్‌కు చేర్చినాను. కాని నీవు అక్కడ కూర్చోకుండా, ఇక్కడ (ఈ అభ్యాసుల గుంపులో) ఎందుకు కూర్చొన్నావు?"

అని అడిగినారు. దీని అర్థం ఏమిటంటే బాబూజీ మీకు ఏ స్థితినయితే ప్రసాదించినారో, దానిలోనే ఆ దైవీయ – వాతావరణంలోనే మీరు నివసించాలి. కాబట్టి, 'బాబూజీ! నా వాడు' అనే ఒకే ఒక్క ఫీలింగ్‌ను అభ్యాసీ కలిగి వుండాలి. రీజియన్‌లు, స్థితులను గురించి ఆరాటపడవలసిన అవసరం లేదు.

'బాబూజీ! నా వారు! నాకు చాలా సమీపంలో వున్నారు! అని భావించుట వలన మిమ్మల్ని మీరు సులభంగా మరచిపోగలరు. బాబూజీ నా హృదయంలోనే వున్నారు – అని అనుకోవాలి. ఇక్కడ హృదయం అంటే పిడికెడు గుండె కాదు, మొత్తం సిస్టం – శరీరవ్యవస్థ అంతా కూడా హృదయంగా భావించాలి. మీలోని అణువణువున, మొత్తం సిస్టం అంతా కూడా బాబూజీ వున్నట్లుగా భావించాలి. 'బాబూజీ! నా వాడు!' అనే ఫీలింగ్ మీలో ఏర్పడినపుడు, మీ ప్రోగ్రెస్‌ను ఎవరు కూడా ఆపలేరు. అందువల్ల మీరు బాబూజీ! నా వాడు అని నోటితో అనడం కాకుండా, హృదయంలో అనుభూతి చెందాలి. తమ హృదయంలోనికి రావలసినదిగా అభ్యాసీలు నన్ను ఆహ్వానిస్తారు. నేను అక్కడికి రాగానే, వాళ్ళు నన్ను విడిచిపెట్టి ఎక్కడికో ఏ ఆలోచనలోకో వెళ్ళిపోతారు. నేను ఒక్కడినే ఒంటరిగా, నిశ్శబ్దంగా వాళ్ళ హృదయంలో కూర్చొని వుంటాను. నేను మీ ఇంటికి వచ్చినప్పుడు, మీరు నన్ను వదలి వేరే చోటికి వెళ్ళడం మర్యాద కాదు గదా!' అని బాబూజీ చాలాసార్లు అనేవారు. అందువల్లనే 'బాబూజీ! నీవు నా వానివి! నీవు నాలోనే వున్నావు అనే ఫీలింగ్‌తో వుంటే 'వారు' ఒక్కరే ఒంటరిగా వుండవలసిన అవసరము రాదు. 'వారు' ఎల్లప్పుడు మీతోనే వుంటారు.

'సమస్త మానవాళిని, అత్యున్నతమయిన స్థితికి అల్టిమేట్ వద్దకు తీసుకొని పోవుటకే నేను ధరణి మీద అవతరించినాను' అని బాబూజీ

అన్నారు. ఇది 'వారి' దివ్య సంకల్పం కాబట్టి అందరం తప్పకుండా అక్కడికి అనగా అల్టిమేట్ చేరుకుంటాము.

సబ్‌మిషన్ (ఆత్మ-నివేదన) : బాబూజీ! నా వద్ద సెల్ఫ్ (నేను) అనేది తప్ప ఇంక ఏదీ లేదు. ఈ సెల్ఫ్ (నేను) అనే దానినే మీ చరణాలకు అర్పించుచున్నాను. దయచేసి స్వీకరించండి అని ప్రార్థించాలి. బాబూజీ! నేను నీ వాడిని! అని 'వారి'కి మీ సెల్ఫ్‌ను సమర్పించాలి. ఇదే ఆత్మ-నివేదన (సబ్‌మిషన్), ఈ ఆత్మ-నివేదన పూర్తి అయినపుడు, బాబూజీ ఎల్లవేళల మీ ఎదుటనే వుంటారు. అక్కడ నీవు వుండవు. నీ 'సెల్ఫ్' అనే దాన్ని వారు స్వీకరించినారు. ఇది సరెండర్ (శరణాగతి). ఇప్పుడు బాబూజీ అభ్యాసీని తన ఇష్టప్రకారంగా తయారుచేస్తారు.

'హిందీలో ఉపవాస్ (ఉప+వాస్) అంటే భగవంతునితో నివసించడము అని అర్థం. ఆ రోజంతా ధ్యానంలోను, భగవంతుని స్మరణలో గడపాలి, మనస్సును, దృష్టిని పూర్తిగా భగవంతుని మీద నిలపాలి. కాని ఉపవాసం రోజునే అందరూ పిండివంటలు, స్వీట్స్ తయారు చేయడములో బిజీగా వుంటారు," అని బాబూజీ అనేవారు. నీవు జ్వరంతో 20 రోజులు బాధపడతావు. ఆ 20 రోజులు ఆహారం తీసుకోవు. అప్పుడు అది ఉపవాసం అవుతుందా? అని బాబూజీ నవ్వుతూ అనేవారు. వ్రత్ అంటే సంకల్పం అని అర్థం. హనుమంతుడు సీతామాతను వెదకి తీసుకొని రావాలి అనే ఒక వ్రతం (సంకల్పం) ఏర్పరచుకొన్నాడు, అదే విధంగా 'నేను నా బాబూజీని పొందాలి' అనే వ్రతదీక్ష, ఒక సంకల్పం మీరు ఏర్పరచుకోవాలి.

ఒక అభ్యాసీ, "బాబూజీ! నిజమయిన స్వేచ్ఛ అంటే ఏమిటి?" అని అడిగినాడు. అప్పుడు వారు 'భాయీ! సెల్ఫ్ (నేను) అనే దాని నుండి విముక్తిని పొందడమే నిజమయిన స్వేచ్ఛ" అని అన్నారు. ఒకసారి నేను, 'బాబూజీ!

నేను మరచిన-స్థితిలో జీవించుచున్నాను. ఏదయినా వస్తువును లేదా పనిని మరచిపోవుట లేదు. కాని 'నేను' అనే దానిని మరచిపోవుచున్నాను. ఎప్పుడయినా 'నేను' అనేది గుర్తుకు వచ్చినప్పుడే, ఆ 'నేను' అనేది మీకు చాలా సమీపంలో వున్నట్లుగా అనిపించుచున్నది, అని వారికి ఉత్తరములో వ్రాసినాను.

'బాబూజీ! నేను నీ వాడిని' అని 'నేను' అనే దానిని వారికి సమర్పించినపుడు, అది సెల్ఫ్-సరెండర్ అవుతుంది. అపుడు నేను నుండి విముక్తి (స్వేచ్ఛ) లభిస్తుంది. తరువాత బాబూజీలోనే మునిగిపోయి, 'వారి'లోనే జీవించడము వలన ఆత్మ నెమ్మదిగా కరిగిపోవుచూ డివైన్‌తో మిళితమైపోవును. ఇదే సోల్-సరెండర్ (ఆత్మ-శరణాగతి). కాని ఆత్మ లేకుండా ఎవరూ జీవించలేరు. ఇప్పుడు ఆత్మ స్థానంలో బాబూజీ మహారాజ్ వుంటారు. ఇదే ఫ్రీడం-ఫ్రం-సోల్ (ఆత్మ నుండి స్వేచ్ఛను పొందడము). దీని ఫలితముగా బాబూజీలో లయావస్థ మొదలవుతుంది. బాబూజీయే అభ్యాసీ స్థానంలో వుండి అన్ని పనులు చేస్తారు. దివ్యత్వం అనే సముద్రంలో మునిగిపోయినపుడు లయావస్థకు చెందిన వివిధ స్థితులు అనుభవంలోనికి వస్తాయి. లయావస్థ యొక్క చిట్టచివరి స్థితిలో, శరీరం ఈ ప్రపంచంలో ఆటోమేటిక్‌గా, యాంత్రికంగా అన్ని పనులు చేస్తుంది, నీవు మాత్రము బాబూజీ (డివైన్-పవర్)లోనే జీవించెదవు.

ఒకసారి బాబూజీ నవ్వుతూ, "ఈశ్వర్ సహాయ్‌జీ! ఈ అభ్యాసీ తన బిజినెస్‌ను, కుటుంబ-సభ్యులను అన్నింటిని నాకు సమర్పించినాడు, అని అనుచున్నాడు. కాని నాకు బిజినెస్ (వ్యాపారం) గురించి ఏమీ తెలియదు. అతని బిజినెస్‌అతడినే చేసుకోమను. ఒకవేళ నేను ఆయన బిజినెస్ (వ్యాపారము) చేస్తే నా బిజినెస్‌ను (పనిని) ఎవరు చేస్తారు? నేను ఈ

దైవీయ-కార్యం కొరకే కదా ఇక్కడికి వచ్చినది! అతని భారమంతా నేను తీసుకోవాలని అతని కోరిక. అతడు తన కుటుంబసభ్యులను, బిజినెస్‌ను అన్నీ కూడా ఉట్టి మాటలలోనే నాకు అర్పించుచున్నాడు. నాకు ఇవి ఏవీ అవసరం లేదు. కాని అతని సెల్ఫ్ (నేను) మాత్రమే నాక్కావాలి. ఎందుకంటే ఆ సెల్ఫ్ (నేను) అనేదే అభ్యాసీకి, నాకు మధ్యన దూరాన్ని ఏర్పరచినది. ఆ సెల్ఫ్ వల్లనే అభ్యాసీ ఈశ్వరుని నుండి విడిపోయాడు' అని అన్నారు.

నేను ధ్యానం ప్రారంభించిన తొలి రోజులలో నాకు మెడిటేషన్‌లో ఆలోచనలు వచ్చేవి. ధ్యానంలో ఆలోచనలు రాకపోతే, ధ్యానం సక్రమంగా జరిగింది అని భావించేదానిని. కాని ధ్యానంలో ఆలోచనలు వస్తున్నాయి అంటే నా అటెన్షన్ (దృష్టి) బాబూజీ మీద లేనట్లే కదా! ఒకసారి నేను షాజహాన్‌పూర్‌కు వెళ్ళినప్పుడు, 'బాబూజీ! ధ్యానంలో ఆలోచనలు వచ్చుచున్నప్పుడు, 'ధ్యానం సరి అయిన పద్ధతిలోనే జరుగుచున్నది' అని నేను ఎలా తెలుసుకోగలను? అని వారిని అడిగినాను. అపుడు వారు ఎంతో ప్రేమతో 'బిటియా! ఆలోచనలు అనేవి ధ్యానంలో ఎప్పుడు వస్తూనే వుంటాయి. కాని శాంతి, ప్రశాంతత, ఆనందం, లేదా తేలికదనం వంటి ఏదయినా ఫీలింగ్ (అనుభూతి) నీ హృదయానికి కలిగినట్లయితే, నీ ఆలోచనలు వచ్చినప్పటికిని, ధ్యానం సరి అయిన పద్ధతిలోనే జరుగుచున్నదని అర్థం' అని అన్నారు. ధ్యానంలో పొందినటువంటి ఆనందం, తేలికదనం అలా ఆ స్థితిలోనే మునిగిపోవుటకు ప్రయత్నించినట్లయితే ధ్యానంలో ఆలోచనలు రావు, అని నాకు కొన్ని రోజుల తరువాత అర్థమయింది. కాబట్టి ధ్యానంలో ఆలోచనలు వచ్చినప్పుడు, మీ హృదయంలో కలిగిన ఫీలింగ్ (శాంతి, ఆనందం లేదా తేలికదనం) లోనే మునిగిపోవుటకు మీరు కృషి చేయాలి, అప్పుడు ఆలోచనలు తగ్గిపోయి, కొంత కాలానికి అసలు రావు, ధ్యానంలో

ఈ బ్లెస్సింగ్స్ (ఆనందం, శాంతి లేదా తేలికదనం) అనేవి బాబూజీ నుండి వచ్చుచున్నవి. కాబట్టి ధ్యానంలో మీరు ఈ దైవీయ-ఆశీస్సులను తీసుకొని ఆలోచనలను మరచిపోండి.

ఒక్కొక్కసారి ధ్యానంలో నాకు చాలా ఆలోచనలు వచ్చేవి, ధ్యానం సరిగా చేయలేకపోయేదానిని. అప్పుడు నేను కండ్లు తెరచి, నా ఎదుటనే వున్న బాబూజీ మహారాజ్‌ను అరక్షణం పూర్తి అటెన్షన్ (శ్రద్ధ)తో చూచి మరల మెడిటేషన్ ప్రారంభించేదాన్ని. అప్పుడు ధ్యానంలో ఆలోచనలు రావడం ఆగిపోయేది. కాబట్టి ధ్యానంలో మీకు ఎక్కువగా ఆలోచనలు వచ్చినప్పుడు, వెంటనే ఒక 1/2 నిమిషం కండ్లు తెరచి, బాబూజీ నా ఎదుటనే వున్నారు', బాబూజీ నా వారు అనే ధృఢమయిన ఫీలింగ్‌తో మరల ధ్యానం ప్రారంభించండి. ఆలోచనల తీవ్రత వెంటనే తగ్గిపోతుంది.

కుర్చీలో కూర్చొని వున్న బాబూజీ ఫోటోను, లేదా వారి రూపంను గాని, నిరంతరం జ్ఞాపకం చేసుకోవడము అనేది నిరంతర-స్మరణ కాదు. ధ్యానంలో మీకు ఏదయితే ఫీలింగ్ (అనుభూతి) కలిగినదో, ఆ స్థితిలోనే, బాబూజీ ప్రసాదించిన దైవీయ-ఆశీస్సులలోనే నిరంతరం మునిగిపోయి వుండడానికి కృషి చేయాలి. నిరంతర-స్మరణ అంటే ఇదే. ధ్యానంలో కలిగిన అనుభూతి (ఫీలింగ్)లోనే మునిగిపోయి జీవించుట వలన బాబూజీతో సామీప్యత ఎక్కువగా ఏర్పడుతుంది.

బాబూజీ! నా వారు! అని నోటితో అనడం వలన ప్రయోజనము లేదు. బాబూజీ! నా వారు! అని నోటితో అన్నప్పుడు మీ హృదయం 'వారి' సామీప్యతను అనుభూతి చెందాలి. బాబూజీ! నా వారు! అని మీరు అన్నప్పుడు, మిమ్మల్ని మీరు మరచిపోవాలి. అక్కడ మీరు వుండకూడదు. కేవలం 'వారు' మాత్రమే వుండాలి. ఒకసారి బాబూజీ, **'బితియా!**

ఎటాచ్‌మెంట్ (అనుబంధం) అనేది అభ్యాసీ వైపు నుండి రావాలి, ప్రేమ అనేది నా వైపు నుండి వస్తుంది' అని నాకు ఉత్తరములో వ్రాసినారు. కాబట్టి 'బాబూజీ! నా వారు' అని మీరు వారితో అనుబంధం ఏర్పరచుకోవాలి.

'నేను అభ్యాసీని రోజుకు 4, 5 సార్లు 1 గంట, 2 గంటలు, 3 గంటలు ధ్యానం చేయమని చెప్పలేదు. దైవం నా హృదయంలోనే వున్నారు అనే దానినే గుర్తుపెట్టుకోమని చెప్పినాను' అని బాబూజీ అనేవారు. 'బాబూజీ! నా వారు! నాలోనే వున్నారు! నన్నే చూస్తున్నారు అనేదానిని మీరు గుర్తుపెట్టుకుంటే చాలు.

బాబూజీ మహారాజ్ కృప వలన, 'వారి' కోరిక ప్రకారం, ప్రతీ అభ్యాసీ యొక్క ఆత్మ, మరల బయటకు రాలేని విధంగా, శ్రీబాబూజీ మహారాజ్ కృపలోనే పూర్తిగా మునిగిపోయింది. తల్లి ఎల్లప్పుడు తన బిడ్డలు ఆనందంగా వుండాలని కోరుకుంటుంది. అదే విధంగా బాబూజీ కూడా మీరందరు ఈ స్థితిలో నిరంతరం ఆనందంగా వుండాలని కోరుచున్నారు. అంతే కాదు, ఇది వారి సంకల్పం కాబట్టి, బాబూజీ దివ్య-కృపలో మునిగిపోయిన మీ ఆత్మ మరల బయటకు రాదు. మీరు ఇంటి పని లేదా ఆఫీస్ పనిలో మునిగి పోయినప్పటికిని, బాబూజీ జ్ఞాపకం రాగానే, నా ఆత్మ బాబూజీ కృపలోనే మునిగిపోయి వున్నది అని జ్ఞాపకం చేసుకుంటే, మీరు ఇక్కడ పొందిన స్థితిలోనే మునిగిపోయి వుంటారు. బాబూజీ మహారాజ్ సమస్త మానవాళిని అల్టిమేట్ (భూమా) వద్దకు తీసుకొని వెళ్లాలి అనే దివ్య-సంకల్పంతో అవతరించారు. ప్రాపంచిక జీవితంలో మీ డ్యూటీ (విధి)ని మీరు సక్రమంగా నిర్వహించండి. కాని మీ ఆత్మ 'వారి'లోనే మునిగిపోయినది. 'వారి' పావన-చరణాల వద్దనే వుంది, అనే విషయాన్ని మాత్రం మరచిపోవద్దు. మీలోని ఐ-నెస్ అనేది తొలగించబడి, ఐ(నేను) అనేది ఆత్మగా మార్పు

చెంది, ఆత్మ అనేది వారి దివ్య-కృపలోనే మునిగిపోయినది. మీరు బాబూజీలోనే ఇంకా ఇంకా మునిగిపోవుటకు కృషి చేయండి. ఈ స్థితిలో నుండి బయటకు మాత్రము రాకూడదు. సహజమార్గ్ అంటే ఒక జీవన విధానము అని బాబూజీ చెప్పినారు. అనగా అన్ని పనులను చేస్తూనే, నిరంతరం వారి దివ్య-కృపలో మునిగిపోయి జీవించడం.

బాబూజీ ఆశీస్సులు మనందరికీ ఎల్లప్పుడూ వుంటాయి. వాటిని మనం పొందగల్గాలి. అందుకు మనందరం సిద్ధంగా వున్నామా అంటే లేకపోయినప్పటికీ సిద్ధంగా వుండవలసిన అవసరం వుంది.

ప్ర : సూపర్ కాన్షస్ మరియు డివైన్ కాన్షస్ అంటే ఏమిటి?

జ : ఎవరైనా నన్ను ప్రశ్నించినపుడు, నేను ఆలోచన చేయకుండా సమాధానం వస్తుంది. అనగా అది దివ్యతలం నుండి వస్తుంది. అది సూపర్‌కాన్షస్ (అధిచేతనా మనస్సు) అనబడుతుంది. బాబూజీకి దగ్గరగా వుండటాన్ని డివైన్ కాన్షస్ అంటారు.

ప్ర : వైడ్ గ్లింప్స్ అంటే ఏమిటి?

జ : మన ఎదుట - వెనుక, అన్ని వైపులా ఎటు చూసినా బాబూజీనే దర్శించటాన్ని వైడ్‌గ్లింప్స్ అంటారు.

ఒక అభ్యాసీ బాబూజీతో తన కుటుంబ సభ్యులందరూ మన మిషన్ చేరాలనే కోరిక వున్నట్లుగా చెప్పాడు. దానికి జవాబుగా బాబూజీ, ముందుగా ఆ అభ్యాసీ గురించే ఆలోచించుకొనమని, సాక్షాత్కారం కొరకు అతడు ఈ మిషన్‌లో చేరాడన్న విషయాన్ని గుర్తుంచుకోమని చెప్పారు. సాధన ద్వారా అభ్యాసి బాబూజీలోనే నివసించే విధంగా గాఢంగా ప్రయత్నిస్తే అపుడు అతడు శ్రీరామచంద్ర మిషన్ అభ్యాసిగా గుర్తింపబడతాడు.

నేను బాబూజీ పుస్తకాలు చదవలేదు. బాబూజీ నాతో ఏదైనా వ్రాయించాలని సంకల్పించినపుడు, ఆ విషయాన్ని నా కన్నుల ముందు ప్రత్యక్ష పరుస్తూ వుంటే నేను దానిని వ్రాయటం జరిగింది. అంతేకాని నాకు నేనుగా వ్రాసిందేమీ లేదు. అభ్యాసికి తను ఏ స్థాయిలో వున్నదీ తెలుసుకోవాలనిపిస్తుంది. నాకు బాబూజీయే ఆ స్థితిని గురించి, స్థాయిని గురించి చెప్పితే తెలిసేది. అందుచేత బాబూజీ తీసుకొస్తున్నట్లు అభ్యాసీలు ముందుకు సాగిపోవాలే గాని తామెక్కడ వున్నామనే ఆలోచన అనవసరం. అభ్యాసీ బాబూజీతో బంధమేర్పరుచుకుని వారితో లయావస్థలో పూర్తిగా మునిగిపోతే దక్కవలసినంతా దక్కుతుంది. కనుక పరిమితమైన దానినే కోరుకుంటే అపరిమితమైన దానిని అందుకోలేము. అభ్యాసీ బాబూజీలోనే నివసించటం ముఖ్యంకాని, ఏమి పొందుతున్నదీ తెలుసుకోవటం ముఖ్యం కాదు. కష్టే ఫలే అన్నట్లు సాధన కొద్దీ సాఫల్యం వుంటుంది.

విముక్త ఆత్మలు (Liberated souls) అవసరం కల్గినపుడు దివి నుంచి దిగి వచ్చి బాబూజీకి తమ సేవలు సమకూర్చుతారు. మోక్షం (Salvation) అనేది తాత్కాలికం. ముక్తి కోసం మళ్ళీ జన్మ తీసుకోవాలి. బ్రహ్మలోకం అనేది దేవుడున్నాడని గ్రహింపు కల్గించేది. అది ఆధ్యాత్మిక జీవనానికి ఆరంభం కూడా కాదు.

ఒక అభ్యాసి, ధ్యానంలో వున్నప్పుడు తన శరీరం కాంతివంతంగా కన్పించిందని చెప్పాడు. అది అతనికి సంక్రమించిన దివ్యకాంతి, కాని దానిని గురించి ఆలోచించకూడదు.

I-You - అనగా "నీవు" నుంచి "నేను" వేరు పడిన కారణంగా మళ్ళీ 'నీవు' లో కలిసిపోవటానికి చేసే కృషియే సాధన అనబడుతుంది.

బాబూజీ మనల్ని ఎప్పుడూ వెన్నంటే వుండేవారు. అందుకు మన

శరణాగతి ముఖ్యం. ఒకసారి నేను హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం వెళ్ళనని చెప్పినపుడు, బాబూజీ నాకు తోడుగా వుంటానని అభయమిచ్చారు. హాస్పిటల్‌లో నేను బెడ్ విడిచి బాత్‌రూమ్‌కు వెళ్ళిన సమయంలో డాక్టరు వచ్చి చూస్తే నా మంచం కాంతివంతంగా కన్పించింది. తాకితే షాక్ కొట్టినట్లయ్యింది. అంతలో నేను తిరిగి వచ్చి బెడ్ మీద వున్నాను. అపుడు డాక్టర్ వచ్చి వారికి కల్గిన అనుభవాన్ని చెప్పారు. అనగా బాబూజీ మనల్ని వెన్నంటి వుంటారనడానికి నిదర్శనం.

ప్ర. **1955** లో బాబూజీ మీకు వ్రాసిన ఉత్తరంలో "ఒకే సమయంలో ఇద్దరు విశిష్టమూర్తులు **(special personalities)** (దివ్య పురుషులు) మెలగటం సంభవం కాదు, ఒకరు నిష్క్రమించిన తరువాతనే మరొకరు ప్రవేశించడం జరుగుతుంద"ని వ్రాశారు. అలాగే **1956**లో బాబూజీకి మీరు వ్రాసిన లేఖలో మీలో కొంచెం చీకటి యింకా మిగిలి వుందని తెలియజేసినపుడు బాబూజీ మీకిచ్చిన సమాధానంలో – ఆ కాస్త అంధకారం కూడా తొలగిపోయినట్లయితే నీవు మహా పార్షద్‌లో ప్రవేశించడం జరుగుతుంది. (ఒకే సమయంలో మహాపార్షద్ స్థితిలో ఇద్దరు వుండటం అసంభవం కదా) కనుక స్వామి వివేకానంద నీలో ఆ కాస్త అంధకారాన్ని నిలిపి వుంచారు – అని చెప్పారు. అయితే ఇపుడు బాబూజీ భౌతికంగా లేరు కనుక మిమ్మల్నే ఆ దివ్యమూర్తిగా భావించవచ్చునా?

జ: ఆ విధంగా మహాపార్షద్ చేరుకోగలవారుగా తయారు చేయగలవారు ఒక్కరే వుంటారు. ఆ ఒక్కరే బాబూజీ. ఆ శక్తి వారికి మాత్రమే వుంది. అలా చేయబడిన వారిలో నేనొకరిని. అటువంటి శక్తి లాలాజీ గారికి వుంది. వారు తయారు చేయగలరు. నేను చేయగలను అని మీరనుకున్నా అలా చేసేది బాబూజీగారే.

తల్లిదండ్రులు తమ బిడ్డల్ని వెన్నుతట్టి, అండగా నిలిచి ఉన్నత విద్యావంతులుగా చేసి కలక్టరు వంటి ఉన్నత పదవులు పొందేటట్లు చేయవచ్చు. అంత మాత్రం చేత వారు తల్లిదండ్రుల్ని అధిగమించిన వారు కాలేరు. వారి తల్లిదండ్రుల స్థానాన్ని విలువైనదిగానే గ్రహించాలి. మనకు బాబూజీ ఒకే ఒక్కరు. వారెంత మందినైనా అలాటి వారిని తయారు చేయగలరు. వారు తయారు చేసిన అనేక మందిలో కస్తూరి కూడా ఒకరిగా తయారుకాబడింది. కళాకారుడు ఎన్ని విగ్రహాలనైనా తయారు చేయగలడు. అలాగే చిత్రకారుడు ఎన్ని చిత్రాలనైనా చిత్రించగలడు. అయితే ఆధ్యాత్మిక రంగంలో ఎంతమంది ఎంతగా ఎదిగినా బాబూజీ వారికి వారే సాటి. అలాగే మనం ఎంత ఉన్నత స్థితిని పొందినప్పటికి వారితో సమతూగలేము. "అసలు" "సిసలు" ఎప్పటికీ వారే! డాక్టర్ వరదాచారిగారు ఒకసారి "నీకివ్వవలసిందంతా యిచ్చేసాను. ఇంక నీకు నా అవసరం లేదు" అని బాబూజీ చెప్పినట్లుగా వెల్లడించారు. వారికి బాబూజీ తమ శక్తితో ఆ స్థాయిని కల్పించారు. వరదాచారిగారు తన స్వశక్తితో ఆ స్థాయికి ఎదగలేదు. ఆ శక్తికి బాబూజీయే సర్వాధికారి.

బాబూజీ నాకిచ్చిన స్థితులతో నేను పూర్తిగా సంతృప్తి చెందాను. వారు తయారు చేయదలచిన విధంగా నన్ను తయారు చేశారు. కనుక తయారు చేయగలవారు నాతోనే వుండగా నాకు ఆ అవుసరం లేదు.

అభ్యాసులందరూ బాబూజీ మహారాజ్ యొక్క శక్తితోనే ఉన్నత స్థితికి వెళ్ళగలరు. 'తమ' శక్తితోనే మనల్ని పరిపూర్ణ మానవులుగా తయారుచేస్తారు. వారి సంకల్పమూ, శక్తి లేకుండా మనం పైకి వెళ్ళటం కాని, దిగి రావటం కాని జరగదు. మనమొక దివ్య స్థితిని పొందినపుడు ఆ దివ్య వాతావరణం కూడా మనకు అనుకూలించగా దాని యొక్క అనుభూతిని పొందుతాము. అదే పరిపూర్ణ స్థితి.

బాబూజీ తనకు దైవంతో నేరుగా సంబంధం కల్పించినట్లుగాను, యిక 'వారి' అవసరం లేదని వ్రాసినట్లుగా వరదాచారిగారు నాతో ప్రస్తావించినపుడు, నేను ఆయనతో - మీ స్థితి బాబూజీకి తెలుసు గనుక 'వారు' అలా వ్రాశారు. కాని మనకు 'వారి' అవసరం ఎప్పుడూ వుంటుంది - అన్నాను. బాబూజీ అభ్యాసీల గురించి గొప్పగా చెబుతారు గాని తాము గొప్పవారమని ఎప్పుడూ చెప్పరు. అందుచేత వారి ప్రశంసలకు పొంగిపోయి మనం గొప్పవారమనే భావన రానీయకూడదు. బాబూజీ ప్రేమతో వరదాచారి గారికి ఆ ఉన్నత స్థితుల అనుభవం కల్పించారు. మనం భక్తి ప్రేమలతో అటువంటి స్థితిని పొందగల్గితే అది ఘనతగా వుంటుంది. బాబూజీ అందరినీ అంతిమం చేర్చటానికే అవతరించారు.

**ప్రశ్న : ప్రిసెప్టరు అభ్యాసీకి సిట్టింగ్ యిస్తున్నపుడు అభ్యాసి యొక్క స్థితి ప్రిసెప్టరు పైన ప్రభావం చూపుతుందా?**

జవాబు : ప్రిసెప్టరు దైవ సాన్నిధ్యంలో బాగా (గాఢంగా) మునిగి వుండి సిట్టింగ్ యిస్తే ఆ స్థితి అభ్యాసిని ప్రభావితం చేసి, మంచి అనుభవం కల్గిస్తుంది కాని, అభ్యాసిలో ఏమైనా ఆలోచనలు వంటివి వున్నా ప్రిసెప్టరు మీద వాటి ప్రభావం వుండదు. సూర్యుని తేజస్సు భూమి మీద ప్రజ్వరిల్లుతుంది కాని భూమి ప్రభావం సూర్యుని మీద పడదు.

సాధనలో మనం దైవంతో అనగా బాబూజీతో యోగం చెందుతాము. మన సాధన సఫలం కావాలంటే వారితో మన కనెక్షన్ (సంబంధం) సామీప్యత చెందాలి. ఎంతగా సామీప్యత చెందితే అంతటి శక్తి మనకు చేకూరుతూ వుంటుంది. ప్రిసెప్టరు ద్వారా మనకు వారిని చేరే దారి ఏర్పాటయ్యింది. కనుక ప్రిసెప్టరు, అభ్యాసీ కూడా బాబూజీలోనే లయలీనమై వుంటే వారి సామీప్యతానుభవంతో పాటు వారిచ్చిన స్థితుల

అనుభవం కూడా కల్గుతుంది. సిట్టింగ్‌లో కల్గిన అనుభూతిని ఆ తర్వాత కూడా స్మరించుకుంటూ వుండాలి. బాబూజీతో మన అనుబంధాన్ని ఒకవేళ ఏదైనా పని మూలంగా ఆదమరిచినప్పటికీ, అలా భావించకుండా వారినే స్మరించుకుంటూ వున్నట్లుగా అనుభూతి చెందాలి.

ఆత్మ లేకుండా శరీరముండదు కాని, శరీరం లేకుండా ఆత్మ వుండగలదు అని బాబూజీ వ్రాశారు. ధ్యానంలో బాబూజీని ఎంత ప్రేమతో మనలో నిలుపుకొని, ఎంత సామీప్యతను పొందుతామో అంతగా మనలో ఆనందం కలుగుతుంది. ధ్యానం తర్వాత కూడా మన హృదయం ఆనందానుభూతిని నెమరువేసుకుంటూ వుంటుంది. అలాగున్నపుడు ధ్యానం బాగా జరిగినట్లుగా అనుభూతి చెందటం మన వంతవుతుంది. ఒకవేళ ధ్యానంలో ఆలోచనలు అవాంతరం కల్గించినట్లుగా అనుభవమైతే వాటిని గురించి పట్టించుకోకుండా బాబూజీ మహారాజ్ మనవారు, మన ఎదుటనే వున్నారు, వారు లేకుండా మనం లేము అనుకుంటే వాటి ప్రభావం మనపైన వుండదు. బాబూజీయే మనకు రక్షణ కల్పిస్తారు.

ప్రశ్న : శూన్యస్థితి నుండి మహాపార్షద్ (తురీయాతీత) స్థితికి చేరటమెలా సాధ్యం?

జవాబు : అది వూహామాత్రంగా సాధ్యపడదు. ప్రేమ, భక్తితో వారితో సాన్నిధ్యం కల్పించుకొని అత్యంత సామీప్యత చెందటం ద్వారానే అది సాధ్యపడుతుంది. బాబూజీ అపుడు మనల్ని కూడా ప్రేమించి, తమ సంకల్పశక్తితో మనల్ని తీసుకువెళ్తారు. ఆ విధంగా అది సంభవమే, సందేహం లేదు.

బాబూజీ ఏమి చెప్పేవారంటే స్థితుల గురించి తలంపు కాకుండా అనుభూతి కలగాలి అని చెప్పేవారు. వారంతట వారుగా అభ్యాసి యొక్క స్థితిని గురించి చెప్పేవారు కాదు. నా అనంత యాత్రలో నాకు కల్గిన

అనుభవం కూడా కల్గుతుంది. సిట్టింగ్‌లో కల్గిన అనుభూతిని ఆ తర్వాత కూడా స్మరించుకుంటూ వుండాలి. బాబూజీతో మన అనుబంధాన్ని ఒకవేళ ఏదైనా పని మూలంగా ఆదమరిచినప్పటికీ, అలా భావించకుండా వారినే స్మరించుకుంటూ వున్నట్లుగా అనుభూతి చెందాలి.

ఆత్మ లేకుండా శరీరముండదు కాని, శరీరం లేకుండా ఆత్మ వుండగలదు అని బాబూజీ వ్రాశారు. ధ్యానంలో బాబూజీని ఎంత ప్రేమతో మనలో నిలుపుకొని, ఎంత సామీప్యతను పొందుతామో అంతగా మనలో ఆనందం కలుగుతుంది. ధ్యానం తర్వాత కూడా మన హృదయం ఆనందానుభూతిని నెమరువేసుకుంటూ వుంటుంది. అలాగున్నపుడు ధ్యానం బాగా జరిగినట్లుగా అనుభూతి చెందటం మన వంతవుతుంది. ఒకవేళ ధ్యానంలో ఆలోచనలు అవాంతరం కల్గించినట్లుగా అనుభవమైతే వాటిని గురించి పట్టించుకోకుండా బాబూజీ మహారాజ్ మనవారు, మన ఎదుటనే వున్నారు, వారు లేకుండా మనం లేము అనుకుంటే వాటి ప్రభావం మనపైన వుండదు. బాబూజీయే మనకు రక్షణ కల్పిస్తారు.

ప్రశ్న : శూన్యస్థితి నుండి మహాపార్షద్ (తురీయాతీత) స్థితికి చేరటమెలా సాధ్యం?

జవాబు : అది వూహామాత్రంగా సాధ్యపడదు. ప్రేమ, భక్తితో వారితో సాన్నిధ్యం కల్పించుకొని అత్యంత సామీప్యత చెందటం ద్వారానే అది సాధ్యపడుతుంది. బాబూజీ అపుడు మనల్ని కూడా ప్రేమించి, తమ సంకల్పశక్తితో మనల్ని తీసుకువెళ్తారు. ఆ విధంగా అది సంభవమే, సందేహం లేదు.

బాబూజీ ఏమి చెప్పేవారంటే స్థితుల గురించి తలంపు కాకుండా అనుభూతి కలగాలి అని చెప్పేవారు. వారంతట వారుగా అభ్యాసి యొక్క స్థితిని గురించి చెప్పేవారు కాదు. నా అనంత యాత్రలో నాకు కల్గిన

అనుభూతిని వారికి లేఖల ద్వారా తెలియజేసినపుడు మాత్రమే నేను అనుభూతి చెందినదేమిటో చెప్పేవారు. అనుభూతి అనేది మానసికంగా కాకుండా హృదయపరమైనదిగా వుండాలి. బాబూజీని ఆలోచన ద్వారా కాకుండా హృదయంలో వారున్న అనుభూతిని చెందుతూ వుండాలి. హృదయంలో వారికి చేరువ కావటానికి తపన వుండాలి. లాలాజీ మహారాజ్ తన కఠోర సాధన ద్వారానే బాబూజీ మహరాజ్‌ను భూమా నుండి అవతరించేటట్లు చేశారు. నిరంతర స్మరణ, తపన, సామీప్యత ద్వారానే మనకు ఆ స్థితిని పొందే అవకాశం కల్గుతుంది. మొదట బాబూజీ మనలోనే వున్నారన్న తలంపు ద్వారా సామీప్యతానుభవం కల్గుతుంది. ఆ తర్వాత వారి స్మరణ కల్గినంతనే మన హృదయములో వారి ఉనికిని అనుభూతి చెందుతాము. ఇది అభ్యాసము ద్వారా సాధ్యమవుతుంది.

ఒకసారి ఒక అభ్యాసి తాను ఏ రీజియన్‌లో వున్నాడో, ఏ స్థితిలో వున్నాడో తెలియజేయమని బాబూజీని మరీ మరీ కోరాడు. అపుడు బాబూజీ అతనితో నీకు కల్గిన అనుభూతి, సామీప్యత ఎటువంటిదో చెప్పమన్నారు. అనగా బాబూజీ యొక్క సామీప్యతానుభూతి ద్వారానే అభ్యాసి యొక్క పురోగమనం తెలుస్తుంది. బాబూజీ నీలోనే, నీతోనే, నీ ఎదుటనే వున్నారన్న అనుభూతి ద్వారా నీ ప్రగతిని సాధించవచ్చు. దాని కొరకు అభ్యాసం చేయాలి.

ప్ర : భౌతికంగా బాబూజీ ఉన్నపుడు మీ ప్రోగ్రెస్ గురించి చెప్పేవారు. కాని 'వారి' తర్వాత మన ప్రోగ్రెస్ గురించి ఎవరు తెలియజేస్తారు?

జ : నీ హృదయమే (అందులోని బాబూజీయే) చెప్తుతుంది. నేను నా యొక్క స్థితులను గురించి బాబూజీకి వ్రాసినపుడు, వారు నా మీద పరిశోధన చేశారు కనుక ఆ స్థితులేమిటో తెలియజేసేవారు. వారి పరిశోధన నిమిత్తం

ఆ రియాలిటీని (సత్యత్వాన్ని) త్వరగా సాధింపజేయాలి కనుక నా స్థితులను వేగవంతం చేశారు. ఆ స్థితి ఏమిటో చెప్పేవారు. ఇపుడు మీరు కూడా నన్నడిగి తెలుసుకోవచ్చును. నేను అభ్యాసం చేస్తున్నానని అనుకోవటం లేదు. నాలో బాబూజీని వెదుకుతున్నాను. వారి దివ్యత్వాన్ని చూడగోరుతున్నాను. నాకు ఎప్పుడు ఏ స్థితి కల్గినా అది బాబూజీ యిచ్చిన దివ్య ప్రసాదమనే అనుకుంటున్నాను. మనలో బాబూజీ వున్న అనుభూతి చెందినట్లయితే 'వారే' మనకు ఆ స్థితులను ప్రసాదిస్తారు.

నేను బాబూజీకి నా స్థితులను గురించి వ్రాసేటపుడు, ఆ స్థితి కలిగే సమయంలో అక్కడున్న పరిసరాలను, వాతావరణాన్ని, దివ్యశక్తి ప్రభావాన్ని గురించి కూడా వ్రాశాను. మనం చాలా సావధానంగా అప్రమత్తంగా వుంటేనే కాని వారిచ్చే స్థితులను తెలుసుకోలేము. 'నేను చూస్తున్నాను, చాలా సార్లు అన్వేషిస్తున్నాను. బాబూజీ మహారాజ్ వున్నారని, వారు దివ్యపురుషులనీ తెలుసు. మీ కళ్ళల్లోకి చూస్తున్నాను. అసలు మీరేమిటి అని చూస్తున్నాను. మీ శరీరం మాత్రం యిక్కడ వుంది. కాని మీ రియాలిటీ (సత్య స్వరూపం) ఎక్కడుందా అని అన్వేషిస్తున్నాను. నేను అక్కడి ఆవరణ మరియు ఆ స్థితి యొక్క స్థితిని కూడా చూస్తూ వాటినెలా ప్రసాదిస్తున్నారా అని తరచి చూస్తున్నాను' అని వ్రాశాను.

నేను మొదటిసారి షాజహానుపూరు వెళ్ళినపుడు కుర్చీలో కూర్చుని వున్న బాబూజీ స్వరూపం నా కళ్ళలో నిలిచిపోయింది. ఇంటికి తిరిగి వెళ్ళేప్పుడు వారు లేకుండా జీవించలేననిపించింది. ఇంకా రెండు మూడు రోజులుండాలనిపించింది. కాని బాబూజీ మాత్రం నా ప్రయాణానికి సిద్ధం కమ్మని చెప్పారు. నాకు చాలా బాధ కల్గింది. అంటే అప్పటికి వారి కుర్చీలో వున్న స్వరూపాన్ని మాత్రమే అనగా బాహ్యరూపం మాత్రమే నిలుపుకున్నాను.

నేను మరుసటి దఫా (మరోసారి) షాజహానుపూరు వెళ్ళి వారిని దర్శించినపుడు వారు కుర్చీలో ఆసీనులై వున్న దృశ్యమే మనసులో వుంది. కాని యింటికి తిరుగు ప్రయాణమైనపుడు వారు నాతోనే వస్తున్నట్లు , నా ఎదుటనే నిల్చి యున్నట్లు అనుభూతి కల్గింది. నాలో వున్న తపన వారి ప్రజెన్స్ (ప్రత్యక్షత) అనగా వారు నా హృదయంలో నిలిచి నా ఎదుట, నా వెంట వున్నట్లుగా చేసింది. భౌతికంగా బాబూజీ కుర్చీలోనే వున్నారు. "ఈసారి నన్ను మరో రెండు రోజులు వుండమని చెప్పినా నేను వుండటం లేదు" అని వారికి చెప్పి తిరిగి వచ్చాను. అంటే యిప్పుడు వారు నా హృదయంలోనే నిలిచిపోయారు. నేను వారికి దూరంగా లేను, అనే అనుభూతి నాకు సంతృప్తినిచ్చింది. అనగా వారు మనలోనే, అంతర్యామిగా నిలిచియున్నట్లుగా అనుభూతిని కల్గిస్తారు. ఎవరైనా బాబూజీ మహారాజ్‌ను ఎవరనిగాని, ఎలా వుండేవారు అని గాని సంభాషిస్తే నా మనసు అందుకు అంగీకరించేది కాదు. ఎందుకంటే వారు ఎల్లప్పుడూ వున్నారు, అంతటా వున్నారు, అందరిలోనూ వున్నారు. కనుక ఒకప్పుడు అనే ప్రశ్నకు తావుండకూడదు. మీరు బాబూజీ మహారాజ్ నా వారు అని అనుకోగానే వారు మీ హృదయంలో దర్శనమిస్తారు. ముఖతః (నోటితో) బాబూజీ నా వారు అని అనుకున్నా అనుభూతి మాత్రం హృదయంలో కల్గుతుంది. అనుబంధం యొక్క స్థితి అలాగుంటుంది. ఆ విధంగా బాబూజీకి మనల్ని సమర్పించుకున్నపుడు లోపల వున్న 'మన' (నేను) తొలగిపోయి 'వారి'కి స్థానమిచ్చినట్లవుతుంది. ఆ శరణాగతి మూలంగా అహం కరిగి దైవత్వమే చోటు చేసుకుంటుంది.

ప్ర: స్పందన అంటే ఏమిటి? దాని ద్వారా సృష్టి ఎలా ఏర్పడింది?

జ: స్పందన అనేది సృష్టికి కారణమయింది. ఆదిశక్తిలో క్షోభ కల్గిన కారణంగా ఆ శక్తి వచ్చి సృష్టి నిర్మాణం చేసింది. లాలాజీ సాహెబ్ తన కఠోర తపస్సు,

దీక్ష ద్వారా ఆ ఆదిశక్తిలో స్పందన కల్గించి సమస్త మానవాళిని ఉద్ధరించటం కోసం బాబూజీని అవతరింపజేశారు. ఆదిశక్తి సమన్వితుడైన బాబూజీతో మనం సంబంధమేర్పరుచుకుంటే దివ్యశక్తి వారి నుంచి మనకు వస్తుంది. హృదయంలోకి 'వారి'ని ఆహ్వానించాలి. అపుడు ఎల్లప్పుడూ వారు మనలోనే మన ఎదుటనే వున్నట్లుగా అనుభూతి కల్గుతుంది.

నేను వారి దివ్య సంకల్పం ద్వారా ఆ శక్తిని పొందుతున్నాను. వారు సమస్త మానవాళిని ఉద్ధరించటం కోసం వచ్చారు కనుక నేను మాత్రమే కాదు, వారితో అనుబంధం పెంచుకున్న అభ్యాసీలందరూ కూడా ఆ దివ్యశక్తిని పొందగల్గుతారు. ఆ శక్తి ఎటువంటిదంటే మీకు మీరుగా ఏమీ తెలియదనుకున్నప్పటికి, ఎవ్వరైనా మిషన్ గురించి చర్చించితే అప్రయత్నంగానే మీరు సమాధానం చెప్పగల్గుతారు. ఈ వాస్తవాన్ని మీరు పరీక్షించుకొని నిర్ధారించుకోవచ్చు.

ప్ర : (ఐడెంటిటీ)అంటే ఏమిటి?

జ : బాబూజీ ఎప్పుడూ నెగేషన్ స్థితిలో వుంటారు. మానవుడు కూడా సృష్టించబడిన తొలిదశలో ఇదే స్థితిలో వుండేవాడు. అనగా ఫర్‌గెట్‌ఫుల్ స్థితిలో - మరపుస్థితిలో (విస్మృతావస్థలో). వ్యక్తి తాను జీవించి యుండి కూడా తన యొక్క స్పృహ లేనివాడై వుంటాడు. తన శరీరము, ఉనికి యొక్క జ్ఞానము కోల్పోయిన వాడుగా వుంటాడు. బాబూజీ అతనికి వాని యొక్క ఉనికిని లేదా జీవించి యున్న జ్ఞానాన్ని కల్గించదలచినపుడు - వెంటనే అతనిలో ఆ స్పృహ కల్గుతుంది. అనగా దైవంలోనే లీనమై పోయి తాదాత్మ్యం చెందిన స్థితిలో, తాను లేకపోయిన స్థితి నుంచి వున్నట్లు స్ఫురింపజేయటమే ఐడెంటిటీ.

నేను అందరినీ ప్రేమిస్తున్నాను. ఎవ్వరినీ ద్వేషించడం లేదు. అని

అనుకోవటంలో నేను అనేది వుంది కాబట్టి అది మీ వ్యక్తిగతం అవుతుంది. బాబూజీ ప్రమేయం వుండదు. అందులో సమర్పణ భావం లేదు కనుక, అది సరైనది కాదు. అలా కాకుండా లయావస్థలో వున్నపుడు మాత్రమే బాబూజీ బాధ్యత వహిస్తారు. నీకు బాధ్యత లేనట్లుగా అనుభూతి చెందుతావు. అటువంటి స్థితిలో నీ శరీరానికేదైనా బాధ కల్గినప్పటికీ అదెక్కడో వుందని అనుభూతి కల్గుతుందే కాని నీకు చెందినదిగా అనిపించదు. అలా కాకుండా దుర్భరమైన బాధ కల్గినపుడు నీవు చేసే ఆక్రందన బాబూజీకి చేరుతుంది. దానికి నివారణ వారు చేస్తారు. బాబూజీ మహరాజ్ ఈ విధంగా అభ్యాసులను ఉన్నత స్థితికి చేర్చుతారు. ఈ కృషిలో వారి పాత్రయే ఎక్కువగా ఉంటుంది. మనమల్లా ప్రేమ, భక్తితో వారితో అనుబంధం పెంచుకొని వారికి సహకరించటమే. మనకు బాబూజీ నా వారే అన్న తలంపు హృదయపూర్వకంగా ఎల్లప్పుడూ వుండాలి. నిరంతర స్మరణ, వారితో అనుబంధం వల్ల మనకు అన్నీ సిద్ధిస్తాయి. బాబూజీ నావారే అని అనుకోవటం ఒక దారం లేదా సూత్రం వంటిది. దానిని అంటిపెట్టుకుని సాగిపోతే మనకు దక్కవలసింది దక్కుతుంది. ఇది వూరికే అనుకోవటం కాదు. అలా అనుకోవటం లేదా తలంపు ద్వారా హృదయంలో ఆత్మీయత, అనుబంధం, అనుభూతికి రావాలి. ఆ అనుభూతి మన తలపునకు (థాట్) వాస్తవ రూపమన్నమాట.

చాలా సంవత్సరాల తర్వాత నేను వ్రాసినదానికి అర్థం గ్రహించగల్గాను. నేను బాబూజీకి వ్రాసే వుత్తరంలో అనంతయాత్రలో నాకు కల్గిన స్థితిని, అనుభవాన్ని వివరించేదానిని. అది నాకు గల్గిన స్థితియో లేదా నేను చేరిన ఆ ప్రాంతపు స్థితియో (condition or condition of that condition) నాకు తెలియదు. బాబూజీ నుంచి సమాధానం వచ్చిన తర్వాతనే దాని వివరం తెలిసేది. అది నా స్థితి కాదు, అది స్థితి యొక్క స్థితి అనగా

అక్కడి దివ్యస్థితి అనీ, దానిని వారి కృప వల్లనే స్థితి యొక్క అనుభూతి చెందగలమని గ్రహించాను. ఈ సూక్ష్మము తెలుసుకోవటానికి నాకు చాలా సంవత్సరాలు పట్టింది.

**ప్ర : మన జీవిత కాలంలో బాబూజీతో అనుబంధం కల్గి వుంటాము. మరణించిన తర్వాత కూడా ఆ బంధం కొనసాగుతుందా?**

జ : మన నిరంతర స్మరణ ద్వారా వారితో విడదీయరాని సంబంధం మన జీవితకాలంలో నెలకొల్పుకుంటే మన మరణం తర్వాత కూడా అదే కొనసాగుతుంది. మన ప్రేమ, భక్తి ఫలితంగా బాబూజీ యొక్క ఆకర్షణ మన చేయి పట్టుకుని ముందుకు నడిపిస్తుంది. మనం వారికి అర్పితమయ్యాము కనుక మనల్ని వదలిపెట్టరు. మరణం శారీరకమైనది కాని ఆత్మకు నశింపులేదు.

**ప్ర : మరణ సమయంలో బాబూజీని తలచుకొనకపోతే ఏమవుతుంది?**

జ : జీవించి యున్న కాలంలో కొనసాగిన అనుబంధం మరణించిన తర్వాత కూడా అది ఆత్మతో కొనసాగుతుంది. ఒక అభ్యాసి జీవన్మరణాలతో పోరాడుతూ అపస్మారక స్థితిలోకి జారుకుంటూ, మళ్ళీ స్పృహలోకి వస్తూ వున్నాడు. వైద్యులు అతడు బ్రతకటం కష్టమని నిర్ణయించారు. ఆ అభ్యాసి తన ఆరోగ్యం కుదుటపడిన తర్వాత బాబూజీకి యిలా వ్రాశారు. "నాకు జబ్బులో అపరిమితమైన బాధ కల్గింది. నా ఆత్మ శరీరము వదలిపోతున్నట్లుగా అనిపించింది. అపుడు ఆ ప్రాంతమంతా మీరు వ్యాపించి యున్నట్లుగా అనిపించింది. మీ చల్లని స్పర్శతో దారి చూపుతూ తీసుకెళ్ళినట్లనిపించింది". కనుక బాబూజీ మనల్ని జీవించి యున్నపుడు, అలాగే జీవితం చాలించిన తర్వాత కూడా తమ కనుసన్నలలో నిలిపి యుంచుతారు. మనం మనకు కల్గిన స్థితులను నిలుపుకుంటూ, సతత స్మరణ, తపన కల్గి యుంటే వారు

ఉన్నత స్థితులను, ఉత్తమగతిని అనుగ్రహిస్తారు. ఆ విధంగా అభ్యాసీకి ఎప్పుడూ విజయమే కల్గుతుంది.

బాబూజీ మనకు యిచ్చిన వరదానము ద్వారా ఉన్నత స్థితులు అనుగ్రహిస్తున్నారు. వాటిని నిలుపుకోగల అర్హత పొందాలంటే మనం అందుకు తగినట్లుగా సాధన ద్వారా తయారుకావాలి. అపుడే మనకు వారిచ్చిన వరప్రసాదం దక్కుతుంది.

ఒక అభ్యాసి బాబూజీని మీరిచ్చిన వరదాన్ ఫలం మాకు దక్కుతుందా అని అడిగాడు. దానికి సమాధానంగా బాబూజీ – నేను అంతిమం నుండి ఆ ఉన్నత స్థితులను మీ కొరకు తరలించుకు వచ్చాను. మీరు శ్వాస ద్వారా గాని, స్పర్శ ద్వారా గాని ఆ దివ్యత్వంతో సంబంధం కల్గి వుంటే మీకూ అవి సమకూరుతాయి. అందుకు తగిన యోగ్యులుగా మీరు తయారు కావాలి – అని చెప్పారు. పరిపూర్ణత్వం నుంచి ఏది వచ్చినా అది పరిపూర్ణంగానే వుంటుంది. మనలో సతత స్మరణ, సాధన ద్వారా దానిని జీర్ణించుకోవాలి.

ప్ర : మనం బాబూజీతో పూర్తిగా సంబంధం కల్గియున్నట్లు ఎలా తెలుస్తుంది?

జ : అది ఐడెంటిటి దాని గురించి నేను వ్రాశాను. మన హృదయంలోని బాబూజీ యందు మనం లీనమై వున్నపుడు, ఎవరైనా దేనినైనా అడిగితే చేతితో యిస్తాము, ఏమైనా చెప్పవలసి వస్తే నోటితో చెపుతాము. అలా భౌతికంగా మనంచేసే పనులు మనసుకు తెలియవు. వాటంతటవమే జరిగిపోతాయి. ఇటువంటి స్థితి కల్గినపుడు బాబూజీతో మన సంబంధం దృఢంగా వున్నట్లు గ్రహించవచ్చు. "బాబూజీ" అని వినగానే మన హృదయంలో ప్రేమానుభూతి కలగాలి.

ప్ర : మనం బాబూజీలో లయమైనట్లు ఎలా తెలుస్తుంది?

జ : ఒక వ్యక్తి నీటిలో మునిగి తిరిగి రానంతగా మునిగిపోయే వరకు కొన్ని స్థితులుంటాయి. చనిపోయే వరకు మునగటం, తేలటం, బుడగలు వేయటం లాంటి స్థితులుంటాయి. అలాగే సంపూర్ణ లయావస్థ పొందటానికి ముందు కొన్ని స్థితులుంటాయి. వాటిలో తాను స్పృహ కోల్పోవటము (మరపుస్థితి) తిరిగి తన ఉనికిని తెలుసుకోవటమూ జరుగుతూ వుంటాయి. మన పరిపూర్ణ లయావస్థ అనేది మనం పూర్తిగా మనల్ని మరచిపోయినపుడే లేదా కోల్పోయినపుడే, అనగా ఇది శరీరాన్ని విడిచి వెళ్ళిన తరువాతే కల్గుతుంది.

ప్ర : ఆత్మ సమర్పణ అంటే ఏమిటి?

జ : మనం ఏ పని చేస్తున్నప్పటికీ దానిని నేను చేస్తున్నాను. నా వల్ల ఫలానా మంచి ఫలితం కల్గిందని భావించకుండా, ధ్యాసను హృదయంలో బాబూజీ మీదనే నిలిపి చేస్తున్నట్లయితే అందులో 'తన' ప్రమేయం లేకుండా వుంటుంది. అనగా ప్రతిదీ భగవదార్పితంగానే ఉంటుంది. దీనిలో అహం వుండదు కనుక ఆత్మసమర్పణమవుతుంది.

ప్ర : ఆత్మ సాక్షాత్కారం, భగవత్ సాక్షాత్కారం **(Self Realization), (God Realization)** రెండూ ఒక్కటేనా?

జ : ఆత్మ సాక్షాత్కారం అనగా నిన్ను నీవు తెలియపర్చుకోవటం (తెలుసుకోవడం) నీలో దైవం వున్నాడని తెలుసుకోవటము (ఆత్మ పరమాత్మ విచారణ) ఇది ఆత్మసాక్షాత్కారమవుతుంది. నీ గురించి నీవు చెపుతున్నపుడు ఆ దైవం గురించే చెబుతున్నట్లుగాను అంతయు ఆ పరమాత్మమయమే అని అనుభూతి చెందటమే భగవత్ సాక్షాత్కారమవుతుంది. అంతా పరాధీనంగా అనగా దైవపరంగా తలపించబడుతుంది. ఎంత గొప్ప విషయమైనా

సాధారణమైనదిగానే అనిపిస్తుంది. కొంతమంది యితరుల గురించి వారి దివ్యస్థితుల గురించి మాట్లాడుతారు. నేను నాకు కల్గిన దివ్య స్థితుల గురించి అభ్యాసుల ఉన్నతి గురించి మాట్లాడతాను కాని యితర విషయాలు వింటున్నా, చెబుతున్నా శ్రద్ధ ఉండదు.

ఒక డివైన్ పర్సనాలిటీ – దివ్యపురుషుడు అవతరించినపుడు మనలో దైవాన్ని చేరాలనే తపన ఎంత తీవ్రంగా వుంటే అంత యిదిగా మనం వారి ద్వారా బాగా ఆకర్షింపబడి అంత త్వరగా గమ్యాన్ని చేరతాము. అది ఎలాగుండాలంటే, శలభం (కీటకం) అగ్నిచే ఆకర్షింపబడి దానిలో దగ్ధమైపోవటానిక సిద్ధపడిపోయినట్లుగా వుండాలి.

బాబూజీని అభ్యాసులు తమ స్థితి (కండిషన్)ని గురించి అడుగుతూ వుండేవారు. ఒకసారి ఒక అభ్యాసి తన స్థితిని గురించి అడిగినపుడు – నీకు జ్వరం వస్తే ఎంత టెంపరేచర్ వచ్చిందో తెలుసుకుంటావు. తగ్గాక కూడా నీవు ఆ జ్వరంలో వున్న స్థితిని గురించి వివరిస్తావు. అలాగే నీ ఆధ్యాత్మిక స్థితిని గురించి ఎందుకు తెలుసుకోలేక పోతున్నావు. 'నీవు' అప్రమత్తంగా వుంటే స్వయంగానే గ్రహించగలవు – అన్నారు.

ప్రిసెప్టర్ మరియు అభ్యాసి కూడా బాబూజీలో గాఢంగా నిమగ్నమై పోవటానికి అనగా ఎంత బాగా స్మరణ కల్గియుంటే అంత బాగా ఫలితాన్ని పొందగల్గుతారు. వారు మనల్ని తమ ఒడిలోనికి చేర్చుకోవటానికి సిద్ధంగా వున్నారు. మనం హృదయంలో "మీరు నా వారు" అని ఎంత దగ్గరగా బాంధవ్యం పెంచుకుంటే అంతగా చేరువవుతాం. అభ్యాసులు ధ్యానంలో వుండగా నాకెప్పుడైనా అసౌకర్యంగా అనిపిస్తే, అపుడు బాబూజీని – మీరు నాకు ఏదైతే ప్రసాదించారో దానిని అభ్యాసులకు కూడా ప్రసాదించండి, అని వేడుకొనేదానిని.

పుస్తకాలు చదువుతారు కాని ఎంతవరకు అర్థం చేసుకున్నామనేది ప్రశ్న. నాకు బాబూజీ వ్రాసిన వుత్తరాలు చదువుతుంటే ఒక్కసారిగా అర్థమయ్యేవికావు. వాటిని మళ్ళీ మళ్ళీ చదివితే ఆంతర్యం తెలిసేది. తెలియనిదానిని తెలుసుకోవటం కోసం తపన వుండాలి. బాబూజీ అనేవారు – హృదయంలో బాధ పెంచుకో – అని. మరయితే ఏదైనా దెబ్బ తగిలితే గాని బాధ వుండదు. అపుడు గాని బాధ గురించి ఆలోచించము. అలాగే తపన పెంచుకొంటే దానిని తీర్చటానికి బాబూజీ కృప లభిస్తుంది. సంస్కారాలు మన బాధలకు కారణమవుతాయి. సంస్కారాలే లేకుంటే మనకు బాధలుండవు.

బాబూజీ ఇలా చెప్పారు – ఈశ్వరుడు సర్వవ్యాపి. అయినపుడు ఒకే మూర్తి (విగ్రహం) లో మాత్రమే వుండడు గదా. అలా అన్ని మూర్తులలో వ్యాపించి యుంటాడు. మూర్తి (రూపం) అనేది మన మనస్సుతో తయారు చేయబడుతోంది. వాస్తవానికి మన సహజమార్గంలో అందరికన్నా ఎక్కువగా మూర్తి పూజ చేస్తున్నాము. మనము సాధన ప్రారంభించినపుడు ఈశ్వరుడు మన హృదయంలోనే వున్నాడని భావించుకొని పూజ ప్రారంభిస్తాము. ఆ ఈశ్వరుడు మన ఒక్కరి హృదయంలోనే కాక అందరి హృదయాల్లోనే వున్నాడు. దైవం ఈ మానవాళిని సృష్టించి అందరిలోనూ తన దివ్యత్వాన్ని నిలిపాడు. అనగా మానవమాత్రులందరూ ఆ దివ్యత్వం (రియాలిటి) తో సమకూర్చబడిన మూర్తులే. చిత్రకారుడు లేదా శిల్పి తన భావన కొద్దీ ఎన్నో మూర్తులను తయారుచేస్తాడు. కాని వాటిలో దివ్యతను నింపలేడు. ఎందుకంటే అవి మానవనిర్మితం. అందుచేత నీవూ ఒక మూర్తివే! నీలోనే వున్న దైవాన్ని వెదుకు. అలా అన్వేషించడంలో అహం అనగా ఐ–నెస్ కరిగిపోయి దివ్యత్వం (సత్యత్వం) వృద్ధి చెందుతూ వుంటుంది. ఇది గ్రహించలేక యిటీవల అనేకానేకంగా విగ్రహాలు సృషించబడుతున్నాయి, ఆరాధించబడుతున్నాయి. ఈశ్వరీయతను దూరంగా వుంచి దానికోసం వెతుకుచున్నారు.

పుస్తకాలు చదువుతారు కాని ఎంతవరకు అర్థం చేసుకున్నామనేది ప్రశ్న. నాకు బాబూజీ వ్రాసిన వుత్తరాలు చదువుతుంటే ఒక్కసారిగా అర్థమయ్యేవికావు. వాటిని మళ్ళీ మళ్ళీ చదివితే అంతర్యం తెలిసేది. తెలియనిదానిని తెలుసుకోవటం కోసం తపన వుండాలి. బాబూజీ అనేవారు – హృదయంలో బాధ పెంచుకో – అని. మరయితే ఏదైనా దెబ్బ తగిలితే గాని బాధ వుండదు. అపుడు గాని బాధ గురించి ఆలోచించము. అలాగే తపన పెంచుకొంటే దానిని తీర్చటానికి బాబూజీ కృప లభిస్తుంది. సంస్కారాలు మన బాధలకు కారణమవుతాయి. సంస్కారాలే లేకుంటే మనకు బాధలుండవు.

బాబూజీ ఇలా చెప్పారు – ఈశ్వరుడు సర్వవ్యాపి. అయినపుడు ఒకే మూర్తి (విగ్రహం) లో మాత్రమే వుండడు గదా. అలా అన్ని మూర్తులలో వ్యాపించి యుంటాడు. మూర్తి (రూపం) అనేది మన మనస్సుతో తయారు చేయబడుతోంది. వాస్తవానికి మన సహజమార్గంలో అందరికన్నా ఎక్కువగా మూర్తి పూజ చేస్తున్నాము. మనము సాధన ప్రారంభించినపుడు ఈశ్వరుడు మన హృదయంలోనే వున్నాడని భావించుకొని పూజ ప్రారంభిస్తాము. ఆ ఈశ్వరుడు మన ఒక్కరి హృదయంలోనే కాక అందరి హృదయాల్లోనే వున్నాడు. దైవం ఈ మానవాళిని సృష్టించి అందరిలోనూ తన దివ్యత్వాన్ని నిలిపాడు. అనగా మానవమాత్రులందరూ ఆ దివ్యత్వం (రియాలిటి) తో సమకూర్చబడిన మూర్తులే. చిత్రకారుడు లేదా శిల్పి తన భావన కొద్దీ ఎన్నో మూర్తులను తయారుచేస్తాడు. కాని వాటిలో దివ్యతను నింపలేడు. ఎందుకంటే అవి మానవనిర్మితం. అందుచేత నీవూ ఒక మూర్తివే! నీలోనే వున్న దైవాన్ని వెదుకు. అలా అన్వేషించడంలో అహం అనగా ఐ–నెస్ కరిగిపోయి దివ్యత్వం (సత్యత్వం) వృద్ధి చెందుతూ వుంటుంది. ఇది గ్రహించలేక యిటీవల అనేకానేకంగా విగ్రహాలు సృషించబడుతున్నాయి, ఆరాధించబడుతున్నాయి. ఈశ్వరీయతను దూరంగా వుంచి దానికోసం వెతుకుచున్నారు.

ఒకసారి బాబూజీతో కలిసి మధురై వెళ్ళాను. బాబూజీ అక్కడొక ప్రజా సభలో పాల్గొని ఉపన్యసించారు. ఉపన్యాసం ముగిశాక ఇద్దరు పూజారి సోదరులు వచ్చి బాబూజీతో "మీరు చెప్పిన దానిని మేము పరీక్షించుకోవాలి" అంటూ అందులో ఒకరు "మా తమ్మునకు సిట్టింగ్ యివ్వండి" అని కోరాడు. వారి ఉద్దేశ్యంలో బాబూజీ సిద్ధాంతంలో మూర్తిపూజ చేయరు కనుక దానిలో పస లేదని చులకన భావన ఉంది. మరుసటి రోజు ఉదయం బాబూజీ వద్దకు వెళ్ళగా నన్ను సిట్టింగ్ యివ్వమని చెప్పారు. అలా యిచ్చాక ఎలా వుందని అడిగితే ఏమీ ఫీల్ కాలేదని చెప్పాడు. అలాగే రెండవసారి కూడా, ధ్యానం నిలవలేదు అని చెప్పారు. మూడవసారి సిట్టింగ్ యిచ్చాక నీకు ఏమి అనుభవం కల్గిందని అడగ్గానే తాను కళ్ళు తెరవలేనంత లోతుగా ధ్యానంలోకి వెళ్ళిపోయినట్లుగా, తన ఉనికి గురించి ఏమీ తెలియనంతగా అందులో మునిగిపోయినట్లుగా చెప్పాడు. అప్పుడు బాబూజీ వారితో "నీవు చిన్నప్పటి నుంచి విగ్రహారాధన చేస్తున్నావు. ప్రతి నిత్యమూ, రోజంతా అర్చనలు చేస్తూనే వున్నావు కదా, మరి దైవం మీద ధ్యానం ఎందుకు నిలపలేక పోయావు" అని అడిగారు. దీని అర్థమేమిటంటే అతను యాంత్రికంగా విగ్రహారాధన చేస్తున్నాడే కాని దైవం మీద మనసు నిలపలేదు. నేను చేస్తున్నాను అనే దానిలో 'అహం' వుంటుంది. అనగా అది ఒక క్రియగానే వుంటుంది కాని, ఫీలింగ్ లేదా దివ్యానుభూతి వుండదు. ధ్యానంలో అహం లేకుండా దివ్యానుభూతి కల్గుతుంది. బాబూజీ అందుకే ధ్యానం చేస్తున్నాను అని అనుకోకుండా, ధ్యానంలో వున్నానని లేదా ధ్యానంలో నిలుపుకుంటున్నానని అనుకోవాలి అని చెప్పేవారు. ధ్యానం ద్వారా దైవంతో మనకు సంబంధం కల్గుతుంది. ప్రార్థన ద్వారా దైవం పట్ల భక్తి, ప్రేమ ప్రేరేపింపబడతాయి. క్లీనింగ్ (నిర్మలీకరణ) ద్వారా మనలోని మాలిన్యాలు

కరిగిపోయి పవిత్రత ఏర్పడుతుంది. ధ్యానము అయిపోయింది అనుకోకుండా ధ్యానంలోనే నిరంతరము ఉన్న భావన కల్గియుండాలి. ధ్యానము, సాధన అనేవి దివ్యత్వాన్ని పొందటానికి, దైవసాన్నిధ్యం పొందటానికి మాత్రమే కాని భౌతికపరమైన లేదా ప్రాపంచిక పరమైన విషయాలలో లబ్ధి పొందటానికి కాదు.

ఒకసారి ఒక ప్రిసెప్టర్ బాబూజీతో – తన కుమారునికి రాత్రి విపరీతంగా జ్వరం వచ్చిందని, రాత్రి కావటం చేత వైద్యుని వద్దకు వెళ్ళి వచ్చే అవకాశం లేనందున బాబూజీ అని ఒక కాగితం మీద వ్రాసి దానిని ఒక గ్లాసు నీళ్ళలో కలిపి తాగించిన తర్వాత తెల్లవారేసరికి జ్వరం నిదానించిందని చెప్పాడు. అప్పుడు బాబూజీ అతనితో "ఒక్క పదిపైసల మాత్రతో తగ్గే జ్వరానికి నన్ను నివారణోపాయంగా ఉపయోగించావు. నేను మానవాళినంతటినీ ఉద్ధరించటానికి వచ్చాను కాని యిటువంటి అల్ప ప్రయోజనం కోసం కాదు" అని హెచ్చరించారు. **కనుక మనం చేరవలసిన లక్ష్యం ఆత్మోన్నతికే కాని ఆర్థిక, ఆరోగ్య అవసరాల కోసం కాదు. సమస్యలుంటే దైవానికి నివేదించుకోవాలే కాని పరమార్థాన్ని వాటికి పణంగా పెట్టకూడదు.** అందుచేత బాబూజీ అభ్యాసులతో చెప్పేవారు – మన సంస్థలో చేరదలచుకున్నవారు ఆధ్యాత్మిక ప్రయోజనం కోసమే కాని ప్రాపంచిక కోర్కెలు నెరవేర్చుకోవటానికి కాదు – అని. అందుచేత సహజ మార్గంలోకి మన మెవ్వరినైనా ఆహ్వానించదలచుకున్నపుడు వారికి ఈ ప్రాథమిక అంశాన్ని వివరించటం అవసరం అని బాబూజీ చెప్పేవారు. మిషన్‌లో ఎందరైనా చేరవచ్చు. కాని ఎవరైతే ఆ రియాలిటీ (సత్యత్వం) కోసం కాంక్ష, విశ్వాసం కల్గి వుంటారో వారే నిజమైన అభ్యాసీల జాబితాలో వుంటారు.

ప్ర : ఒక అభ్యాసికి ధ్యానంలో కూర్చున్నపుడు కన్నీరు పెల్లుబుకుతుంది. అవి దుఃఖంతో వచ్చేవి కాదు కదా!

జ : అవి వాటంతట అవే వస్తున్నాయి. భక్తి, ప్రేమ మూలకంగా కావచ్చు. బలవంతంగా రప్పించుకున్నవి కానపుడు కరక్టుగానే భావించాలి. ఆంతరికమైన క్లీనింగ్ వల్ల కూడా అలా కావచ్చు. ఏది ఏమైనా అసహజమైన జీవనం పాపం. నిరంతర స్మరణతో మెలగటం యోగ్యమైనది, దివ్యమైనది. బాధలు అనేవి ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమయంలో కల్గుతాయి. విజ్ఞత ఏమిటంటే వాటిని మరచిపోవాలే కాని మననం చేసుకోకూడదు. అందుకు బదులుగా సంతోషంగా వుండే అలవాటు చేసుకోవాలి. ఆ సంతోషాన్నే స్మరించుకుంటూ వుంటే బాధలు అనేవి తలపుకు రావు. సంతృప్తి, సంతోషం సుఖశాంతుల నిస్తాయి. బాధల గురించిన ఆలోచనను దరి చేరనివ్వవు.

ఒక స్త్రీ, తాను పది సంవత్సరాల క్రితం టైఫాయిడ్ జ్వరానికి గురైనపుడు అనుభవించిన బాధల గురించి ప్రస్తావించసాగింది. అంటే ఆమె తన బాధలనే స్మరిస్తూ వుంది. కాని తాను పొందిన సుఖాలను గురించి కాదు. మనం దైవస్మరణ గురించి మరచిపోయామన్న సంగతినే మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకుంటున్నట్లయితే అది మరపుకే మొగ్గినట్లవుతుంది. అవే కాకుండా మనం దైవాన్ని మళ్ళీ జ్ఞాపకం చేసుకొని స్మరిస్తున్నాం అని మరీ మరీ అనుకుంటూ వుంటే అది నిరంతర స్మరణను సక్రమం చేసి ఆ దైవంతో మన సంబంధాన్ని నిలుపుతుంది. బాబూజీ మహారాజ్ నీలోనే వున్నారు అనుకుంటే నీవు మరచిపోయే అవకాశముండదు.

బాబూజీ మహారాజ్‌తో ఒక అభ్యాసి - నేను ధ్యానాన్ని ప్రతి నిత్యం నియమంగా చేయలేకపోతున్నాను, ఏమి చేయమంటారు - అని అడిగారు. బాబూజీ అతనికి - నీవు దశ నియమాలలో మొదటిది అనగా ప్రాతః

కాలమే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని ధ్యానంలో కూర్చోమని చెప్పిన దానిని అనుసరించు - అని చెప్పారు. బాబూజీ ప్రేమ పొందటానికి ఎటువంటి నియమాలు లేవు. అందరిపట్లా వారి ప్రేమ వుంది. దశ నియమాలు మన జీవన సరళిని క్రమబద్ధం చేయటానికి కొన్ని సూచనలు, సలహాలు వంటివిగా మనం భావించుకోవాలి. సాధన చేయటానికి అనేక కారణాలను సాకులుగా చెప్పేవారి కోసం ఆ దశ నియమాలను సూచించారు. అలా ఏర్పాటు చేశారు.

ఒకసారి మాస్టారు ఈశ్వర్ సహాయ్‌గారు బాబూజీతో - ఒక్కోసారి కొందరు మీతో పరుషంగానూ, చెడుగానూ మాట్లాడుతారు, అప్పుడు మీలో ద్వేషంగాని కోపంగాని కలగవా, అని అడిగారు. దానికి సమాధానంగా - నన్నెవరైనా మంచిగా మాట్లాడినా చెడుగా మాట్లాడినా అవి నా అంతరంగాన్ని తాకలేవు. నా హృదయమంతా లాలాజీ సాహబ్ ఆక్రమించుకుని వున్నారు. అందులో ఏమీ ప్రవేశించటానికి చోటు లేదు. ఏదైనా నా అంతరంగాన్ని తాకినపుడు నేనందుకు స్పందిస్తాను అని చెప్పారు బాబూజీ. దీని నుంచి మనం నేర్చుకోవలసిందేమిటంటే, మనం కూడా బాబూజీ మహరాజ్‌ను అంతగా ప్రేమించాలి, వారితో మమేకం కావాలి. ప్రేమ తప్ప మరోదానికి తావివ్వకూడదు. "అభ్యాసులు నన్ను చూడటానికి వస్తుంటారు కాని "అసలు" చూడకుండానే వెళ్లిపోతారు. కలుసుకోవటానికి సమయం కోరతారు, "కలవ"కుండానే వెళ్ళిపోతారు. అని బాబూజీ అంటూ వుండేవారు. దాని అర్థమేమిటంటే భౌతికంగా 'వారి' రూపాన్ని దర్శిస్తున్నారే కాని 'వారి' దివ్యత్వాన్ని కానే కాదు. మన ఆత్మ ఎలా వుంటుందో, ఎక్కడ వుంటుందో మనకేమి తెలుసు. ఆ ఆత్మలో వున్న పరమాత్మను దర్శింపజేసి సాక్షాత్కారం అనుగ్రహించగల శక్తి ఒక్క బాబూజీకి మాత్రమే వుంది. ఆ పరమ సత్యాన్ని

మనం గ్రహించి హృదయంలో వారినే నింపుకుంటే షాజహానుపూరులో కుర్చీలో దర్శన మిచ్చిన బాబూజీ అక్కడే వున్నప్పటికీ, మన మెక్కడికి వెళ్ళినా, ఎక్కడ వున్నా కూడా మనలోనే మన వెంటే వుంటారు. బాబూజీ మనకు మన హృదయంలోనే దైవం వున్నాడని బోధించి, ఆ హృదయేశ్వరుని ఆరాధించటం ద్వారా సాక్షాత్కారం పొందేటట్లు చేయటానికే అవతరించారు. వారినే మనం ఆరాధించాలి, వారి ప్రేమను పొందాలి, ఆ ప్రేమయే మనకు పెన్నిధి.

ఏ ఇతరుల మీద కాకుండా బాబూజీ గురించియే పాటలు వ్రాస్తారు మీరు అనే విషయం గురించి చెబుతూ "నాకు బాబూజీ మహరాజ్ గురించి తెలుసు. వారెప్పుడూ నాలోనే, నాతోనే వుంటారు. వారు నాకు శక్తినిస్తుంటారు. వివేకాన్నిస్తుంటారు. వారు వ్రాయించినందువల్లనే నేను వ్రాయగల్గుతున్నాను" అని అన్నారు.

అభ్యాసులు గ్రూపులుగా విడిపోయినప్పటికీ, వారు శ్రీరామచంద్ర మిషన్‌లో చేరారు కనుక అందరూ శ్రీబాబూజీ మహరాజ్ పాద పద్మాల వద్దకు చేరవలసిందే. బాబూజీ మహరాజ్ అందరినీ అంతిమానికి తీసుకు వెళ్ళటానికే దిగి వచ్చారు కనుక, ఎవరినీ వదలి పెట్టరు. ఎవరెన్ని చెప్పినా, ఏమి చేసినా ఎవరెవరి వద్దకు వెళ్ళినా సరే చివరకు బాబూజీ మహరాజ్ గారి వద్దకు వెళ్ళాల్సిందే.

"లివింగ్ మాస్టర్" (జీవించి యున్న మాస్టర్) అనే ఆలోచన వచ్చినట్లయితే దానిని విశ్లేషణ చేసుకుంటే లివింగ్ (సజీవ) అనేది శరీరానికే కాని ఆత్మకు కాదు. ఆత్మ నశింపులేనిది, కనుక లివింగ్ (సజీవ) అనే దానికి ప్రాధాన్యతనిస్తే ఆత్మ సాక్షాత్కారానికి దారి తీయదు. రియలైజేషన్ అంటే ఐజేషన్ ఆఫ్ రియల్ అనగా సత్యత్వాన్ని శోధించటం, యింకా ముందుకు

వెళ్తే సాధించటం జరుగుతుంది. ఆత్మ సాక్షాత్కారం ద్వారా ఆత్మ అనే దానిని గ్రహిస్తాము. తర్వాత దాని ద్వారా సత్యపదం వైపుకు ప్రయాణించి భగవత్ సాక్షాత్కారాన్ని పొందుతాము. అంతే కాని శరీరాన్ని మోసుకుపోలేము. మన శాశ్వతమైన సంబంధం సత్యత్వం అనగా బాబూజీతోనే గాని శరీరంతో కాదు. రియాలిటీ కొరకు తపించాలే కాని భౌతిక రూపం కొరకు కాదు. ఉదాహరణగా – ఒక స్త్రీ (సతి) తన భర్తను శారీరకంగా అమితంగా ప్రేమిస్తుంది. అతను చనిపోయినపుడు అతని చితిలో తన దేహాన్ని వదలి చాలిస్తుంది. దీనినే "సతి" అనగా సహగమనం అంటారు. మరి భౌతికంగా ప్రేమించేవారు కూడా అలా సహగమనం చేయగలరా? అలా ఎందుకంటే – ఆ సతీపతుల అనుబంధం (ఎటాచ్‌మెంట్) గత జన్మలది కూడా రావచ్చు. అందుచేత ఆ ఆత్మలు కలిసి సహగమించవచ్చు. అంటే ఒకే ప్రాణం – రెండు శరీరాలు.

పురుషుని పుణ్యంలో భార్యకు సగభాగం దక్కుతుంది అంటారు. అందుకే అర్ధాంగి అంటాము. ఉదాహరణకు – అత్రి మహాముని భార్య అనసూయ. ఆమె తన భర్త తపస్సు చేసుకోవటానికి అనుకూలంగా సకల సపర్యలు చేపట్టి, ఆశ్రమ నిర్వహణ చేసేది. ఆమె మనసు ఆయన యందే లగ్నమై వుండేది. గృహకృత్యాలు నెరవేర్చినా అనుబంధం ఆయనతోటే. కనుక ఆయన తపఃఫలములో ఆమెకు అర్ధభాగం లభించింది. ఆ విధంగా మనం కూడా మన హృదయాన్ని ఆ దైవానికే అనుసంధానం చేస్తే ఉన్నత స్థితులు కల్గుతాయి.

ఒక అభ్యాసి సోదరి నాతో ఇలా చెప్పింది. "ఓసారి మీరట్ ఆశ్రమంలో మేము ధ్యానంలో కూర్చున్నాము. నా ప్రక్కనే నా కుమారుడు కూడా కూర్చున్నాడు. ఇంతలో ఒక కోతి వచ్చి అతని ప్రక్కనే కూర్చుంది.

ధ్యానం నిలిపి వేసిన తరవాత అందరూ ఒక్కసారిగా లేచేసరికి ఆ కోతి కంగారు పడి మా కుమారుని చేతిని కరిచింది. అతను తన ప్రక్కనే వున్న ఆ కోతిని తన మాస్టరుగా భావించాడు కూడా. మరి అలా ఎందుకు జరిగింది" అని అడిగింది. నేను సమాధానం చెప్పాను. దీనిలో ఆలోచించవలసింది ఒక్కటి ఏమిటంటే మీ కుమారుడు దైవంతో సంబంధం కల్పించుకోవటానికి బదులు ఆ కోతితో (అనగా దాని రూపంతో) సంబంధం కల్గించుకున్నాడు. అది దాని జాతి సహజమైన లక్షణంతో అలా చేసింది. కనుక మనం దైవం మీద దృష్టి నిలపాలి కాని రూపం మీద కాదు అని చెప్పాను.

మనం భక్త మీరాను గురించి తెలుసుకుంటే - ఆమెకు విషమిచ్చినా త్రాగింది. పాము కాటుకూ భయపడలేదు. అంటే ఆమె హృదయమంతా కృష్ణ భగవానుడే నిండి వున్నాడు. తానున్న పరిసరాలు, పదార్థాలు అన్నీ అతడే. మరో ధ్యాస లేదు. సర్వమూ ఆయన ప్రేమతో ప్రసాదించినవే అని స్వీకరించింది. ఆ దుష్ట తలంపుల నుంచి తాను నమ్మిన దైవమే ఆమెను కాపాడటం జరిగింది. ఆమెలాగ అంతరంగంలోని అంతర్యామిని సాక్షాత్కరించుకోవటానికే మనం వేదన చెందాలి. బాహ్య రూపాన్ని దర్శించటానికి కాదు. అందుకే బాబూజీ చెప్పేవారు - మీరు గుడికి వెళ్ళినపుడు ఆ విగ్రహాలలో నన్ను బంధించకండి - అని.

ప్ర : సహజమార్గంలో సాధన చేసే అభ్యాసికి మరణ సమయం సమీపించినపుడు బాబూజీతో అతని సంబంధమెలా వుంటుంది?

జ : అభ్యాసీకి బాబూజీతో సంబంధముంది కాని అది శరీరంతో అనగా రూపముతో కాదు, వారి దివ్యత్వంతో వుంది. ఆ సంబంధం నశింపులేని ఆత్మది. కనుక ఆత్మ పరమాత్మల సంబంధం కొనసాగుతూనే వుంటుంది. మరణం శరీరానికే కనుక ఆత్మ గతికి అది ఆటంకం కాదు. మనలోని

ఆత్మ మన దేహాన్ని పని చేయిస్తుంది. ఎప్పుడైతే మన ఆత్మ బాబూజీతో అనుసంధానం చేయబడుతుందో దానికి వారి నుండి శక్తి ప్రసారమవుతుంది. ఆ శక్తితో ప్రయాణించి 'వారి' దివ్యత్వంలో విలీనమైపోతుంది. 'వారి' చేతిలో మనం కీలుబొమ్మగా అయిపోవాలి. 'వారి'కి అమ్ముడు పోయినట్లయి పోవాలి. అపుడింక వారెలా ఆడిస్తే అలాగు, వారెలా, ఎక్కడికి తీసుకువెళ్తే అక్కడికి ప్రయాణిస్తాము. అనగా 'వారి' ఇచ్ఛాశక్తికే మన మర్పితమయిపోతాం.

శ్రీరాముడు పట్టాభిషేకం అయిన తర్వాత హనుమంతుని మెడలో ఒక ముత్యాలహారం వేసి సత్కరించాడు. దానిని హనుమంతుడు మెడలో నుంచి తీసి ఒక్కొక్క ముత్యాన్ని పెరికి పారవేస్తున్నాడు. దానిని శ్రీరాముడు జాతి లక్షణంగా భావించాడు. సీతాదేవికి కూడా ఆ పని నచ్చలేదు. ఆమె హనుమంతుని ఎందుకలా చేస్తున్నావని ప్రశ్నించింది. అపుడు హనుమంతుడు, వీటిలో రాముని వెదుకుతున్నాను. రాముడు లేని ఈ వస్తువులు నాకనవసరం అని జవాబిచ్చాడు.

దీనిని బట్టి మనం గ్రహించాల్సిందేమిటంటే – మానవ నిర్మితమైన వాటిలో పదార్థముంటుంది కాని పరమాత్మ (తత్వం) లేదా దివ్యత్వముండదు. దైవం సృష్టించిన వాటిలో దివ్యత్వం సమకూర్చబడుతుంది. మానవులమైన మనం ఆ ఈశ్వరునిచే సృష్టించబడ్డాం కనుక మనలో ఆ ఈశ్వరత్వం వుంది. దానియందే మనం లగ్నం కావాలి.

పాదాభివందనమనేది భౌతికంగా ఆచరిస్తున్న క్రియ. హృదయాంతరాళంలో భక్తితో, ప్రేమతో, వినయపూర్వకంగా ఆ దివ్యత్వం ముందు సాగిలపడటమే అసలైన పాదాభివందనమని బాబూజీ బోధిస్తూ వుండేవారు. చరణ స్పర్శ కాకుండా భక్తితో, ప్రేమతో వారి హృదాయాన్ని స్పర్శించగల్గాలి.

బాబూజీ నన్ను నెగేషన్ స్థితికి తీసుకు వెళ్ళేటప్పుడు బ్రహ్మ రంధ్రం గుండా ప్రయాణింపజేయాల్సి వచ్చింది. అది ప్రాణాంతకమైన ప్రయాణం. అందుచేత బాబూజీ నన్ను తమ సంకల్పం ద్వారా దాని ద్వారం దాటించారు. బ్రహ్మరంధ్రం అనేది ఆత్మ శరీరంలోకి ప్రవేశించి నిష్క్రమించే మార్గం. ఇటువంటి స్థితిలోనే బ్రహ్మరంధ్రం దాటే చర్యలోనే స్వామి వివేకానంద మరణించటం జరిగింది. బాబూజీ నన్ను అలా దాటించిన తర్వాత నా క్షేమం గురించి తెలుసుకున్నారు. ఆ విధంగా వారు అభ్యాసుల రక్షణ విషయంలో చాలా జాగ్రత్త తీసుకునేవారు. అభ్యాసులు నన్ను విడిచి పెట్టవచ్చునేమో కాని నేను అభ్యాసులను వదలను – అని బాబూజీ చెపుతూ వుండేవారు. ఒకసారి మనం వారి పాదపద్మాలకు సమర్పితమయ్యాక వారే మన బాధ్యత వహిస్తారు. "అభ్యాసుల హృదయమే నా ఇల్లు. వారి ఇల్లే నా ఆశ్రమం" అని బోధపర్చేవారు బాబూజీ. అందుచేత మనం ఏ ఆలోచన చేస్తున్నా, ఏమి మాట్లాడుతున్నా, ఏమి చేస్తున్నా కూడా బాబూజీ స్మరణతోనే, బాబూజీ పరంగానే చేస్తే మన బాధ్యత నెరవేర్చినట్లవుతుంది. ఆ విధంగా మన జీవన సరళిని క్రమబద్ధం చేసుకోవాలి.

భగీరథుడు తపస్సు చేసి గంగావతరణకు కారకుడయ్యాడు. సామాన్యంగా ఆలోచించే వారికి అది తన స్వంత అవసరమేర్పడి అలా సాధించాడు – అని తోచినప్పటికీ, సమస్త జీవరాశికీ సజలధారను సమర్పించటానికే ఆ మహాముని గంగను అవతరింపజేశాడు అని గ్రహించాలి.

ఆశ్రమంలో బాబూజీ తమ దివ్యశక్తిని (ఛార్జింగ్) పూరిస్తారు. ఆ విధంగా శక్తి సమన్వితం చేయకపోతే అది మామూలు భవంతిగానే వుండిపోతుంది. దాని నిర్వహణ బాధ్యతను వారు తమ అదుపులో వుంచుకుంటారు. సమయోచితంగా ఛార్జి చేస్తుంటారు.

బాబూజీ మన హృదయంలో ప్రవేశించటానికి ఎల్లవేళలా సర్వసన్నద్ధంగా వుంటారు. మనం ఆహ్వానించటమే ఆలస్యం. అందుకే బాబూజీ చెప్పేవారు. నీవు పిలిచినంతనే రావటానికి నేను వేచియుంటాను. కాని నీవు నన్ను స్వీకరించటానికి సిద్ధంగా వుండవు – అని వ్యాఖ్యానించేవారు. అందుచేత ఒక దివ్యమూర్తిని మన హృదయంలోనికి ఆహ్వానించేటపుడు మనం సావధానంగా వుండాలి. అప్పుడే ప్రయోజనం చేకూరుతుంది.

అభ్యాసీ సోదరీ సోదరులందరూ బాబూజీ యొక్క కృపను, దివ్య ప్రాణాహుతిని పూర్తిగా పొందారు. ఆ దివ్యానందం అనుభవించటానికి ఆత్మ నృత్యం చేయాలని కూడా కోరుకుంటోంది. అదంతా వారి మహిమ. తమ బిడ్డలైన అభ్యాసులను వారు ఏమి ఆశీర్వదించనున్నారో నాకు తెలియదు కాని వారి పాదపద్మాలను ఆశ్రయించిన వారు యిక్కడున్నా, ఎక్కడున్నా వారికందరికీ తమ ప్రేమను పంచుతున్నారు. వారి దివ్యాశీస్సులు మీరు పొందుతూ వుంటే నాకు ఆనందంగా వుంది.

బాబూజీ మహారాజ్! నాకు చాలా దగ్గరలోనే వున్నారు! నేను 'వారి' ఎదుటనే వున్నాను, అని వారి స్మరణలో ఎల్లవేళలా అభ్యాసీలు వారి ప్రజెన్స్‌ను (సన్నిధి)ని అనుభూతి చెందాలి. దీని ఫలితముగా అభ్యాసీలో నిరంతర–స్మరణ, మరియు బాబూజీతో నిరంతరం–కనెక్షన్ అనేది ఏర్పడుతుంది.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నాకు మీతో రిలేషన్ (బాంధవ్యం) చాలా దగ్గరిగా ఏర్పడినట్లుగా వుంది. మీరు నాకు చాలా సమీపంలో వున్నట్లుగా అనిపిస్తుంది" అని వ్రాసినాడు. అపుడు వారు "భాయీ! నీవు వ్రాసింది చాలా మంచి విషయమే. కాని రిలేషన్ (సంబంధం) అనే పదం మన ఇద్దరి మధ్యన వుండకూడదని నేను కోరుకొనుచున్నాను" అని వ్రాసినారు. రిలేషన్ (సంబంధం) అనే పదం వచ్చినప్పుడు సెపరేషన్

(విడిపోవడము) అనేది కూడా అక్కడ వున్నట్లే. అందువలన కలిసిన (కనెక్షన్) అనేది సరి అయిన పదం. ఆలోచనలతోను, హృదయంతోను, నిరంతర స్మరణతోను మీరు బాబూజీతో కనెక్షన్‌ను ఏర్పరచుకోవాలి. రిలేషన్ (సంబంధం, బాంధవ్యం) అంటే బాబూజీ మరియు అభ్యాసీ మధ్యన దూరం వుందని, అభ్యాసీ బాబూజీలో లయం కాలేదని అర్థం.

ప్రశ్న : ఆధ్యాత్మికతలో అభివృద్ధి చెందడానికి చాలా అవసరమయినది ఏమిటి?

జవాబు : భౌతిక-పదార్థమును అభివృద్ధి చేయగలము. కాని ఆధ్యాత్మికతను అభివృద్ధి చేయలేము. 'బాబూజీ! నా వాడు' అనే భావం ప్రేమతో నిండిన నిరంతర-స్మరణ అనేది చాలా ముఖ్యమయిన విషయము. దీనిని ఏర్పరచుకోవడము చాలా సులభము. ఎప్పుడయినా సరే బాబూజీ మహారాజ్ స్మరణ గుర్తుకురాగానే, వారి స్మరణలోనే మునిగిపోవాలి. అప్పుడు పురోగతి వేగంగా వుంటుంది.

నేను ఎవరు? ఏమిటి? అనేది నాకు తెలియదు. కాని నేను ఎవరు? అనేది అభ్యాసీలకు తెలుస్తుంది, అని బాబూజీ చాలాసార్లు అనేవారు. మీరు బాబూజీతో కనెక్షన్ (లింక్) ను ఏర్పరచుకుంటే, నెమ్మది నెమ్మదిగా మీకు బాబూజీ మహారాజ్ (డివైన్-పర్సనాలిటీ) గురించి తెలుస్తుంది. బాబూజీకి వారి గురించి వారికి ఏమీ తెలియదు. అందువల్లనే ఒకసారి లాలాజీ సాహెబ్ 'నీవు వేల కొలది ఆధ్యాత్మిక ప్రతినిధులను తయారు చేయగలవు. కాని నీ సబ్‌స్టిట్యూట్ (అనగా 2వ బాబూజీని) నీవు తయారుచేయలేవు. ఎందుకంటే నీవు ఎవరు? నీ శక్తి ఏమిటి? అనేది నీకు తెలియదు. నీవు ఎల్లవేళలా నా స్మరణలోనే మునిగిపోయి పూర్తిగా మరచిన-స్థితిలోనే వున్నావు' అని బాబూజీతో అన్నారు.

సమాధి : నిన్ను నీవు మరచిపోయిన స్థితి.

సహజ సమాధి : నీవు అన్ని పనులు చేస్తూనే, సహజముగానే సమాధి-స్థితిలో మునిగిపోయి నివసిస్తావు. కాని నీవు సమాధి-స్థితిలో వున్నట్లుగా నీకు తెలియదు. శరీరానికి ఏదయినా దెబ్బ తగిలినపుడు లేదా గాయం అయినప్పుడు, అప్పుడు ఒక్కసారిగా నీకు దాని స్పర్శ తెలుస్తుంది. శరీరం యొక్క ఎఱుక కలుగుతుంది. ఇది సహజ-సమాధి స్థితి.

జడ సమాధి : ఇది సహజ-సమాధి స్థితి కంటే కూడా చాలా వున్నతమయినది. ఈ స్థితిలో శరీరానికి దెబ్బ తగిలినా కూడా దాని యొక్క స్పర్శ తెలియదు. "బాబూజీ! నేను దేనిని ముట్టుకున్నా కాని, నన్ను నేను తాకినా కాని, నాకు దాని స్పర్శ కాని అనుభూతి కాని తెలియడము లేదు" అని వారికి వ్రాసినాను. అప్పుడు వారు "బిటియా! నాకు చాలా ఆనందంగా వుంది. ఇది మన లాలాజీ సాహెబ్ యొక్క కృప. ఇదే జడ సమాధి యొక్క స్థితి. ఇంతవరకు ఎవరు కూడా ఈ జడ-సమాధి యొక్క స్థితిని అనుభూతి చెందలేదు" అని వ్రాసినారు. ఈ జడ-సమాధి స్థితిని దాటిన తరువాత భగవత్ సాక్షాత్కారం ఆ డివైన్-పర్సనాలిటీ (దివ్య పురుషుడు) బాబూజీ మహారాజ్ యొక్క సాక్షాత్కారం అనేది మొదలవుతుంది. అందువల్లనే నేను ఒక పాటలో, "బాబూజీ! ఎప్పుడయితే మీ డివైన్-బ్యూటీ (దైవీయ సౌందర్యం) నా ఎదుట ప్రత్యక్షమయినదో అప్పుడు, ఈ జడ-సమాధి స్థితిలో స్పందనలు ఏర్పడుట వలన, ఆ డివైన్ పర్సనాలిటీ యొక్క డివైన్ బ్యూటీ నా ఎదుటనే వున్నట్లుగా నేను అనుభూతి చెందినాను" అని వ్రాసినాను.

**ప్రశ్న: జనన-మరణ చక్రం నిరంతరం కొనసాగుతూనే వుంటుంది కదా! ముక్తిని పొందడం ఎలా?**

**జవాబు :** మానవులనందరిని భగవంతుని వద్దకు తీసుకొని పోవడానికి ఎవరయినా డివైన్-పర్సనాలిటీ (బాబూజీ మహారాజ్) భూమి మీద

అవతరించినపుడు మానవులకు ముక్తి లభిస్తుంది. పునర్జన్మ అనేది లేకపోవడమే ఆధ్యాత్మికతలోని మొట్టమొదటి స్థితి. బాబూజీ మహారాజ్ చరణాలను చేరుకున్న వారు అందరికి ఈ మొదటి బహుమతి (పునర్జన్మ రాహిత్యం) లభిస్తుంది. మనం శాంతి, ప్రశాంతత కొరకు ఈ సహజమార్గ్‌లో చేరలేదు. శాశ్వతమయిన శాంతి కొరకు, శాశ్వతమయిన పరమానందం కొరకు, మరియు డివైన్ పర్సనాలిటీ, బాబూజీ మహారాజ్ యొక్క డివైన్ బ్యూటీ (దైవీయ సౌందర్యం) ను దర్శించడం కొరకే మనం ఈ సహజమార్గ మెడిటేషన్ (ధ్యానం) చేస్తున్నాము.

**ప్రశ్న : చాలామంది ప్రిసెప్టర్లకు అభ్యాసీ యొక్క ప్రోగ్రెస్ (పురోగతి) గురించి తెలియడము లేదు.**

**జవాబు :** నీవు ఏ విధంగా అయితే ప్రోగ్రెస్ కావాలని తపనతో వుంటావో, అదే తపనతో, ప్రిసెప్టర్ అభ్యాసీలను ప్రేమించాలి – అని బాబూజీ అనేవారు. అప్పుడు ఆ ప్రిసెప్టర్‌కు అభ్యాసీ యొక్క పురోగతి గురించి తెలుస్తుంది. బాబూజీ మహారాజ్ నన్ను ప్రిసెప్టర్‌ను చేసిన కొన్ని సంవత్సరముల తరువాత ఎవరయినా అభ్యాసీ గుర్తుకురాగానే, లేదా కనబడినపుడు వెంటనే ఎక్స్‌రే-ఫిల్మ్ (ఫోటో) వలె ఆ అభ్యాసీ యొక్క ఆధ్యాత్మిక-స్థితి నా ఎదుట ప్రత్యక్షమయ్యేది. ఎవరయినా అభ్యాసీ నా వద్దకు వచ్చినపుడు, చూడగానే, అతనికి సిట్టింగ్ (పూజ)ను ఇవ్వాలి అని అనిపిస్తుంది. ఎందుకంటే అతనిలో క్రేవింగ్ (తపన) వుంది. అతని హృదయం పవిత్రతతో నిండి వుంది. కాని కొంతమంది అభ్యాసీలను చూడగానే, వాళ్ళ నుండి పారిపోవాలని అనిపిస్తుంది. ఎందుకంటే వాళ్ళలో క్రేవింగ్ లేదు కాబట్టి. అలాగని ప్రిసెప్టర్ వాళ్ళను విడిచిపెట్టకూడదు, 'బాబూజీ! ఈ అభ్యాసిని మీ చరణాలకు అర్పించుచున్నాను. ఇతనికి మీ దివ్య-కృపను ప్రసాదించండి' అని నేను

అటువంటి అభ్యాసీ నా వద్దకు వచ్చినప్పుడు 'వారి'ని ప్రార్థిస్తాను. 'నేను ఏ ఒక్క అభ్యాసీని కూడా విడిచిపెట్టలేను. కాని అభ్యాసీలు మాత్రము నన్ను విడిచిపెట్టవచ్చు' అని బాబూజీ అనేవారు.

ప్రశ్న : క్రేవింగ్ (తపన) అనేది ఎలా అభివృద్ధి చేసుకోవాలి?

జవాబు: ఆధ్యాత్మికతలో ఏదీ కూడా అభివృద్ధి చేయలేము. ఆధ్యాత్మికతలో ప్రతిదీ కూడా సహజంగానే, దానంతట అదే వస్తుంది. 'బాబూజీ! నా వాడు' అనే దానిని మీరు అనుభూతి చెందినపుడు, బాబూజీ ఎల్లప్పుడు కూడా మీ అటెన్షన్ (దృష్టి)లోనే వుంటారు. బాబూజీ మీ దృష్టిలోనే వున్నారు. మీలోనే వున్నట్లుగా అనిపిస్తుంది. కాని ఇంకా మీరు వారిని పొందలేదు. ఇక ఇప్పుడు మీలో క్రేవింగ్ (తపన) అనేది మొదలవుతుంది. అనగా సెపరేషన్ (ఎడబాటు) యొక్క అనుభూతి కలిగినపుడు క్రేవింగ్ (తపన) ఏర్పడుతుంది, కొన్నిసార్లు బాబూజీ మీకు చాలా దగ్గరగా వున్నట్లుగా అనిపిస్తుంది. మరి కొన్నిసార్లు బాబూజీ అలా దగ్గరగా వున్నట్లుగా అనిపించదు. దూరంగా వున్నట్లుగా అనిపిస్తుంది. అప్పుడు వారిని చేరుకోవాలనే తపన (క్రేవింగ్) మరల కలుగుతుంది. తల్లి తన పసిపిల్లవానికి నడక నేర్పించడానికి అతని ఎదుట ఒక ఆట వస్తువును వుంచుతుంది. పిల్లవాడు దగ్గరకు రాగానే ఆ ఆటవస్తువును ఇంకా కొద్దిగా దూరంలో పెట్టుతుంది. అప్పుడు ఆ ఆటవస్తువును ఎలాగయినా పట్టుకోవాలనే తపన ఆ పసిపిల్లవానిలో కలుగుతుంది. అదే విధంగా ఆధ్యాత్మిక జనని అయిన బాబూజీ, అభ్యాసీలలో తపన(క్రేవింగ్)ను పెంపొందిస్తారు. పసిపిల్లవాడు తన తల్లిని తప్ప ఎవరిని కూడా గుర్తించలేడు. పసిపిల్లవాడు తన తల్లిని ఎలా ప్రేమిస్తాడో, ఆమెపై ఎలా ఆధారపడి వుంటాడో, అదే విధంగా అభ్యాసీలు కూడా బాబూజీ మీద ప్రేమతో నిండిన డిపెండెన్సీ (ఆధారపడి) వుండాలి.

ఒకసారి ఒక అభ్యాసీ, 'బాబూజీ! మరణించిన తరువాత ఏం జరుగుతుంది' అని అడిగాడు. అప్పుడు బాబూజీ నవ్వుతూ, "భాయీ! మరణించిన తరువాత నీకు అక్కడ డబ్బు లభించదు. ఉద్యోగం దొరకదు. మరణించిన తరువాత ఏం జరుగుతుంది అని నీవు ఎందుకు తెలుసుకోవాలని అనుకుంటున్నావు? ఇవి అన్నీ విడిచిపెట్టు. నీ డ్యూటీ (కర్తవ్యాన్ని) నీవు నిర్వహించు. మరణం తరువాత ఏం జరుగుతుంది? ఏమిటి? అనే దానిని గురించి ఆలోచించకు" అని ప్రేమతో అన్నారు.

ప్రశ్న : ప్రోగ్రెస్ (పురోగతి) చెందుతున్నామని గుర్తించడము ఎలా?

జవాబు : మీ ఆలోచనలలోని మార్పు వలన, బాబూజీ మహారాజ్ యొక్క నియర్‌నెస్ (సామీప్యత)ను అనుభూతి చెందుట వలన ప్రోగ్రెస్ అవుతున్నట్లుగా అభ్యాసీ గుర్తించగలడు. మీ ప్రవర్తనలో, మీ సంభాషణలో మార్పు కలిగిందీ, లేనిదీ మీ కుటుంబ సభ్యులు మరియు ఇతరులు గుర్తిస్తారు.

బాబూజీ మహారాజ్ యొక్క దివ్య ప్రేమను అనుభూతి చెందినప్పుడు నాకు కఠినమయిన ప్రాపంచిక సమస్యలు కూడా తేలికగా కనబడుతున్నాయి, అని ఒక డెన్మార్క్ సోదరి అన్నారు. నిజమే! 'బాబూజీ! నా వాడు' అని మీరు వారి స్మరణలో, ప్రేమతో మునిగిపోయినపుడు, వారు మీకు తన దివ్యశక్తిని ప్రసాదిస్తారు. అప్పుడు ఆ సమస్యల బాధ యొక్క తీవ్రత అనేది తగ్గిపోతుంది. బాబూజీతో మీకు నిజమైన కనెక్షన్ అనేది ఏర్పడినపుడే ఈ విధంగా జరుగుతుంది. బాబూజీ దీనిని గురించి ఒక చక్కని ఉదాహరణ చెప్పినారు. ఒక అభ్యాసీ సోదరి "బాబూజీ మిమ్మల్ని గాఢంగా ప్రేమిస్తున్నాను. మీతో నాకు నిజమయిన కనెక్షన్ వుంది" అని చెబుతూ, "నేను మంచినీళ్ళు త్రాగినప్పుడు, బాబూజీయే మంచినీళ్ళు త్రాగుచున్నారని అనుకొంటాను. స్వీట్ తింటున్నప్పుడు ఆహారం తింటున్నప్పుడు బాబూజీయే తినుచున్నారని

భావిస్తా!" అని అన్నది. అప్పుడు బాబూజీ ఆ సోదరితో, "నీవు స్వీటు తిన్నావు, భోజనం చేసినావు, ప్రతీసారి బాబూజీయే తినుచున్నాడు - అని నీవు అంటున్నావు. కాని దాని రుచి నాకు తెలియడం లేదు. నిజంగానే నేను తిన్నట్లయితే దాని రుచి నాకు తెలియాలి కదా!" అని అన్నారు. అందువల్ల బాబూజీతో మీకు నిజమయిన కనెక్షన్ అనేది వుంటేనే మీ సమస్యలు వారిని స్పర్శిస్తాయి. అపుడు వారి సహాయం మీకు లభిస్తుంది. సమస్య యొక్క తీవ్రత తగ్గిపోతుంది.

**ప్రశ్న : భగవంతుడు దయామయుడు కదా! ప్రపంచంలో ఈ కష్టాలు, దుః ఖాలు ఎందుకు వున్నాయి?**

**జవాబు :** సృష్టిలోని నిర్మాణము, వినాశనము అనే ఈ క్రియలన్నీ కూడా ప్రకృతి ద్వారా జరుగుతున్నాయి. మానవుడు భగవంతునితో, భగవంతునిలో జీవించడానికి బదులుగా ఈ ప్రకృతి మీద ఆధారపడి జీవించుచున్నాడు. భగవంతుడు కరుణామయుడు. ఎందుకంటే భగవంతుడు మానవులందరి హృదయాలలో వున్నాడు.

మానవుడు రకరకాల దేవుళ్ళు, దేవతల యొక్క విగ్రహాలను తయారు చేస్తూ రియాలిటీని అనగా నిజమయిన భగవంతుని మరచిపోయినాడు.

ధ్యానంలో చాలా ఆలోచనలు వస్తున్నాయి. ఏ ఫీలింగ్ (అనుభూతి) కలుగుట లేదు - అని అంటారు. ధ్యానంలో కూర్చున్నప్పుడు అభ్యాసీ యొక్క అటెన్షన్ (ఆంతరిక-దృష్టి) డివైన్ (దైవం)తో కలవనప్పుడు, ఫీలింగ్ అనేది మీ అనుభవంలోనికి రాదు. ధ్యానంలో భగవంతుడు (డివైన్) నా హృదయంలోనే వున్నాడు' అని ఒక్కసారి మనస్సులో అనుకోమని బాబూజీ చెప్పినారు. ఇప్పుడు 'బాబూజీ నా హృదయంలోనే వున్నారు' అనే థాట్ (ఆలోచన) గాఢం అయిన కొలది, ఇప్పుడు ఈ ఆలోచనయే ఫీలింగ్

(అనుభూతి)గా మారుతుంది. అభ్యాసీలు ధ్యానంలో వచ్చే ఆలోచనల మీద ఎక్కువగా దృష్టి వుంచుతారు. కాని ధ్యానంలో కలిగే ఫీలింగ్ (అనుభూతి) మీద దృష్టిని వుంచరు! ధ్యాన సమయంలో ఆలోచనలు వచ్చినప్పటికిని ధ్యానం తరువాత అయినా సరే, మీరు జాగ్రత్తగా గమనిస్తే మీకు హృదయంలో ఒక విధమయిన శాంతి, ప్రశాంతతలు పొందినట్లనిపిస్తుంది. మీరు ధ్యానంలో కూర్చుంటారు, కాని మీ అటెన్షన్ (ఆంతరిక-దృష్టి) అనేది డివైన్‌తో కనెక్ట్ (లింక్) కావడము లేదు. 'భగవంతుడు (డివైన్) నా హృదయంలోనే వున్నాడు' అనే ఒక్క విషయాన్ని మాత్రమే బాబూజీ గుర్తు పెట్టుకోమని అన్నారు. ఈ ఒక్క విషయం మీదనే మీరు మీ అటెన్షన్ (దృష్టి)ని వుంచాలి. సూర్యుడు ప్రకాశించినప్పుడు అక్కడ చీకటి వుండదు. అదే విధంగా బాబూజీ మీకు ట్రాన్స్‌మిషన్ (దివ్య-ప్రాణాహుతి)ని ఇచ్చినప్పుడు మీకు ఆ ఫీలింగ్ (అనుభూతి) కలిగినా, కలుగకపోయినా, ఆ దైవ-ప్రసాదం మీ హృదయంలోనే వుంటుంది. కానీ, 'బాబూజీ! నా హృదయంలోనే వున్నారు' అనే దాన్ని మీరు ఎప్పుడూ తప్పక గుర్తు పెట్టుకోవాలి.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! మెడిటేషన్ (ధ్యానం) చేయాలంటే చాలా కష్టంగా వుంది" అని అనగానే, వారు 'భాయీ! నీవు చెప్పేది తప్పు. మెడిటేషన్ (ధ్యానం)లో ఎటువంటి కష్టం లేకపోవడమే, ధ్యానంలోని అసలు కష్టము" అని అన్నారు. చిన్నపిల్లలు చదువుతున్నప్పుడు వాటి మీద ధ్యాసపెట్టి చదవమని చెప్తుతాం. ఒక విద్యార్థి ఎదుట అతడు చదువవలసిన సబ్జెక్ట్స్, పుస్తకాలు చాలా వుంటాయి. కాని ఇక్కడ అభ్యాసికి, బాబూజీ ఒక్కటే వాక్యము ఇచ్చినారు. 'భగవంతుడు నా హృదయంలోనే వున్నాడు' అనే ఒక్కదానినే స్మరణలో వుంచుకోమన్నారు.

నీ అటెన్షన్‌ను (ఆంతరిక-దృష్టిని) నా మీద నిలిపితే, దివ్య-ప్రేమ అనేది నీకు దానంతట అదే లభిస్తుంది అని బాబూజీ అనేవారు. ఎందుకంటే

బాబూజీయే ఆ దివ్య-ప్రేమయై వున్నారు కదా! "వారి" వద్ద ఆ దివ్య-ప్రేమ తప్ప ఇంకొకటి లేదు. ఒకసారి మేమందరము షాజహాన్‌పూర్‌లో బాబూజీ ఇంటి వరండాలో 'వారి' ఎదురుగా కూర్చొని వున్నాము. అప్పుడు ఒక అభ్యాసీ "బాబూజీ! నేను మిమ్మల్నే చూస్తున్నాను. మీ ముఖం వైపే చూస్తున్నాను. కాని మీరు కనీసం ఒక్కసారి కూడా నా వైపు చూడ్డం లేదు" అని అన్నాడు. అప్పుడు బాబూజీ నవ్వుతూ, 'భాయీ! ఇది చాలా మంచిది. నీవు ఆలోచించేది సరి అయినదే. ఎందుకంటే నీ మనస్సులో నేను నిన్ను చూడలేదనే ఆలోచన వల్ల నీ అటెన్షన్ (దృష్టి) అంతా కూడా నా మీదనే వుంది' అని అన్నారు.

ఒకసారి ఒక అభ్యాసీ 'బాబూజీ! అలహాబాద్‌లో మీరు మా ఇంటికి వచ్చినప్పుడు నేను ఎంతో శ్రద్ధతో మీకు అన్ని సేవలు చేసినాను. ఇప్పుడు నేను మీ ఎదుటనే కూర్చొని యున్నాను. మీరు నా వైపు కూడా చూడడం లేదు. మీరు నన్ను మరచిపోయినట్లుగా వున్నారు" అని అన్నాడు. అప్పుడు వారు "భాయీ! నేను చాలా సంతోషంగా వున్నాను. ఎందుకనంటే నీ మనస్సులో నేను నిన్ను మరచిపోయినాను అనే ఆలోచన కలిగింది. అనగా మరచిపోవుట అంటే ఏమిటి అనేది ఇప్పుడు నీకు అర్థమయ్యింది. ఇప్పుడు నిన్ను నీవు మరచిపోవుటలో నీవు తప్పకుండా విజయాన్ని పొందుతావు" అని అన్నారు.

ఒక అభ్యాసీ, "బాబూజీ! మేము ఎన్నో పనులను చేస్తూ వుంటాము. ఈ సంస్కారాలు అనేవి ఎక్కడ వుంటాయి?" అని అడిగాడు. అప్పుడు వారు, "ప్రతి మనిషిలో ప్రింటర్ అనేది ఒకటి వుంది. అది ఒక ప్రింటర్ (ముద్రణాలయం) వలెనే పని చేస్తుంది. ఏదయినా విషయాన్ని గురించి దీర్ఘంగా ఆలోచిస్తే, అది సబ్-కాన్షస్-మైండ్ మీద ముద్రించబడుతుంది"

అని అన్నారు. ఎప్పుడయితే మీరు బాబూజీని ప్రేమించడం ప్రారంభిస్తారో, అప్పుడు నెమ్మది-నెమ్మదిగా ఆ ప్రింటర్ (సబ్-కాన్షస్-మైండ్) మీద ముద్రించబడినవి అన్ని కూడా చెరిపివేయబడి అక్కడ బాబూజీ మహారాజ్ యొక్క దివ్య-ఆలోచన మాత్రమే ముద్రించబడుతుంది. అప్పుడు మీలో నిరంతర-స్మరణ మొదలవుతుంది.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! మాయ అంటే ఏమిటి? భగవంతుడు అంటే ఏమిటి?" అని అడిగాడు. అప్పుడు వారు నవ్వుతూ 'భాయీ! కండ్లు తెరచి చూస్తే కనపడేది మాయ, కండ్లు మూసుకుంటే (ధ్యానంలో) కనపడేది భగవంతుడు' అని అన్నారు. కండ్లు తెరచి ఈ బాహ్య-ప్రపంచాన్ని చూస్తే బంధనాలు ఏర్పడుతాయి. కండ్లు మూసుకొని (హృదయంలో) భగవంతుని చూస్తే బంధనాలు ఏర్పడవు.

బ్రైటర్-వరల్డ్ (తేజోమయ-లోకం) లో బ్లిస్ (పరమానంద స్థితి) వుంటుంది. ముక్తిని పొందిన ఆత్మలకు అనగా లిబరేటెడ్-సోల్స్‌కు పరమానందం (బ్లిస్) కావాలి. అందువల్ల అవి బ్రైటర్-వరల్డ్‌లో వుంటాయి. నేను ఆ బ్లిస్ (పరమానంద స్థితి)ని పొందినప్పుడు బాబూజీ నాకు ఒక ఉత్తరము వ్రాశారు. "బిటియా! ఈ బ్లిస్ (పరమానంద స్థితి) అనేది భరింపలేనటువంటిది. ఈ సమయంలో నీవైనా షాజహాన్‌పూర్‌కు వచ్చి నా వద్ద వుండాలి. లేదా నేనయినా లఖింపూర్‌కు వచ్చి నీ వద్ద వుండాలి. లాలాజీ సాహెబ్‌కు కృతజ్ఞతలు. వారే స్వయంగా నిన్ను కాపాడుతున్నారు. నీకు ఈ బ్లిస్ (పరమానంద స్థితి) భరింపలేనట్లుగా అనిపించితే, వెంటనే నీ గదిలోని లాలాజీసాహెబ్ కుర్చీ ఎదురుగా పూజలో కూర్చో" అని వ్రాశారు. ఈ బ్లిస్ (పరమానంద స్థితి) అనేది చాలా ఆకర్షణీయమైన స్థితి. అందువల్ల ఎవ్వరు కూడా ఈ స్థితిని విడిచిపెట్టి ముందుకు వెళ్లలేరు. కేవలం డివైన్-పర్సనాలిటీ

అయిన బాబూజీ మహారాజ్ యొక్క దివ్య-శక్తి వల్లనే అభ్యాసీ ఈ పరమానంద స్థితిని దాటి పురోగమించి, అల్టిమేట్ (అంతిమ సత్యం) చేరుకోగలడు.

**ప్రశ్న : సంస్కారముల నుండి బయటపడుట ఎలా?**

**జవాబు :** సంస్కారాల్ని మీరు తొలగించలేరు. సంస్కారాల వలన 'భోగ్' అనేది తప్పనిసరి. భోగ్ అంటే, ఆ సంస్కారముల యొక్క ఫలితాన్ని అనగా కష్టాలు, దుఃఖాలు అనుభవించడం. ప్రేమతో బాబూజీ స్మరణలో లీనమయినపుడు మీకు వీటిని ఎదుర్కొనే శక్తి లభిస్తుంది.

**ప్రశ్న : ధ్యానంలో చాలా ఆలోచనలు వచ్చి చికాకుగా వున్నప్పుడు కండ్లు తెరచి బాబూజీ చిత్రాన్ని చూడవచ్చునా?**

**జవాబు :** బాబూజీ చిత్రాన్ని చూడ్డం కాదు 'వారి' ప్రజెన్స్ (సన్నిధి)ని అనుభూతి చెందాలి. ప్రజెన్స్ అంటే బాబూజీ మహారాజ్ నా ఎదుటనే వున్నారు! అనే దృఢమయిన ఫీలింగ్‌ను (అనుభూతిని) కలిగి వుండడము. అభ్యాసీలు అందరు కూడా బాబూజీ మహారాజ్ ప్రజెన్స్‌ను అనుభూతి చెందాలి. మనం 'వారి' ఫోటో మీద ధ్యానం చేయడము లేదు.

**ప్రశ్న: ప్రిసెప్టర్ అభ్యాసీని, బాబూజీతో కనెక్ట్ చేయగలడా?**

**జవాబు :** ఎవ్వరు కూడా అభ్యాసీని బాబూజీతో కనెక్ట్ చేయలేరు. బాబూజీ "నేను నీ వాడిని" "నేను నీ వాడిని" "నేను నీ వాడినే!" అనే ఆలోచనతో, ఫీలింగ్‌తో అభ్యాసీ 'వారి'తో ఎటాచ్‌మెంట్ - అనురాగబంధాన్ని ఏర్పరచుకోవాలి. ఎప్పుడయితే "బాబూజీ! నీవు నా వానివి! నేను నీ వాడిని" అని మీ హృదయంలో అనురాగపు అనుభూతి కలుగుతుందో అప్పుడు కనెక్షన్ ఏర్పడటం మొదలవుతుంది. బాబూజీ మహారాజ్ యొక్క ప్రాణాహుతి వలన అభ్యాసీలలో ప్రేమ, భక్తి ఎక్కువ అవాలనే సంకల్పంతో ప్రిసెప్టర్ సిట్టింగ్ ఇస్తాడు.

బాబూజీ మహారాజ్ యొక్క దివ్య-ప్రేమ, వర్షం వలె వర్షిస్తున్నట్లుగా నేను ప్రతి క్షణం 24 గంటలు అనుభూతి చెందుతున్నాను. కాబట్టి మీరందరు కూడ 'వారి' ట్రాన్స్‌మిషన్‌లో, దివ్య-ప్రేమలో, వారి నిరంతర-స్మరణలో మునిగి పోవడానికి ప్రయత్నం చేయండి. ఇది అమూల్యమయిన సమయం. మీరందరు వారి దివ్య-ప్రేమలో మునిగిపోవాలి!

నేను మొదటిసారి షాజహాన్‌పూర్‌కు వెళ్ళి తిరిగి వచ్చేప్పుడు "వారి"ని విడిచిపెట్టి రాలేకపోయినాను. ఎందుకంటే వారి భౌతికరూపం ఎంతో ఆకర్షణీయంగా వుంది. మరల రెండవసారి, బాబూజీ ఇంటి నుండి తిరిగి వచ్చుచున్నప్పుడు, 'వారి'ని విడిచిపెట్టి వుండలేనని, వారి ఆ భౌతికమయిన సౌందర్యాన్ని చూడకుండా ఒక్క క్షణం కూడా జీవించలేను అని అనిపించినది. కాని మూడవసారి నేను షాజహాన్‌పూర్ నుండి తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు బాబూజీ నాతోనే వచ్చుచున్నట్లుగా వారు నా ఎదుటనే ఉన్నట్లుగా అనిపించింది. నా ఎదుటనే ఉన్న బాబూజీ కుర్చీలో కూర్చొని ఉన్న బాబూజీకంటే ఎంతో అందంగా, దైవీయ సౌందర్యంతో ఉన్నట్లుగా అనిపించింది. ఇప్పుడు భౌతిక శరీరంతో ఉన్న బాబూజీని విడిచి పెట్టాను. కాని దివ్య సౌందర్యంతో ఉన్న డివైన్ బాబూజీని విడిచిపెట్టి ఒక్క క్షణం కూడ జీవించలేను - అనిపించింది.

ప్రశ్న: అటెన్షన్ మరియు ఎటాచ్‌మెంట్‌కు గల తేడా ఏమిటి?

**జవాబు** : చాలా తేడా వుంది. నీవు ఒక అటెన్షన్‌తో చూస్తావు. అనగా అటెన్షన్ అనేది శరీరంతో సంబంధం కలిగి వుంటుంది. కానీ ఎటాచ్‌మెంట్ అనేది హృదయం నుండి వస్తుంది. బాబూజీ! నావాడు! అనే ఫీలింగ్ హృదయంలో కలుగుతుంది. ఇది ఎటాచ్‌మెంట్, బాబూజీ నీ వాడు! వారికి నీవు చాలా సమీపంలో వున్నావు! అనేది ఎటాచ్‌మెంట్. అటెన్షన్ ఒకసారి

వుంటుంది - ఇంకొకసారి ఉండకపోవచ్చును. కాని, బాబూజీ! నావాడు అనే ఎటాచ్‌మెంట్ ఏర్పడిన తరువాత అది ఎల్లప్పుడు వుంటుంది. ఒకసారి ఉండడము ఇంకొకసారి లేకపోవడము ఉండదు.

ప్రశ్న : విల్ పవర్ (ఇచ్ఛా-శక్తి) తో బాబూజీతో ఎటాచ్‌మెంట్ ఏర్పరచుకోవచ్చునా?

జవాబు : మానవులలో విల్-పవర్ (ఇచ్ఛా-శక్తి) అనేది చాలా బలహీనపడింది. ఇంకో విధంగా చెప్పాలంటే విల్ పవర్ లేకుండా పోయింది. అందువల్లనే డివైన్-పవర్ (దివ్య-శక్తి) మానవాళికి సహాయం చేయడానికి మానవాళి అంతటిని అల్టిమేట్ (అంతిమం) వద్దకు చేర్చడానికి, శ్రీ బాబూజీ మహారాజ్ రూపంలో భూమి మీద అవతరించింది. ఆ దివ్య శక్తినే మనం ప్రాణాహుతి ద్వారా పొందుచున్నాము.

అభ్యాసీలు ఆధ్యాత్మికంగా ఎదిగినపుడు, ఆ ఆధ్యాత్మికత యొక్క ప్రభావం అనేది అతని చుట్టూ వున్న వాతావరణంలో కూడా వ్యాపిస్తుంది. నేను ఏదయినా ఒక సెంటర్‌కు లేదా ఒక ప్రదేశానికి వెళ్ళాలని అనుకోగానే వెంటనే అక్కడికి ప్యూరిటీ (పవిత్రత) వ్యాపించుచున్నట్లుగా అనిపించుతోంది - అని బాబూజీకి వ్రాసినాను. కొన్ని సంవత్సరాల తరువాత, నేను ఎక్కడికి వెళ్ళినా, నా కంటే ముందుగానే అక్కడికి ఆ డివైన్ పవర్ (దివ్య-శక్తి) వ్యాపించుచున్నట్లుగా నాకు అనిపించుతున్నది - అని బాబూజీకి నేను ఉత్తరం వ్రాశాను. అందువల్ల అభ్యాసీ బాబూజీ మహారాజ్ స్మరణలో మునిగిపోయినపుడు ప్యూరిటీ (పవిత్రత) అనేది అతని చుట్టూ గల వాతావరణంలో వ్యాపిస్తుంది.

బాబూజీ మహారాజ్ ఈశ్వర సహాయ్‌జీతో కలిసి లఖింపూర్‌లో, మా ఇంటికి వచ్చినప్పుడు, నేను రాముని మీద ధ్యానం చేస్తున్నాను - అని

వారికి చెప్పినాను. మా ఇంటిలో రామునికి సంబంధించిన ఐదు ఫోటోలు ఉన్నాయి. అప్పుడు వారు ఒక ఫోటోను చూపిస్తూ, "బిటియా! నీవు ఈ ఫోటో మీద ధ్యానం చేస్తున్నావా" అని అడిగినారు. కాదు బాబూజీ! అని నేను అన్నాను. మరల ఇంకొక ఫోటోను చూపిస్తూ అడిగినారు. అదీ కాదు అని అన్నాను. మరల వారు మూడో ఫోటోను చూపిస్తూ అడిగారు. అప్పుడు నేను 'అవును బాబూజీ! నేను ఈ ఫోటోలో వున్న రాముని మీద ధ్యానం చేస్తున్నాను" అని చెప్పినాను. అప్పుడు వారు నవ్వుతూ, 'బిటియా! నీవు రూపం మీద ధ్యానం చేస్తున్నావు, కాని రాముని మీద కాదు' అని అన్నారు.

మనం రూపం మీద ధ్యానం చేయకూడదు. రియాలిటీ మీద ఆ దివ్యశక్తి (డివైన్ పవర్) మీద ధ్యానం చేయాలి.

ఒకసారి పది మంది అభ్యాసీలు షాజహాన్‌పూర్ వచ్చి మూడు రోజులు బాబూజీ ఇంటిలో వున్నారు. నాల్గవ రోజున వాళ్ళు వెళ్ళిపోయే ముందు, బాబూజీ "భాయీ! మీరందరూ నన్ను కల్సుకోవడానికి ఎంతో దూరం నుండి వచ్చినారు. కాని నేను మిమ్మల్ని కల్సుకోలేకపోయినందుకు చింతించుచున్నాను" అని అన్నారు. అప్పుడు వెంటనే ఈశ్వర్‌సహాయ్‌జీ "హుజూర్! వీళ్లందరు మూడు రోజుల నుండి మీ ఎదుటనే కూర్చొని వున్నారు కదా!" అని అన్నారు. అప్పుడు వారు, 'అవును నిజమే మీరందరు నా ఎదుటనే కూర్చొని వున్నారు. కాని మీరు శరీరం అనే ఈ కవరింగ్ (ముసుగు)నే చూస్తున్నారు. ఈ కవరింగ్ (శరీరం) లోపల వున్నటువంటి రియాలిటి (డివైన్ పవర్)ని మీరు చూడడం లేదు' అని అన్నారు. ఈ విధంగా ధ్యానం ప్రారంభించిన మొదటి రోజునుండే, 'డివైన్ (భగవంతుడు) నీ హృదయంలోనే వున్నాడు' అని బాబూజీ మనకు తెలిపారు.

ప్రతి సెంటర్‌లో కూడా సత్సంగ్ తరువాత బాబూజీ మహారాజ్ వ్రాసిన పుస్తకాలను చదువుతారు, ఇది మంచిదే. కాని బాబూజీ పుస్తకాలలో

వ్రాసిన వాటికి మీరు వివరణ ఇవ్వకూడదు, వాటికి మీ స్వంత అర్థం చెప్పితే - స్వంత వివరణ ఇస్తే అది తప్పు అవుతుంది.

ఒకసారి షాజహాన్‌పూర్ ఆశ్రమంలో ప్రిసెప్టర్స్ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో డివోషన్ అంటే ఏమిటి? అనే ఒక ప్రశ్న వచ్చింది. ప్రిసెప్టర్లు కూడ రకరకాల జవాబులు చెప్పినారు. అప్పుడు బాబూజీ నా వైపు చూస్తూ "బిఠియా! నీవు ఎందుకు మౌనంగా కూర్చున్నావు? నీవు చెప్పు" అని చిరునవ్వుతో అన్నారు. "మీ పాదాల వద్ద వున్న అభ్యాసీ దివ్యత్వం అనే సముద్రంలో లోతుగా మునిగిపోయి మరల బయటకు రాకూడదు. ఆ దైవీయ సాగరంలోనే మునిగిపోయి 'నేను (అహం) అనేది చనిపోవుటయే" అనే మాటలు ఒక్కసారిగా నా నోటి నుండి వెలువడినాయి.

ఏదయినా పనిలో మునిగిపోయి, బాబూజీని మరచిపోయినప్పటికిని, 2, 3 గంటల తరువాత 'వారు' గుర్తుకు రాగానే అయ్యో! నేను ఇప్పటి వరకు బాబూజీని మరచిపోయినాను, అని మీరు ఎట్టి పరిస్థితులలోను అనుకోవద్దు, 'బాబూజీ! నేను నీ వాడిని! ఇప్పటి వరకు మీ పాదాల వద్దనే వున్నాను' అని అనుకోవాలి. ఆ ఫీలింగ్ (ఆ అనుభూతిని - ఆ భావనను) కల్గి వుండాలి.

ఒకసారి నేను "బాబూజీ! నా శరీరంలోని అణువణువు కూడ బ్యాలెన్స్‌డ్ కండిషన్ (సమతా స్థితి) లో వున్నట్లుగా అనిపించుతున్నది. ఎవరయినా కావాలంటే నా స్థితిని పరీక్షించవచ్చు. ఈ స్థితిలో ఎటువంటి వైబ్రేషన్స్ (స్పందనలు) కూడ లేవు' అని వ్రాసినాను. అపుడు వారు 'బిఠియా! లాలాజీ సాహెబ్‌కు కృతజ్ఞతలు. ఇదే సెయింట్ యొక్క స్థితి' అని నాకు వ్రాసినారు.

శ్రీ రామకృష్ణ పరమహంస యొక్క స్పర్శ (ప్రాణాహుతి) వలన నరేంద్రునిలో వివేకం మేల్కొన్నది. ఆ వివేకంతో సాధన ఫలితంగా ఆనందం

లభించింది. అందువలన నరేంద్రుడు, వివేకానందుడు (వివేక్+ఆనంద్) అయినాడు. అంతేకాదు ఆధ్యాత్మికత మీద ఆధిపత్యాన్ని సంపాదించుట వలన అతడు స్వామి అయినాడు. స్వామి వివేకానంద యొక్క అర్థం ఇదే. స్వామీజీ కర్మయోగం, భక్తియోగం, జ్ఞానయోగం అనే మూడు పుస్తకాలను వ్రాసినారు. వీటిలో ఏ ఒక్క దాన్ని ఆచరించినా భగవంతుని పొందగలరు అని స్వామీజీ శిష్యులు అంటారు. కాని మన సహజమార్గ్ సాధనలో కర్మ, భక్తి, జ్ఞాన యోగాలు ఈ మూడూ ఇమిడి ఉన్నాయి. మనం ఇంటిపని, ఆఫీస్ పని లేదా ఏ పని చేయుచున్నా సరే, బాబూజీ స్మరణలో కూడా పనిచేస్తాము. ఇది కర్మయోగం. మనం బాబూజీని ప్రేమతో స్మరించడానికి ప్రయత్నిస్తాము. ఇది భక్తియోగం. మన సంస్థలో జ్ఞానానికి స్థానం లేదు. కాబట్టి సాధనలో పొందిన అనుభూతియే జ్ఞానయోగం.